అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 1-5-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 121 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



పోరాడే వారికి ఉరికొయ్యలు కొత్తకాదు. మేడే వీరులను ఉరితీసిన కొయ్యలే భగత్‌సింగ్‌నూ ఉరితీశాయి. వాటి సూక్ష్మ రూపం ఒక్కటే. ఆ వ్యవస్థనే రద్దుచేసి ఆ మృతవీరుల ఆశయాలకు కొత్త ఊపిరి పోస్తుంది రేపటి ఉదయం.

మీ గుర్తుగా మా గుండెలల్లో నెత్తుటి స్థూపాలు కడతాం

చికాగో అమరులకు ఈ మేడే సందర్భంగా ఇంతకు మించిన నీరాజన మేముంటుంది? ఓ యువ కవి రాసిన పై గీత చరణం వయసు తక్కువే. కాని దానిలో దాదాపు ఒకటిన్నర శతాబ్దాల చరిత్ర ప్రతిధ్వనిస్తోంది. పెట్టుబడి పొట్టన పెట్టుకున్న ఆ వీరులను ఇన్నేండ్లుగా ప్రపంచ కార్మికోద్యమం కంటిపాపలకన్నా భద్రంగా చూసుకుంటున్నది. ఉరితీయబడ్డ ఆ శిరస్సులు అస్తమించిన రోజు నుండే ప్రశ్నలెన్నో ఉదయిస్తూనే ఉన్నాయి. దానికి ముందూ, ఆ తర్వాత కూడా ఎందరో కార్మిక నాయకుల్ని, సాధారణ కార్మికులను రాజ్యం మట్టుబెట్టింది. యంత్రాల విధ్వంసానికి పాల్పడ్డ లుడ్డైట్‌లను 1812, 1813లో కాల్చిచంపింది బ్రిటన్ ప్రభుత్వం. ఆ దేశ సిఆర్‌పిసీనే సవరించి యంత్రాన్ని ధ్వంసం చేసినా ఉరిశిక్షలు ఖాయం చేసింది. 1871లో పారిస్ కమ్యూన్‌ను అణిచివేసేందుకు విమానాల ద్వారా బాంబులు కురిపించింది ఫ్రెంచ్ ప్రభుత్వం. ఇవి 1886కు ముందు ఘటనలు. 1940ల్లో నాజీ నరహంతకులను ఎదిరించేందుకు సోవియట్ పౌరులు రెండు కోట్ల మంది ఆహుతయ్యారు. వారి రక్తతర్పణే లేకుంటే వలస వ్యవస్థ కూలిపోయేఉండేది కాదు. మన దేశంతో సహా ఎన్నో దేశాలు సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి విముక్తి పొందేవేగావు. వేటికవే సాటిలేని త్యాగాలవి.

అయినా, మేడే అమరులెందుకు చిరస్మరణీ యులుగా నిలిచారు? ఎందుకంటే, వారు సవాలు చేసింది పెట్టుబడిదారీ వ్యవస్థను. ఆ వ్యవస్థకు ఇంధనం అదనపు విలువ. ఆనాడు అదనపు విలువ పిండుకోవడానికి అధిక పనిగంటలు ప్రధాన సాధనం. అందుకే దాన్ని

> కేంద్ర పాలకుల పుణ్యాన సాధించుకున్న హక్కులు, పెట్టుబడి కోసం వధ్య శిలపై ఎక్కించబడ్డాయి. ఇప్పటికే ఎన్నో బలయ్యాయి కూడా. సాంకేతి కంగా రేపు "మోడీ 3.0" పాలన వస్తుందా లేదా అనేదాని కంటే కార్పొరేట్ స్వామ్యాన్ని అంతమొందించే దిశగా కార్మికోద్యమం సాగాలి.

రక్తపుటేరుల్లో ముంచెత్తారు ఆనాటి అమెరికన్ పాలకులు. పెట్టుబడిదారులు తమ దోపిడీ పద్ధతులను ఎప్పటికప్పుడు పదును చేసుకున్నట్లే, కార్మికవర్గమూ రాటుదేలాలి కదా! ప్యారిస్ కమ్యూన్ వైఫల్యం తర్వాత కార్మిక, కర్షక ఐక్యత కీలకంగా ముందుకొచ్చింది. కార్మికవర్గం తనను తాను విముక్తి చేసుకోవాలంటే ఇతర కష్టజీవుల్నీ విముక్తి చేయాలి. "మధ్యయుగాల్లో మున్సిపాలిటీలను, కమ్యూన్‌లను ఉపయోగించుకుని ఫ్యూడల్ ప్రభువులపై విజయవంతంగా తిరగబడింది పెట్టుబడిదారీ వర్గం. అలానే ట్రేడ్ యూనియన్‌లను ఉపయోగించి పెట్టుబడిదార్లపై కార్మికోద్యమం దాడి చేయాల"ని మార్క్స్ ఆశించాడు. మన ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఏ స్థాయిలో ఉందో నేడు మనం సమీక్ష చేసుకోవడం మేడేకు శోభనిస్తుంది.

తెలుగు రాష్ట్రాలకు మే 13 కీలకం. విశ్వ గురువు వేషధారణో, జి-20 పటాటోపమో, 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్న ప్రచారమో విని, చూసి ఆ ఒక్క రోజూ ఏమరుపాటుకు లోనైతే దేశ ఆర్థిక వ్యవస్థ కార్పొరేట్ల వశమవడమేకాదు, భారత రాజ్యాంగమే మనువు పాలబడ్తుంది. ప్రభుత్వరంగ పరిశ్రమలు, ప్రభుత్వ సేవలు కలికానికి కూడా కనపడకుండా పోతాయి.

ఇటీవల ప్రచురితమైన సీఎస్‌డీఎస్-లోక్‌నీతి సర్వే ఈ ఎన్నికల్లో ఆర్థికాంశాలే కీలకం కానున్నాయని తేల్చింది. పరిమితమైన ఉపాధి అవకాశాలు, ఆకాశాన్నంటుతున్న ధరలు, పెచ్చరిల్లిన అవినీతి, పెరిగిన గ్రామీణ దారిద్ర్యం, దిగజారుతున్న గృహ వినియోగం కీలకంగా మారనున్నాయని ఆ సర్వే తేల్చింది.

మరోసారి ఎన్నికల సమరాంగణాన మేడే వచ్చింది. కేంద్ర పాలకుల పుణ్యాన సాధించుకున్న హక్కులు, పెట్టుబడి కోసం వధ్య శిలపై ఎక్కించబడ్డాయి. ఇప్పటికే ఎన్నో బలయ్యాయి కూడా. సాంకేతికంగా రేపు "మోడీ 3.0" పాలన వస్తుందా లేదా అనేదానికంటే కార్పొరేట్ స్వామ్యాన్ని అంతమొందించే దిశగా కార్మికోద్యమం సాగాలి. పోరాడేవారికి ఉరికొయ్యలు కొత్తకాదు. మేడే వీరులను ఉరితీసిన కొయ్యలే భగత్‌సింగ్‌నూ ఉరితీశాయి. వాటి సూక్ష్మ రూపం ఒక్కటే. ఆ వ్యవస్థనే రద్దుచేసి ఆ మృతవీరుల ఆశయాలకు కొత్త ఊపిరి పోస్తుంది రేపటి ఉదయం.

ఆర్ సుధాభాస్కర్

మోడీ తెలంగాణకిచ్చింది గాడిదగుడ్డే

బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలే..ఆలోచన చేయాలే..


- సెమీఫైనల్‌లో కేసీఆర్‌ను చిత్తుగా ఓడించాం
- ఫైనల్స్‌లో మోడీని గుజరాత్‌కు, బీజేపోళ్లను సూరత్‌కు పంపాలే..
- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందానికి కేసీఆర్ వ్యాఖ్యలే నిదర్శనం
- ఇది గమనించే కాంగ్రెస్‌కు కమ్యూనిస్టుల మద్దతు : జమ్మికుంట, రేగొండ బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కరీంనగర్‌లో రాజేందర్‌రావును, వరంగల్‌లో కడియం కావ్యను గెలిపించాలని విజ్ఞప్తి



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / జమ్మికుంట/భూపాలపల్లి

"పదేండ్లలో మోడీ తెలంగాణకు ఇచ్చింది గాడిదగుడ్డే.. బీజేపీ మళ్లీ గెలిస్తే దేశానికే ప్రమాదకరం.. రిజర్వేషన్లను ఎత్తేస్తారు.. 400 సీట్లలో గెలిపిస్తే రాజ్యాంగాన్నే మారుస్తామని చెబుతున్నారు.. సెమీ ఫైనల్లో కేసీఆర్‌ను ఓడించాం.. ఫైనల్లో గుజరాత్ గులాములను ఓడిస్తాం.. మోడీని గుజరాత్‌కు, బీజేపోళ్లను సూరత్‌కు పంపాలి.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం జరిగిందనేందుకు

...6లో



అబద్ధాల ప్రధానిది డంబాచారమే

అసలు సినిమా ముందుందట..అదేంటో బీజేపీ చెప్పాలి...

నిజానిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : బీజేపీ బందిఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం బుక్‌లెట్ ఆవిష్కరణలో బీవీ రాఘవులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదేండ్ల మోడీ పాలన ముదనష్టంగా ఉందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, డీజీ నర్సింహారావులతో కలిసి 'బీజేపీ బందిఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దాం' బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ

...7లో





కాంగ్రెస్-బీఆర్ఎస్ తోడు దొంగలే..

రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలుతో మోసం

- రాజ్యాంగాన్ని గౌరవించే మొదటి వ్యక్తిని నేను..
- రాజ్యాంగంపై రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం మానుకోవాలి: మెదక్, జహీరాబాద్ ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోడీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ తోడు దొంగలని, తెలంగాణను దోచుకోవడంలో ఒకే గూటి పక్షులని, తెలుగులో వచ్చిన ట్రిపుల్ ఆర్ సినిమాలా రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో అధిక ట్యాక్స్‌లు వసూలు చేసి నల్ల ధనాన్ని ఢిల్లీకి పంపిస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

...7లో

ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ నెరవేర్చలే

మాయ మాటలు చెప్పి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్

బీజేపీ,కాంగ్రెస్ రెండూ ఒకటే : కొత్తగూడెం రోడ్ షోలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

నవతెలంగాణ -కొత్తగూడెం



"కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదు. గిరిజనులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధికంగా పోడు పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుంది" అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కే.చంద్రశేఖర రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో జరిగిన రోడ్డు షోలో కేసీఆర్ మాట్లాడారు. గిరిజన బిడ్డలకు పాలన అందాలని కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేశామన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలను తగ్గిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లా ఉండాలా.. తీసేయాలా.. అని సభికులను కేసీఆర్ అడిగారు. జిల్లా ఉండాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మోసపు వాగ్దానాల వల్ల రైతు బంధు, రైతు బీమా రాలేదని, తులం బంగారంతో కల్యాణ లక్ష్మి, మహిళలందరికీ మహాలక్ష్మి స్కీం ద్వారా రూ.2,500 నేటికీ అందలేదని విమర్శించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ

...6లో

దండకారణ్యంలో మళ్లీ పేలిన తూటా

ఛత్తీస్‌గఢ్‌లో 10 మంది మావోయిస్టులు మృతి

15 రోజుల వ్యవధిలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్

ఈ ఏడాదిలో 91 మంది హతం.. 8లో..



టెన్త్‌లో 91.31 శాతం ఉత్తీర్ణత

గతేడాది కంటే 4.71 శాతం పెరుగుదల

- బాలికలదే పైచేయి
- బాలుర కంటే 3.81 శాతం అధికంగా పాస్
- 8,883 మందికి పదికి పది సీజీపీఏ
- గతేడాది కంటే 2,720 మంది ఎక్కువ
- 3,927 పాఠశాలల్లో వందశాతం పాస్
- గతేడాదికంటే 1,134 స్కూళ్లు అధికం
- ఆరు ప్రయివేటు బడుల్లో సున్నా ఫలితాలు
- అగ్రస్థానంలో నిర్మల్, అట్టడుగున వికారాబాద్

జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ : ఫలితాలు విడుదలచేసిన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

6లో..

పోరాట స్ఫూర్తి మేడే



- కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడుదాం
- 5 రోజుల పనిదినాలు..6గంటల పని దినం సాధించుకుందాం
- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నేడు కార్మిక మహా ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు దాటిన నేటికీ దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయ్.. కానీ తగ్గడం లేదు. అందుకని ఆర్థిక స్వాతంత్య్రం వచ్చినప్పుడు నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టే. మోడీ పదేండ్ల పాలనలో సంపాదన కేంద్రీకరణ తప్పిస్తే.. వికేంద్రీకరణ జరగలేదు. కార్పొరేట్ శక్తులకు లాభం తప్పా.. కార్మికులకు కష్టజీవులకు ఒరిగింది ఏమీ లేదు. నిజ వేతనాలు నానాటికీ దిగజారిపోతున్న పరిస్థితి. మోడీ ఎన్నికల ముందు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి..ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. పర్మినెంట్ జాబ్స్ లేవు. కేవలం టెంపరరీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్స్, పీస్ రేట్ పద్ధతుల్లో ప్రయివేటు, ప్రభుత్వ సంస్థల్లో రిక్రూట్‌మెంట్ జరుగుతోంది. ఫలితంగా దేశంలోని కార్మికుల బతుకులు గ్యారంటీ లేనివిగా తయారయ్యాయి. తుమ్మితే ఊడిపోయే ముక్కులాగా.. దినదిన గండం నూరేండ్ల ఆయుష్షు అన్నట్టుగా మారింది. కాబట్టి ప్రయివేటు లేదా ప్రభుత్వ రంగంలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కావాలని సీఐటీయూ డిమాండ్ చేస్తున్నది. సమాన పనికి సమాన వేతనమివ్వాలని కోరుతున్నది. శ్రామిక మహిళలపై శ్రమ దోపిడి వేధింపులు, వివక్షత ఎక్కువయ్యాయి. అందుకు స్కీమ్ వర్కర్స్ ప్రత్యక్ష ఉదాహరణ అని చెబుతున్నది. కావునా మేడే స్ఫూర్తితో కార్మిక లోకం ఏకమై.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం. మతోన్మాద, విచ్ఛినకర శక్తులను ఈ ఎన్నికల్లో ఓడిద్దామని కార్మికులకు సీఐటీయూ పిలుపునిస్తోంది.

ప్రస్తుతం పెరిగిన టెక్నాలజీ, ఉత్పత్తి.. మొత్తం కార్పొరేట్ శక్తుల అధీనంలో ఉంటుంది. 140 కోట్ల మంది ప్రజలకు ఈ టెక్నాలజీ ప్రతిఫలాలు దక్కడం లేదు. అందుకని 8 గంటల పనిదినం స్థానంలో 6 గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టాలని సీఐటీయూ డిమాండ్ చేస్తున్నది. వారానికి అయిదు రోజుల పనిని కల్పించాలి. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలో వారానికి 5 రోజులు.. రోజు 6 గంటల పనిదినం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలు, హక్కులను రక్షించుకోవాలి. కార్మిక వర్గం ఐక్యతను మరింత బలపర్చాలి. మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద బీజేపీ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలి.

కార్మిక మహా ప్రదర్శన విజయవంతం చేయాలి



గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ పరిధిలో ఉన్న అన్ని యూనియన్లు, అడ్డాలలో ఉదయం 9గంటలలోపు జెండా ఆవిష్కరణలు పూర్తి చేసుకోవాలి. 10గంటలకు వైఎంసీహెచ్ చౌరస్తా నారాయణగూడ నుంచి ప్రారంభం కానున్న ప్రదర్శనలో తప్పకుండా పాల్గొనాలని సమస్త కార్మిక వర్గానికి సీఐటీయూ తరపున విజ్ఞప్తి చేస్తున్నాం.

– ఎం. వెంకటేష్, కార్యదర్శి, గ్రేటర్ హైదరాబాద్



హైదరాబాద్‌లో ఎండలు దంచి కొడుతున్నాయి. వేడి గాలులు వీస్తున్నాయి. ఎండల వేడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటలకే 40 డిగ్రీల ఎండ ఉష్ణోగ్రతలు నమోదుతున్నాయి. కావున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అవసరమైతేనే బయటికి రావాలని.. వాతావరణ శాఖ సూచిస్తోంది. రానున్న మరో 5 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ ఉద్యోగుల పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తున్న పలువురు ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ పొందారు. హాస్పిటల్‌లోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ నగరి బీరప్ప వారిని ఘనంగా సత్కరించి వారు హాస్పిటల్‌కు చేసిన సేవల్ని కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో నాలుగో తరగతి ఉద్యోగిని గడ్డం విమల, సీనియర్ పర్సనల్ సెక్రెటరీ డేవిడ్ రాజు, సీనియర్ సెక్రెటరీయల్ అసిస్టెంట్ టి.వి.ఎస్.ఆర్ కే శర్మ, సీనియర్ సెక్రెటరీయల్ అసిస్టెంట్ (వీఆర్ఎస్) టి.విజయలక్ష్మి, హెడ్ నర్సు అరుణ పవలూరి, పార్వతి చిలువూరి, షేక్ బషీర్ అహ్మద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతీవీర్, డాక్టర్ తేజ, డాక్టర్ నాగేశ్వర్‌రావు, వివిధ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



గౌతమ్ మోడల్ స్కూల్ ఉత్తమ ప్రతిభ

నవతెలంగాణ-కాప్రా

బొల్లారంలోని గౌతమ్ మోడల్ స్కూల్ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. అత్యుత్తమ ఉపాధ్యాయ బృందం ప్రతి ఒక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వాళ్ళ విద్యార్థులు అధిక మార్కులు సాధించ గలిగారు అని ప్రిన్సిపల్ తెలియజేశారు

అర్బన్ వర్క్ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

అర్బన్ వర్క్, ఫ్లెక్సీ స్పేస్ పరిశ్రమలో ముదంజలో ఉన్న పేరు, వీరు తమ కొత్త కేంద్రాన్ని రహేజా మైండ్ స్పేస్, హై టెక్ సిటీ వద్ద ప్రారంభించారు. ఈ అత్యాధునిక వర్క్ స్పేస్ 50వేల చదరపు అడుగులు వ్యాపించి 900 మంది కూర్చునే సౌకర్యం కలిగిస్తుంది. ఈ చొరవ 50, 500 మధ్య ఉద్యోగుల సంఖ్య గల విస్తృత శ్రేణి సంస్థలకు సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ ట్రాక్ రికార్డ్‌కు అనుగుణంగా, కొత్తగా ప్రారంభించిన ఈ కేంద్రం నేటి వ్యాపారాలు, నిపుణుల విభిన్న అవసరాలను తీర్చగల చురుకైన పని వాతావరణాలను అందించడానికి అర్బన్ వర్క్ నిబద్ధతను సూచిస్తుంది.



కావలి మల్లేష్ (ఫైల్‌ఫోటో)

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-శామీర్ పేట

చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో నీటమునిగి మృతి చెందిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూఢుచింతలపల్లి మండలం ఆద్రాస్ పల్లి గ్రామ అనుబంధ గ్రామానికి చెందిన కావలి మల్లేష్ (55) ఈ నెల 29న ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎల్లగూడెం వాగు చెరువు లో చేపలు పట్టడానికి వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు వాగు దగ్గర వెతకగా మల్లేశం బట్టలు, ఫోన్, వాహనం కనిపించాయి. అయితే మరుసటి రోజు 30న ఉదయం 8 గంటల ప్రాంతంలో ఎల్లగూడెం చెరువులో మల్లేశం మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

శ్రమ లేకుండా ఏదీ వర్ధిల్లదు - సోఫోకిల్స్

మేడే స్ఫూర్తితో కార్మికుల రక్షణ కోసం పోరాడుదాం..





- రైతు - కార్మిక వ్యతిరేకి బీజేపీని ఓడిద్దాం
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మే డే స్ఫూర్తితో కార్మికుల రక్షణ కోసం పోరాడుదాం.. రైతు కార్మిక వ్యతిరేకి బీజేపీని ఓడిద్దాం అని సీఐటీయూ మేడ్చల్-మల్కాజి గిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. బీజేపీ వికసిత భారత్, రామరాజ్య స్థాపన వంటి నినాదాలతో ప్రజల ను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావడానికి జిమ్మిక్కులు చేస్తుందన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్య లు ప్రజలను వేధిస్తున్నాయనీ, ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక వర్గం బాధ్యతగా ఆలోచించి కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించా లని సీఐటీయూ పిలుపునిస్తుందని తెలిపారు. కనీస వేతనం రూ.26వేలు ఇస్తే తప్ప నేడు కార్మికుడు కనీసం బతలేని పరిస్థితి ఉందనీ, బీజేపీ ప్రభుత్వం మినిమం వేజ్ రోజుకి రూ. 178గా నిర్ణయించిం దన్నారు. ధరలు తగ్గిస్తాం అని అధికారం లోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచే విధంగా ధరలు పెంచిందన్నారు. గ్యాస్ ధర 2010లో రూ.410 ఉంటే, 2024లో రూ.895, పెసర పప్పు రూ.97 నుంచి రూ.180కి పెరిగిందన్నారు. మినప పప్పు రూ.79 నుంచి రూ.179 కి పెరిగిందన్నారు. కందిపప్పు రూ.75 నుంచి రూ.180 కి పెరిగిందనీ, కార్మికుల జీతాలు మాత్రం పెరగలేదన్నారు. పదేండ్ల నుంచి కనీస వేతనాల జీఓ లను కూడా సవరించలేదన్నారు. 2014లో ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ, ప్రభుత్వరంగ సంస్థలు, పర్మినెంట్ ఉద్యోగాలను పో గొట్టిందన్నారు. కాం ట్రాక్టు కార్మికులతో పని చేపి స్తున్నట్టు చెప్పారు. దేశం నిరుద్యోగ సమస్యతో తాండవిస్తుందన్నారు. విభజన చట్టంలో భాగం గా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధితో ఏర్పాటు కావాల్సిన ఐటీఐఆర్ ప్రాజెక్టను ఈ పదేండ్లలో ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఫండ్ ఇవ్వకుండా కేంద్రం అన్యా యం చేసిందన్నారు. ఏడా దికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తాం అన్న వాగ్దానాలను తుంగలో తొక్కిన బీజేపీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలం గా మార్చి 4 లేబర్ కోడ్స్ తెచ్చిన బీజేపీకి ఎందుకు ఓటేయా లని ప్రశ్నించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీలకు రావా ల్సిన కేంద్ర ప్రభుత్వ గ్రాండ్లు ఇవ్వకుండా రాష్ట్రానికి తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ, ధ్యాహ్న భోజనం, దాదాపు 70 నుంచి స్కీంలకు బడ్జెట్‌ను తగ్గిస్తూ పేద ప్రజలు, స్కీం వర్కర్లు, ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ధరల పెరుగుదలకు కారణమైన బీజేపీని ఓడిద్దామని పిలుపునిచ్చారు.

మున్సిపల్, జీపీ కార్మికులకు బీజేపీ అన్యాయం

తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాస్



మున్సిపల్ గ్రామపంచాయతీ కార్మికులకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తుంది. వచ్చే ఎన్ని కల్లో బీజేపీని ఓడించాలి. గ్రామ పంచాయతీ లు, మున్సిపాల్టీలకు రావాల్సిన కేంద్రం వాటాను ఇవ్వ కుండా మున్సిపల్ కార్మికులకు అన్యాయం చేస్తుం ది.వ్యతిరేకంగా ఎన్నికల్లో బీజేపిని ఓడించాలి. మే డే స్ఫూర్తితో పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.



స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి హేమలత, రేవతి కళ్యాణి



స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారానికి వచ్చి పదేండ్లు దాటింది. కానీ స్కీం వర్కర్లకు ఇంత వరకు జీతం పెంచడం కానీ, వారికి ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించడంలో విఫలమైంది. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, రూ.10 వేలు పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. మతతత్వ, కార్పొరేట్‌లకు మద్దతు పలుకుతున్న బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉంది. మే డే స్ఫూర్తితో పోరాటం చేయాలి.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి జి.సునిత, బి.శోభారాణి



అంగన్‌వాడీలకు బీజేపీ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఏం చేసింది. ఇప్పటికే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. కనీస వేతనం రూ. 26వేలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి. కానీ ఐసీడీఎస్‌లకు ఇవ్వాల్సిన బడ్జెట్‌ను తగ్గిస్తూ ఐసీడీఎస్‌ను నిర్వీరం చేస్తున్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదు. వారికి పని భారం పెంచుతూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు. అంగన్‌వాడీలు తమ హక్కుల కోసం మేడే స్ఫూర్తితో పోరాటం చేయాలి. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి.





'సికింద్రాబాద్'లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

- సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్



నవతెలంగాణ-ముషీరాబాద్

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఎమ్మెల్యే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం రామ్ నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్, దాయారం చేపల మార్కెట్, రీసాల తదితర ప్రాంతాల్లో అభ్యర్థి దానం నాగేందర్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్ కల్పన యాదవ్, వాజీద్ హుస్సేన్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్ కుమార్ తో కలిసి జీప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎండను లెక్కచేయకుండా కార్యకర్త లు పెద్ద ఎత్తున తరలివచ్చారని, ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ చూపారన్నారు. సనత్ నగర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో భారీగా చేరికలు జరిగాయని తెలిపారు. ఇదే పద్ధతిలో ఇంకో పది రోజులు కష్టపడాలన్నారు. ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయ మన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం లో ప్రజల నుండి అడుగడుగున మంచి స్పందన లభిస్తుంద న్నారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఇతర పార్టీ నాయకులు కనుమరుగవు తున్నారని ఓటమి భయంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.














గాజా మారణకాండపై

విద్యార్థుల ఆందోళనలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండకు వ్యతిరేకంగా అనేక చోట్ల ముఖ్యంగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో వెల్లడైన విద్యార్థుల నిరసన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. దాని ప్రభావం ఇతర దేశాల మీద కూడా పడుతుండటంతో మొగ్గలోనే తుంచి వేయాలన్నట్లుగా అణచివేసేందుకు దమన కాండ జరుపుతున్నారు.జనాన్ని తప్పుదారి పట్టించేందుకు వక్రీకరణలతో ప్రచారం చేస్తున్నారు.విద్యార్థులకు ద్రవ్య పెట్టుబడి దారు జార్జి సోరోస్, ఇతరులు నిధులు అందచేస్తున్నారు. అది యూదు వ్యతిరేక ఆందోళన, బయటి వారు చేరారంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులు విశ్వవిద్యాలయాల ప్రాంగణాలలో గుడారాలు వేసుకొని నిరసన తెలుపుతున్నారు.వారికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జార్జి సోరోస్ కుటుంబానికి చెందిన సంస్థలు, రాక్‌ఫెల్లర్ సోదరుల నిధి, బ్యాంకర్ ఫెలిస్ గెల్‌మాన్ తదితరులు పెద్ద మొత్తంలో విరాళాలు ఇస్తున్నారన్నది ఆరోపణ. ఢిల్లీ శివార్లలో రైతుల ఆందోళనలో పాల్గొన్నవారి మీద కూడా ఇలాంటి నిందలే వేశారు. రైతులైన వారు ఖరీదైన కార్లలో ఎలా వచ్చారని ప్రచారం చేసినట్లుగానే అమెరికా విద్యార్థులకు అవసరమైన గుడారాలు, అక్కడ ఉంటూ తింటున్న పీజాలు, బర్గర్లకు డబ్బు ఎక్కడిది, ఆందోళనలో ఉన్నవారందరూ కలిగిన ఉన్నత కుటుంబాలకు చెందినవారు కాదా అంటూ ప్రశ్నిస్తున్నారు.పాలస్తీనియన్ల హక్కుల కోసం పనిచేసే వారిలో నెలకు 2,880 నుంచి 7,800 డాలర్ల వరకు స్టైఫండ్ పొందుతున్నవారు ఉన్నారని, విదేశీ నిధులు వస్తున్నాయని, విశ్వవిద్యాలయాల పరిసరాల్లో తిష్టవేసి వేరే పనిపాట లేకుండా ఆందోళనలను రెచ్చగొట్టేందుకు మాత్రమే పనిచేసే వారున్నారని ఇలా ఎన్నో ప్రచారాలు.

విద్యార్థులు, వారికి మద్దతిస్తున్న అకడమీషియన్లు ముందుకు తెస్తున్న డిమాండ్లేమిటి ? మొత్తంగా చూసినపుడు గాజా మీద ఇజ్రాయిల్ మారణకాండను తక్షణమే నిలిపివేయాలన్నది ప్రాధమిక అంశం.

గాజా పౌరులు ఎదుర్కొంటున్న ముప్పుకంటే తామెదుర్కొంటున్నది చాలా స్వల్పమని విద్యార్థులు బదులిస్తున్నారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా వెయ్యి మంది బోధనా సిబ్బంది విశ్వవిద్యాలయ అధ్యక్షుడికి ఒక లేఖ రాశారు. సమాజంలో ఆర్థిక పరమైన అంశాలతో జరిగే ఆందోళనలకు విద్యార్థులు మినహాయింపు కాదు. గత కొద్ది రోజులుగా అమెరికా, ఐరోపాల్లో జరుగుతున్న ఆందోళనల వెనుక ఆర్థిక డిమాండ్లు లేవు. గాజాలో మారణకాండ సాగిస్తున్న యూదు దురహంకార ఇజ్రాయిల్, దానికి సంపూర్ణ వత్తాసు పలుకుతున్న తమ పాలక వర్గాలకు వ్యతిరేకంగా చైతన్యయుతంగా సాగిస్తున్న ఉద్యమం ఇది.

ఇజ్రాయిల్‌తో సంబంధం ఉన్న లేదా ప్రస్తుత దాడులతో లబ్దిపొందుతున్న ఆయుధ సంస్థలలో ఉన్న వందల కోట్ల డాలర్ల పెట్టుబడులను విశ్వవిద్యాలయాలు ఉపసంహరించాలి. కొలంబియా, హార్వర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు భారీ మొత్తాలలో ఇలాంటి కంపెనీలలో పెట్టుబడులు పెట్టి వచ్చిన లాభాలను సిబ్బందికి వేతనాలు, స్కాలర్‌షిప్పులు, ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నాయి. ఇజ్రాయిల్‌తో ఉన్న అకడమిక్ సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలి. గాజాలో దాడుల నిలిపివేతతో సహా మానవహక్కుల పరిరక్షణ ఉద్యమాలకు విశ్వవిద్యా లయాలు మద్దతివ్వాలి. పాలస్తీనాకు మద్దతు ఇస్తున్న విద్యార్థులపై దమనకాండ నిలిపివేయాలి. విశ్వవిద్యాల యాల పెట్టుబడులను ఉపసంహరించు కోవాలన్న డిమాండ్ కొత్తదేమీ కాదు. గతంలో దక్షిణాఫ్రికాలో జాత్యహంకార పాలకులతో, ప్రభుత్వాలతో సంబంధాలున్న సంస్థల నుంచి 155 విశ్వవిద్యాలయాలు పెట్టుబడులను వెనక్కు తీసుకున్నాయి, సంబంధాలను తెగతెంపులు చేసుకున్నా యి. అంతే కాదు అమెరికాలో ప్రయివేటు జైళ్ల నిర్వహణ కంపెనీలు, పర్యావరణానికి హానిచేసే చమురు కంపెనీలలో పెట్టుబడులను కొన్ని విద్యాసంస్థలు వెనక్కు తీసుకున్నాయి. ఇక ఇజ్రాయిల్ దుశ్చర్యలను సమర్ధించేవారు దానితో సంబంధాలున్న సంస్థల నుంచి పెట్టుబడులను వెనక్కు తీసుకోవటం చట్టవిరుద్ధం, ఇజ్రాయిల్ నాశనాన్ని కోరుకోవటమే అని వాదిస్తున్నారు.



విద్యార్థుల ఆందోళన ఒక్క అమెరికాకే పరిమితం కాలేదు, ఐరోపాకూ విస్తరించాయి.లండన్ విశ్వవిద్యాలయ కాలేజీ విద్యార్థులు ప్రదర్శన చేశారు. గాజా మారణకాండ నిలిపివేయాలని, ఇజ్రాయిల్ నేరాలకు నిధులు ఇవ్వరాదంటూ బ్రిటన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఫ్రెంచి రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత పో యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల విద్యార్థుల ప్రదర్శనకు పోటీగా ఇజ్రాయిల్ అనుకూలురు రావటంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. పాలస్తీనా అనుకూలురు కాంపస్‌లోని భవనాన్ని ఆక్రమించి జెండాలను ఎగురవేశారు. విశ్వవిద్యాలయ పాలకవర్గం ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. అన్ని విశ్వవిద్యాలయాలకూ ఆందోళన విస్తరించనున్నదని చెప్పారు. టర్కీ, ఆస్ట్రేలియాలో కూడా నిరసన వెల్లడైంది.కెనడాలోని మాంట్రియల్, కాంకోర్డియా విశ్వ విద్యాలయాల విద్యార్థులు కూడా ఆందోళనకు దిగారు. పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ మెక్‌గిల్ విశ్వ విద్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు 5,964(మొత్తంలో 80 శాతం) మంది ఆమోదించిన విధానాన్ని విశ్వవిద్యాలయం గౌరవించాలని డిమాండ్ చేస్తూ ధర్నా ప్రారంభించారు.ఇజ్రాయిల్ కంపెనీలలో ఉన్న పెట్టుబడులను వెనక్కు తీసుకోవాలని, సంబం ధాలను తెంచుకోవాలని కూడా ఆమోదించిన విధానంలో ఉందని వారు గుర్తు చేశారు. విద్యార్థుల అభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటీషన్‌పై విచారణ ముగిసేవరకు పాలస్తీనాకు అనుకూలంగా ఎలాంటి వివాదాస్పద విధానాన్ని ఆమోదించకూడదని విశ్వ విద్యాలయ విద్యార్థి సంఘాన్ని క్విబెక్ ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది.దీన్ని అవకాశంగా తీసుకొని విశ్వ విద్యాలయం విద్యార్థులను బెదిరిస్తున్నది. ఇజ్రాయిల్ కు యుద్ధ విమానాలను సరఫరా చేసిన లాక్‌హీడ్ మార్టిన్, సాఫ్రాన్ అనే ఒక ఫ్రెంచి కంపెనీలో రెండు కోట్ల డాలర కుపైగా ఉన్న మెక్ గిల్ విశ్వవిద్యాలయ పెట్టుబడులను వెనక్కు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఓటింగ్ ను గౌరవించేంత వరకు ధర్నా కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.లండన్‌లో వివిధ తరగతులకు చెందిన వారు రెండులక్షల మంది ప్రదర్శన చేశారు. పాలస్తీనాకు సంఘీభావంగా జరుగుతున్న వాటి లో ఇది పన్నెండవది. ప్రతి ప్రదర్శనలో కొత్తవారు చేరుతు న్నారని నిర్వాహకులు వెల్లడించారు. అమెరికాలో విద్యా ర్థులు వీధుల్లోకి రావటం తమనెంతో ఉత్తేజపరిచిందని చెప్పారు.

అమెరికా విశ్వవిద్యాలయాల్లో యూదు వ్యతిరేక ప్రచారం జరుగుతున్నదని ఆరోపించిన అధికార యంత్రాంగం ఆ సాకుతో విద్యార్థులను అణచేందుకు పూనుకుంది.పలు చోట్ల వందలాది మందిని అరెస్టు చేసింది, అనుమతి లేకుండా ప్రాంగణాలలో ప్రవేశిం చారంటూ తప్పుడు కేసులు బనాయించింది. గుడారాలను తొలగించి ధ్వంసం చేసింది. ఈ చర్యలకు నిరసగా బోస్టన్ తదితర చోట్ల అనేక మంది విద్యార్థులకు మద్దతుగా నినాదాలు చేశారు. తమ కాలేజీతో సంబంధం లేని వారు విద్యార్థుల్లో చొరబడి యూదు వ్యతిరేకతను రెచ్చగొట్టారని, యూదులను చంపాలని ప్రేరేపించారని, దీన్ని సహించేది లేదంటూ కాలేజీ యాజమాన్యం ప్రకటన చేసింది. అలాంటిదేమీ లేదని విద్యార్థులు ఖండించారు. ఇజ్రాయిల్ అనుకూల ప్రదర్శకులే రెచ్చగొడుతూ మాట్లా డారని పేర్కొన్నారు.మసాచుసెట్స్ సాంకేతిక సంస్థ కూడా అలాంటి ఆరోపణలే చేసింది. తొలుత కొలంబియా విశ్వవిద్యాలయ విద్యార్థులు నిరసన ప్రారంభించారు. తరువాత దేశమంతటా వ్యాపించింది. దక్షిణ కాలిఫోర్ని యా విశ్వవిద్యాలయం పట్టాల ప్రదాన కార్యక్రమాన్ని అడ్డుకుంది. సినీదర్శకుడు జాన్ ఎం చు ప్రధానవక్తగా చేయాల్సిన ప్రసంగాన్ని రద్దు చేశారు. పాలస్తీనియన్లకు బహిరంగంగా మద్దతు తెలపటమే అతను చేసిన తప్పిదం.

ఇజ్రాయిల్ దురాగతాలకు వ్యతిరేకత వెల్లడిస్తున్న విద్యార్థుల నిరసనలను అణచివేస్తున్న తీరు అమెరికా చెప్పే మానవహక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వా మ్య కబుర్ల వంచను వెల్లడిస్తున్నది. విద్యార్థుల మీదనే కాదు కొన్ని చోట్ల రోడ్ల మీద ఉన్న ఇతర పౌరులను కూడా అమెరికా పోలీసులు వదల్లేదు. అట్లాంటా ఎమోరీ విశ్వవిద్యాలయంలో టాసర్(విద్యుత్) తుపాకులు, భాష్పవాయు ప్రయోగం కూడా చేశారు. విద్యార్థులపై దమనకాండకు పాల్పడవద్దంటూ అడ్డుకొనేందుకు చూసిన ప్రొఫెసర్ కరోలిన్ ఫోలిన్ను పోలీసులు నెట్టివేశారు. దాంతో ఆమె తలకు గాయమైంది. కొన్ని చోట్ల రబ్బరు బుల్లెట్లను కాల్చారు, అశ్వికదళాన్ని మోహరించారు. మరికొన్ని చోట్ల విద్యాసంస్థల పరిసర భవనాలపై తుపాకులతో కాపాలా ఉన్న భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. పలు చోట్ల మిలిటరీ దుస్తులతో ఉన్న దళాల కవాతు జరిపి భయపెట్టాలని చూశారు. టెక్సాస్ విశ్వవిద్యాలయాన్ని పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో తాము తరగతులను నిర్వహించేది లేదని, ఇతర విద్యా సంబంధ పని కూడా చేసేది లేదని అక్కడి సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు నేషనల్ గార్డులను(మన సిఆర్‌పిఎఫ్ మాదిరి) రంగంలోకి దించాలని సెనెట్ సభ్యుడు జోష్ హాలే డిమాండ్ చేశాడు. నిజానికి అదే చేసి ఉంటే నిరసనలు మరింత తీవ్రంగా ఉండేవి. గాజాలో రోజురోజుకూ దమనకాండ పెరగటం దానికి అమెరికా మద్దతు ఇవ్వటంతో జనంలో పెరుగు తున్న వ్యతిరేకతకు నిదర్శనమే విద్యార్థుల కార్యాచరణ అన్నది స్పష్టం. రెండు దశాబ్దాలకు పైగా విదేశాంగశాఖలో అరబిక్ భాష ప్రతినిధిగా పనిచేసిన హలా హారిట్ గాజాపై అమెరికా విధానానికి నిరసనగా రాజీనామా చేశాడు. ఇదే సమస్యపై గతంలో మరో ఇద్దరు అధికారులు రాజీనామా చేశారు.

ఒక వైపు ఎన్నికలు, మరోవైపు ఇజ్రాయిల్‌కు మద్దతుగా మరింతగా ముందుకు వెళితే నిరసనలు హింసాత్మకంగా మారితే తన పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో జో బైడెన్ ఉన్నట్లుగా చెబుతున్నారు. న్యూయార్క్ విశ్వవిద్యాలయ గౌల్డ్ ప్లాజా భవనాన్ని ఆక్రమించి ధర్నాకు దిగిన వారు ఖాళీ చేయకపోతే శిక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు చేసిన బెదిరింపులను ఖాతరు చేయలేదు. ఇలా అనేక చోట్ల జరిగింది. గాజా పౌరులు ఎదుర్కొంటున్న ముప్పుకంటే తామెదుర్కొంటున్నది చాలా స్వల్పమని విద్యార్థులు బదులిస్తున్నారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా వెయ్యి మంది బోధనా సిబ్బంది విశ్వవిద్యాలయ అధ్యక్షుడికి ఒక లేఖ రాశారు. సమాజంలో ఆర్థిక పరమైన అంశాలతో జరిగే ఆందోళనలకు విద్యార్థులు మినహాయింపు కాదు. గత కొద్ది రోజులుగా అమెరికా, ఐరోపాల్లో జరుగుతున్న ఆందోళనల వెనుక ఆర్థిక డిమాండ్లు లేవు. గాజాలో మారణకాండ సాగిస్తున్న యూదు దురహంకార ఇజ్రాయిల్, దానికి సంపూర్ణ వత్తాసు పలుకుతున్న తమ పాలక వర్గాలకు వ్యతిరేకంగా చైతన్యయుతంగా సాగిస్తున్న ఉద్యమం ఇది. గతంలో వియత్నాంలో అమెరికా సాగించిన దురాక్రమణ మీద పెద్ద ఎత్తున విద్యార్థులు వెల్లడించిన తరువాత ఒక అంతర్జాతీయ సమస్య మీద మరోసారి ఈ పరిణామం సంభవించింది. ఇది కేవలం ఇజ్రాయిల్ తీరునే కాదు దానికి మద్దతుగా ఉన్న అమెరికా మధ్యప్రాచ్య వైఖరిని కూడా వ్యతిరేకించటమే. ■

పాలస్తీనాకు మద్దతు ఇస్తున్న విద్యార్థులపై దమనకాండ నిలిపివేయాలి. విశ్వవిద్యాలయాల పెట్టుబడులను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్ కొత్తదేమీ కాదు. గతంలో దక్షిణాఫ్రికాలో జాత్యహంకార పాలకులతో, ప్రభుత్వాలతో సంబంధాలున్న సంస్థల నుంచి 155 విశ్వవిద్యాలయాలు పెట్టుబడులను వెనక్కు తీసుకున్నాయి, సంబంధాలను తెగతెంపులు చేసుకున్నాయి. అంతే కాదు అమెరికాలో ప్రయివేటు జైళ్ల నిర్వహణ కంపెనీలు, పర్యావరణానికి హానిచేసే చమురు కంపెనీలలో పెట్టుబడులను కొన్ని విద్యా సంస్థలు వెనక్కు తీసుకున్నాయి. ఇక ఇజ్రాయిల్ దుశ్చర్యలను సమర్ధించేవారు దానితో సంబంధాలున్న సంస్థల నుంచి పెట్టుబడులను వెనక్కు తీసుకోవటం చట్టవిరుద్ధం, ఇజ్రాయిల్ నాశనాన్ని కోరుకోవటమే అని వాదిస్తున్నారు.

విజయం 'ఇండియా' కూటమిదే!



గీట్ల ముకుందరెడ్డి
9490098857

లోక్‌సభకు రెండువిడతల్లో 190 సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి.ఈ రెండు ఫేసులలోను ఇండియా బ్లాక్ భాగస్వామ్య పక్షాలదే పై చేయిగా స్పష్టమైన సంకేతాలు దేశ ప్రజలకు అందాయి. దీంతో మోడీ, బీజేపీ నాయకులకు వణుకు ప్రారంభమైంది. అందుకే రాజస్థాన్ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి స్థాయిలో మోడీ రాజ్యాంగ వ్యతిరేక, ఎన్నికల నిబంధనావళికి వ్యతిరేకమైన, మతపరమైన పోలరైజేషన్ కోసం విద్వేష వ్యాఖ్యలు చేశారు.అయినా ఎన్నికల కమిషన్ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నది. కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉండి దేశ సంపదను కాజేస్తున్నది, దోచిపెడుతున్నది ఎవరికో దేశ ప్రజలు గమనిస్తునే ఉన్నారు. మేమిద్దరం (మోడీ, అమిత్ షా) మాకిద్దరు (ఆదానీ, అంబానీ) అనే నానుడి స్థిరపడేలా వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని అప్పనంగా వివిధ రూపాల్లో కార్పొరేట్లకు అప్పజెప్పారు. బిలియ నీర్ల సంఖ్య 2014 నుంచి 2024 నాటికి నాలుగు రెట్లు పెరిగింది. భారత దేశ స్థూల జాతీయాదాయం 2022 సంవత్సరం రూ.270 లక్షల కోట్లలలో పై ఒకశాతానికి చేరిన ఆదాయం 22.6 శాతం. ఇది బ్రిటీష్ పరిపాలన కాలం కన్నా అదనం. అదే సమయంలో అట్టడు గు 50శాతం భారతీయులు పొందిన ఆదాయం 1951లో 20.6 శాతం ఉండగా 2022కు 15శాతం తగ్గింది.

2024 సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి ఉన్న దేశ రాజకీయ పరిస్థితికి నేడు మారింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నికల బాండ్స్ బహిర్గతం చేసిన తర్వాత, లిక్కర్ కేసులో కేజ్రీవాల్ అరెస్ట్‌తో స్పష్టమైన మార్పు దేశ ఎన్నికల రాజకీయ రంగంలో కనబడుతున్నది. అవినీతిపరుల అడ్డాగా బీజేపీ మారి పోయిందని, వివిధ పార్టీలలోని అవినీతి పరులందర్నీ బీజేపీలోకి వారి నాయకత్వం చేర్చుకుంటున్నదని, ఈడీ, సిబిఐ, ఐటిలు బీజేపీ జేబు సంస్థలుగా మారిపోయా యని ప్రజలు భావిస్తున్నారు. 'యువత, మహిళలు, రైతులు, పేదలే మా లక్ష్యం' అంటున్నది బీజేపీ. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల సృష్టి ఏమోగానీ కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలనే భర్తీ చేయలేదు. మహిళలలో పౌష్టికాహార లోపం, రక్తహీనత పెరిగింది. మహిళలపై నేరాలు పెరిగాయి. మణిపూర్‌లో జరిగిన దాడులు, రెజ్లర్ల పై తమ ఎంపీ బ్రిజుభూషణ్ వేధింపులపై ఇంతవరకు మోడీ ఒక్కమాటైనా మాట్లాడలేదు. రైతు ఆదాయం రెట్టింపు కాలేదు. కనీసం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేదు. రైతు ఉద్యమంపై ఉక్కు పాదం మోపారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపెట్టను న్నది. మరోవైపు ఈ వర్గాల సమస్యలను అడ్రస్ చేస్తూ.. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల పొత్తులు కుదుర్చుకుంటూ ఇండియా బ్లాక్ ముందుకెళ్తున్నది. బీహార్‌లో ఆర్జెడీ, కాంగ్రెస్, వామపక్షాలు మహారాష్ట్రలో ఉద్ధవ్‌ఠాక్రే శివసేన, శరద్‌పవర్ ఎన్సీపీ కాంగ్రెస్ ఎన్నికల ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఢిల్లీ, గుజరాత్, గోవా రాష్ట్రాలలో ఆప్, కాంగ్రెస్ మధ్య ఎన్నికల ఒప్పందం కుదిరింది.రాజస్థాన్ 2023 అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా వామపక్షాలు, ఇతర మిత్రపక్షాలతో కాంగ్రెస్ పొత్తులు లోక్‌సభ ఎన్నికలలో సీపీఐ (ఎం), రాష్ట్రీయ లోక్ తాంత్రిక పార్టీ, భారత ఆదివాసి పార్టీలతో కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నది. ఇటీవల వరకు బీజేపీకి మద్దతుగా నిలిచిన రాజ్‌పుట్స్ పై కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల నోటిదురదతో ఆ వర్గంపై చేసిన కామెంట్స్ పై భగ్గుమంటున్నారు. రూపాలకు కేటాయించిన గుజరాత్‌లోని రాజ్‌కోట్ లోక్‌సభ అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఉపసంహరించుకోవాలని గత పది రోజులుగా ఆందోళనలు కొనసాగు తున్నాయి. రాజ్‌పుట్స్ ప్రభావం గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ యూపీ, హర్యానాలో తీవ్రంగా ఉండనున్నది. భాగస్వామ్య పక్షాలు ఎన్నికల అలయన్స్, ప్రజల నిజ జీవిత సమస్యల పరిష్కార ఎన్నికల ప్రణాళికతో ఇండియా బ్లాక్ ఎన్నికల సమరంలో దూసుకుపోతుంటే ఎన్డీయే మరోసారి ప్రజలను మోసం చేస్తూ, విద్వేషాలు రగిలిస్తూ, కార్పొరేట్ మీడియా మద్దతుతో ఎలాగైనా మరోసారి గద్దెనెక్కా లని మోడీ,షా ద్వయం ప్రయత్నిస్తున్నది.

మన రాష్ట్రం విషయానికొస్తే ఎన్నికల సందర్భంగా చర్చ ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై జరగాలా? పదేండ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఏం చేశారనే అంశంపై చర్చ జరగాలనా? ఎన్నికలు జరుగు తున్నవి పార్లమెంటుకు. మోడీ ఎత్తుగడల మాయలో పడిపోయిన బీఆర్ఎస్ కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే, కాంగ్రెస్ బీఆర్ఎస్‌పై విమర్శలు చేసుకుంటూ బీజేపీ రాష్ట్ర, దేశ వ్యతిరేక విధానాలను విస్మరిస్తున్నది. 2019 ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రం నుంచి నాలుగు ఎంపీ సీట్లను బీజేపీకి ఇస్తే ఈ ఐదేండ్ల కాలంలో రాష్ట్రానికి కేంద్రం చేసింది గుండు సున్నా. రాష్ట్ర విభజన హామీలను విస్మరించింది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ లేదు. బయ్యారం ఉక్కు పరిశ్రమకు అనుమతి లేదు. ఐటిఐఆర్ ప్రాజెక్టును అటకెక్కిం చింది. ట్రిపుల్ ఐటిని ఇతర రాష్ట్రాలకు ఇచ్చింది. కాళేశ్వరం లేదా పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలన్న రాష్ట్ర ప్రజల డిమాండ్‌ను కేంద్రం అంగీకరిం చడం లేదు. ఇలా చెప్పుకుంటూ అసలు సమస్యల్ని పక్కదారి పట్టిస్తూ హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు పెంచి ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తోంది మోడీ ప్రభుత్వం. కానీ లౌకికవాదాన్ని బలపరుస్తున్న ప్రజాస్వామిక వాదులు, విద్యావంతులు, మేధావులు ఇండియా బ్లాక్ దే విజయమని గట్టిగా చాటుతున్నారు. ■



శ్రమశక్తి

ఏ గుండెను తాకుతుంది..నీ కన్నీటి చుక్క
ఏ మనసును కరిగిస్తుంది..నీ ఎండిన డొక్క
ఏ త్రాసు కొలుస్తుంది..నీ చెమట చుక్క
తలకాయలపై పిచ్చిగీతలు రాయించుకున్నట్టు
తరతరాలుగా స్వేదజల పాకుడు
మెట్లపై నిలదొక్కుకోలేక
పడుతూ, లేస్తూ, పలవరిస్తూ
పరిక్రమిస్తూ, పరిభ్రమిస్తూ
ఆకలిమంటల్ని చెమటచుక్కలతో
ఆర్పాలని అహోరాత్రులు ఆహుతైపోతూ
అలమటించే ఓ శ్రమయోగీ!

తలపాగా చుట్టి ముల్లుగర్ర పట్టి
అన్నం పెట్టే వృత్తి వృత్తంలో తిరుగుతూ
ప్రతీక్షణం ప్రకృతితో పోరాడుతూ
పుట్ల కొద్దీ ధాన్యం పండించావ్..
ఒక్కనాడైనా భార్యా పిల్లలతో
తృప్తిగా తింటూ పండుగ చేసుకున్నావా..!

ఎక్కడ పనిదొరికితే అక్కడ కుదిరి
అనంత పని ప్రవాహానికి ఎదురీది..
అందమైన ప్రపంచాన్ని సజించావ్
ఒక్కరోజైనా చినిగిన చొక్కా తీసేసి
మాసిన గడ్డం గీసేసి కుటుంబంతో
స్వేచ్ఛా విహంగమై అవసరాలన్నీ తీరేలా
ఖర్చు పెట్టుకొని ఆనందించావా..!
నడువు.. నిన్ను దీవించే కొత్త ప్రపంచంలోకి
నినదించు.. శ్రమశక్తికి ఎదురే లేదని
నిరూపించు..
జగాన నీకు సాటి ఎవ్వరూ లేరని..

(మేడే సందర్భంగా..)

- భీమవరపు పురుషోత్తమ్
సెల్ : 9949800253

ప్రపంచ గతినే మార్చిన 'మేడే'



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని' మహాకవి శ్రీశ్రీ అన్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే.ఆ శ్రమే దోపిడీకి గురైనప్పుడు ఏమవుతుంది? కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయి.అమెరికాలోని కార్మికులనే కాక ప్రపంచ కార్మికులందరినీ ప్రభావితం చేసిన చికాగో హే మార్కెట్ సంఘటన ఇందుకు నిదర్శనం.ఈ ఘటనే మేడేగా చరిత్రలో నిలిచిపోయింది. అయితే ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం.కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం డిమాండ్‌తో 1886, మే1న 40వేల మంది కార్మికులు నిరసన చేపట్టారు. నేటికి 138 ఏండ్ల క్రితం అమెరికాలోని చికాగో నగర కార్మికులు ఎనిమిది గంటల పనిదినం కోసం చారిత్రాత్మక పోరాటానికి నాంది పలికారు. ఆ రోజుల్లో పని గంటలకు ఏ నియమమూ లేదు. పొద్దు పొడిచింది మొదలు చీకటయ్యే దాకా కార్మికులు కార్ఖానాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటూ వుండేవాళు ..ప్రారంభ దినాల్లో అమెరికాలో కార్మికులు రోజుకు 12 నుండి 18 గంటల వరకూ శ్రమించేవారు.అత్యధిక కార్మికులు చిన్న వయసులోనే ప్రమాదకరమైన రోగాల బారినపడి చనిపోయేవారు కూడా. దీనికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులపై ప్రయివేటు గూండాలు,పోలీసులు,సైన్యంతో దాడులు చేయించేవాళ్లు.పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేది. అయితే నిర్బంధం నుంచే ప్రతిఘటన పుడుతుంది.ఆ ప్రతిఘటన పోరాట కాంక్ష అలలను సృష్టిస్తుంది.అందుకే అమెరికా కార్మికయోధులు పోరు మార్గాన్ని ఎంచుకున్నారు.

1877 నుంచి 1886 వరకూ ఇక్కడి కార్మికులు దేశవ్యాప్తంగా ఎనిమిది గంటల పనిదినపు డిమాండ్ పై ఏకం కావడం,సంఘటితం కావడం ప్రారంభించారు.1886లో అమెరికా అంతటా కార్మికులు ఎనిమిది గంటల కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు.మే 1న కార్మికులందరూ తమ పని ముట్లను పక్కన పెట్టి రోడ్ల మీదికి పోవాలని, ఎనిమిది గంటల పనిదినపు నినాదాన్ని హోరెత్తించాలని చికాగో కార్మికులు నిర్ణయించుకొని అమెరికా అంతటా లక్షలాది కార్మికులు ఒకేసారి సమ్మె ప్రారంభించారు.ఈ సమ్మెలో 11 వేల ఫ్యాక్టరీలకు చెందిన కనీసం 3 లక్షల 80 వేల మంది కార్మికులు పాల్గొన్నారు.చికాగో నగర దరిదాపుల్లోని రైలు రవాణా మార్గమంతా స్థంభించిపోయింది. చికాగోలోని అత్యధిక కార్ఖానాలూ,వర్క్ షాపులూ బందయ్యాయి. నగరంలోని ప్రధాన మార్గమైన మిషిగన్ ఎవెన్యూపై అల్బర్ట్ పార్సన్స్ నాయకత్వంలో కార్మికులు ఒక భారీ ర్యాలీ నిర్వహించారు.దీంతో పెరుగుతున్న కార్మికుల బలం,వాళ్ల నాయకుల తొణకని సంకల్పంతో భయభ్రాంతులైన పారిశ్రామిక వేత్తలు కార్మికులపై నిరంతరాయంగా దాడులు చేసే ఎత్తుగడలు అవలంబించారు.అప్పుడు పెట్టుబడిదారుల యాజమాన్యంలోని మొత్తం పత్రికలన్నీ 'ఎర్ర' ప్రమాదం గురించి మొత్తుకున్నాయి. పెట్టుబడిదారులు చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా పోలీసులను,సాయుధ బలగాలనూ పిలిపించి మోహరింపజేశారు. వీరితోపాటు కుఖ్యాత పింకర్టన్ ఏజెన్సీకి చెందిన గూండాలను కూడా సాయుధం చేసి కార్మికులపై దాడులు చేయడానికి సర్వసన్నద్ధంగా ఉంచి పెట్టుబడిదారులు అత్యవసర స్థితిని ప్రకటించారు. మే 3న మైకార్మిక్ హార్వెస్టింగ్ మెషీన్ కంపెనీ కార్మికులు తమ పోరాటాన్ని ముందుకు తీసుకుపోయినపుడు నగర పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు చేరుకున్నాయి. కార్మికులు ప్రతిఘటనా సభ ప్రారంభించగానే నిరాయుధ కార్మికులపై తూటాలు కురిపించ బడ్డాయి.నలుగురు కార్మికులు చని పోయారు. చాలా మంది గాయ పడ్డారు. ఆ తర్వాతి రోజు కూడా కార్మిక బృందాలపై దాడులు కొనసాగాయి.

ఈ క్రూరమైన పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా మే 4వ తేదీ రాత్రి చికాగో నగర ప్రధాన మార్కెట్ అయిన హే మార్కెట్ స్క్వేర్ వద్ద ఒక ప్రజా సభ జరిగింది. దీంతో పిచ్చెక్కిన పోలీసులు మార్కెట్‌ను నాలుగు వైపులా చుట్టుముట్టి సభికుల పైకి విచక్షణా రహితంగా కాల్పులు జరపడం మొదలు పెట్టారు. పారిపోవడానికి ప్రయత్నించిన వాళ్ల పైనా తూటాల,లాఠీల వర్షం కురిపించారు. దీంతో ఆరుగురు కార్మికులు చనిపోయారు.రెండు వందలకు పైగా గాయపడ్డారు.కార్మికులు తమ నెత్తుటితో ఎరుపెక్కిన ఒంటిమీది బట్టలను ఎగిరేసి దానిని కార్మికుల ఎర్రజెండాగా మలిచారు.తర్వాతి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా మేడే స్వరూపం మారుతూ వచ్చింది.అనేక దేశాల్లో ఆ రోజున పోరాటాలు,నిరసన ప్రదర్శనలు చేపట్టడం మొదలైంది.యూరప్‌లో 1900 నుంచి 1920 వరకూ ప్రభుత్వ,ధనిక వ్యాపారుల దోపిడీని ఎండగడుతూ సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో మే1న నిరసనలు జరిగాయి.మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో మేడే నాడు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు.తర్వాతి దశకాల్లో మే 1ని నాజీల వ్యతిరేక దినోత్సవంగా జరిపేవారు.హిట్లర్ పాలనలో ఆ రోజుని జాతీయ కార్మికుల దినోత్సవంగానూ జరుపుకునేవారు.ఇటలీలో ముస్సోలిని,స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకో మే డే పైన అనేక ఆంక్షలను విధించారు.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరోపియన్ దేశాల్లో మే1ని సెలవు దినంగా పాటించడం మొదలైంది.ఆ తర్వాత అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. కార్మికులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాలను చాలా దేశాలు ఆ రోజునే అమల్లోకి తీసుకొచ్చాయి.ఆ విధంగా అటు సంక్షేమ పథకాల అమలుతో పాటు నిరసన ప్రదర్శనలకు,కార్మిక పోరాటాలకు మే1 వేదికగా మారింది.వేర్వేరు దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థపై నిరసన ప్రదర్శనలు కూడా ఆ రోజునే మొదలై పలు ఇతర కార్మిక ఉద్యమాలు కూడా మేడే నాడే ప్రాణం పోసుకున్నాయి.

మన దేశంలో చికాగో సంఘటన కంటే ముందే కల కత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా రైల్వే స్టేషన్‌లో అధికారులు ఎన్ని గంటలు పని చేస్తారో మేము కూడా అన్ని గంటలే పని చేస్తామనే డిమాం డ్‌తో 1862లోనే సమ్మె చేశారు. అయితే ఆ సమ్మె విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడిన తర్వాత కార్మిక వర్గంలో చైతన్యం పెరగడం వల్ల మన దేశంలో 1923లో మొదటిసారి మేడేను పాటించారు.అప్పటి నుంచి దేశంలో మేడేని పాటిస్తున్నారు.1985 తర్వాత చోటుచేసుకున్న ప్రయివేటైజేషన్,లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల కార్మిక చట్టాలు అంతగా అమలుకు నోచుకోవడం లేదు.కార్మికుల పని వాతావరణంతో పాటు వేతనాలు మెరుగవ్వాలన్నది చాలాకాలంగా కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్‌గా మారింది. నేడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం ఉంటే అక్కడ కంపెనీలు పెడుతున్నాయి.అమెరికా లాంటి దేశాల్లో ఉన్న పెద్ద పెద్ద కంపెనీలు కార్మిక చట్టాలు అంతగా అమలు కానటువంటి దేశాల్లో కంపెనీలు పెడుతూ వాళ్ల చేత రోజుకు 10 నుంచి 12 గంటల పాటు పని చేయిస్తున్నారు.ఇందుకు మన దేశం మినహాయింపేమీ కాదు.పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత వరకు శ్రమదోపిడీ సర్వసాధారణం.కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేస్తామని హామీ ఇచ్చే బహుళజాతి కంపెనీలను మాత్రమే మన దేశంలోకి ఆహ్వానించాలి. అప్పుడే ఆయా కంపెనీల్లో పనిచేసే కార్మికులను శ్రమదోపిడీ నుంచి రక్షించగలమని గ్రహించాలి.ప్రాణాలను పణంగా పెట్టి నాటి కార్మికవర్గ పోరాటాలు సాధించిన ఫలాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నప్పటికీ,ఇప్పుడున్న మార్కెట్ శక్తుల వ్యూహాలు పాత పరిస్థితులను పునరావృతం చేస్తుండటం గమనించాలి.కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కనీస హక్కులను కాలరాస్తున్న పాలక వర్గాల దుర్నీతిని నేడు కండ్లారా చూస్తున్నాం. ప్రపంచ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న స్వేచ్ఛా స్వాతంత్రాలు కూడా కోల్పోయే దుస్థితి దాపురించింది.

ఇప్పుడు మేడే స్ఫూర్తిని మరింత ఉత్తేజంతో కొనసాగించాలి. అందుకు మహాకవి శ్రీశ్రీని గుర్తుకు తెచ్చుకోవాలి.'చిరకాలం జరిగిన మోసం,బలవంతుల దౌర్జన్యాలు,ధనవంతుల పన్నాగాలు ఇంకానా? ఇకపై చెల్లవు.ఒక వ్యక్తిని మరో వ్యక్తి,ఒక జాతిని వేరే జాతీ,పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇకపై సాగదు' అంటూ ఆయన ఏనాడో చెప్పిన మాటల్లోని ఆంతర్యాన్ని అందరూ గమనించాలి.గడిచిన ఈ 138 ఏండ్లల్లో అసంఖ్యాకమైన పోరాటాల్లో పారిన కోట్లాది కార్మికుల నెత్తురు అంత సులువుగా భూమిలో ఇంకిపోదు.ఉరికొయ్య నుంచి మారుమోగిన కార్మిక నాయకుడు స్పాయిస్ గళం 'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' పెట్టుబడిదారుల గుండెల్లో భయాన్ని పుట్టిస్తూనే వుంటుంది. అసంఖ్యాక కార్మికుల నెత్తుటి కాంతితో మెరిసే ఎర్రజెండా ముందుకు నడవడానికి మనకు ప్రేరణనిస్తూనే ఉంటుంది.

(నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ■



నేడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం ఉంటే అక్కడ కంపెనీలు పెడుతున్నాయి.అమెరికా లాంటి దేశాల్లో ఉన్న పెద్ద పెద్ద కంపెనీలు కార్మిక చట్టాలు అంతగా అమలు కానటువంటి దేశాల్లో కంపెనీలు పెడుతూ వాళ్ల చేత రోజుకు 10 నుంచి 12 గంటల పాటు పని చేయిస్తున్నారు.ఇందుకు మన దేశం మినహాయింపేమీ కాదు.పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత వరకు శ్రమదోపిడీ సర్వసాధారణం.కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేస్తామని హామీ ఇచ్చే బహుళజాతి కంపెనీలను మాత్రమే మన దేశంలోకి ఆహ్వానించాలి. అప్పుడే ఆయా కంపెనీల్లో పనిచేసే కార్మికులను శ్రమదోపిడీ నుంచి రక్షించగలమని గ్రహించాలి.



రిజర్వేషన్లకు మరణశాసనం!

- అడిగిన వారికి 'నో'... అడక్కపోయినా 'ఎస్'
- అంతర్గత వర్గీకరణల పైనా దాటవేత
- కాంట్రాక్ట్ నియామకాలతో రిజర్వేషన్లకు తూట్లు
- కులగణనకూ అడ్డుపుల్లలు
- ఆది నుండీ ఆ వర్గాలపై బీజేపీకి చిన్నచూపే



న్యూఢిల్లీ : అణగారిన, అట్టడుగు వర్గాల ప్రజల రిజర్వేషన్లకు బీజేపీ మరణశాసనం లిఖిస్తోంది. అడిగిన వారిని రిజర్వేషన్లు ఇవ్వకుండా అడ్డుపుల్లలు వేస్తూ, అడగని వారిపై మాత్రం అమిత ప్రేమ కురిపిస్తూ వాటిని ఉదారంగా ఇచ్చేస్తోంది. అంతర్గత వర్గీకరణల ఊసే ఎత్తడం లేదు. ఉద్యోగాలను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేస్తూ రిజర్వేషన్ విధానానికి తూట్లు పొడుస్తోంది. అసలు బీజేపీ మొదటి నుండీ రిజర్వేషన్లకు వ్యతిరేకమే. రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయ పద్ధతిగా భావిస్తున్న కులగణనకు కూడా కమలదళం 'నో' అంటోంది.

చెప్పిందేమిటి?

సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తానని బీజేపీ దేశ ప్రజలకు హామీ ఇచ్చింది. సమాజంలో అట్టడుగు వర్గాల వారికి అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. రిజర్వేషన్లలో వర్గీకరణను అమలు చేస్తామని చెప్పింది. కానీ వీటిలో ఏ ఒక్క వాగ్దానాన్నీ ఆ పార్టీ నిలుపుకోలేదు.

అందరికీ న్యాయం ఒట్టి మాటే

రిజర్వేషన్ల కోసం దేశంలోని వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు జరిపారు. అనేక వర్గాల వారు అంతర్గత వర్గీకరణకు పట్టుబట్టారు. అందరికీ న్యాయం చేస్తామంటూ ఎన్నికలకు ముందు తప్పుడు హామీలు ఇవ్వడం, అవసరం తీరిన తర్వాత వాటిని విస్మరించడం బీజేపీకి అలవాటుగా మారింది. రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న ఏ వర్గానికీ మోడీ ప్రభుత్వంలో న్యాయం జరగలేదు. వర్గీకరణ కోసం రాజ్యాంగంలోని సెక్షన్ 341/3ని సవరించాల్సిన అవసరం ఉంది. ఈ డిమాండ్ అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్నప్పటికీ కనీసం చర్చకు కూడా నోచుకోలేదు. వెనుకబడిన కులాలు, దళితులు, గిరిజనులు, ఇతర అణగారిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తే 50శాతం గరిష్ట పరిమితిని తొలగించాల్సి ఉంటుంది. అయితే బీజేపీ ప్రభుత్వం దీనిపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు.

అన్నీ కాంట్రాక్ట్ నియామకాలే

రిజర్వేషన్లను అమలు చేయడం మాట అటుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేసే విషయంలో కూడా మోడీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోంది. ఉద్దేశపూర్వకంగానే వాటిని ఖాళీగా ఉంచేస్తోంది. ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకుంటోంది. తద్వారా రిజర్వేషన్లు అనే పదానికి అర్థమే లేకుండా చేస్తోంది.

కులాల మధ్య చిచ్చు రేపి...

రిజర్వేషన్ల పేరుతో వివిధ వర్గాల వారు పరస్పరం దూషించుకుంటూ వీధుల్లో ఘర్షణలకు దిగడం పరిపాటిగా మారింది. దీనికి కారణం పాలకులే. తమ వర్గానికే రిజర్వేషన్లు ఇవ్వాలని పట్టుబట్టేలా ప్రజలను పాలకులు ప్రభావితం చేస్తున్నారు. కానీ వాస్తవానికి వేరే వారి అజెండా కోసం పనిచేసేలా వీరిని మార్చేస్తున్నారు. వివిధ కులాలు, వర్గాల మధ్య రిజర్వేషన్ మంటలు రేపి, వాటితో చలి కాచుకుంటున్నారు. చివరికి ఎవరికీ ఏమీ ఇవ్వరు. ప్రతి వారూ వంచనకు గురవుతున్నారు.

ఆది నుండి వ్యతిరేకమే

బీజేపీని ఆర్ఎస్ఎస్ రాజకీయాలు శాసిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ మౌలికంగా బ్రాహ్మణీయ సంస్థ. అందుకే అది మొదటి నుండీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది. వెనుక బడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించాలన్న మండల్ కమిషన్ సిఫార్సును ఆమోదించినప్పుడు కూడా ఏబీవీపీ, వీహెచ్‌పీ వంటి సంస్థల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిని మనం గమనించాల్సిన అవసరం ఉంది.

కులగణనకు ససేమిరా

అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చాలన్న ఉద్దేశంతో కర్నాటకలో నిర్వహించిన కులగణనను అంగీకరించేందుకు బీజేపీ నిరాకరించింది. కొత్తగా కులగణన చేపట్టేందుకు వారు సముఖంగా లేరు. సమగ్ర కులగణన చేపడితే జన సంఖ్య ఎంతో కచ్చితంగా అంచనా వేయవచ్చు. ప్రతి కులం వారి సామాజిక, ఆర్థిక ప్రతిపత్తిని తెలుసుకోవచ్చు. దీనివల్ల సరైన రిజర్వేషన్ విధానాన్ని రూపొందించుకోవచ్చు. అయితే ఈ శాస్త్రీయ విధానాన్ని బీజేపీ అంగీకరించలేదు.

అడగకపోయినా ఇచ్చేశారు

బ్రాహ్మణులు రిజర్వేషన్లు కోరకపోయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం ఆ వర్గానికి కొత్తగా వాటిని కల్పించింది. దేశ జనాభాలో కేవలం 4శాతంగా ఉన్న వర్గానికి 10శాతం రిజర్వేషన్లు ఇచ్చింది. ఈ రిజర్వేషన్లు అమలు చేయడానికి ముందు వాటిపై కనీసం చర్చ జరపలేదు. ఎలాంటి అధ్యయనం నిర్వహించలేదు. కార్యనిర్వాహక ఆదేశాల ద్వారా నేరుగా రిజర్వేషన్లను అమలు చేశారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ప్రస్తుతం అమలులో ఉన్న 50శాతం గరిష్ట పరిమితి ఈ రిజర్వేషన్లకు అడ్డంకి కాలేదు. ఇతర వర్గాలు రిజర్వేషన్ల కోసం ఆందోళన, పోరాటం చేస్తుంటే ఈ వర్గానికి అడగకపోయినా ఇచ్చేశారు. ఇతర వర్గాలు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తుంటే వారికి ఆ తలుపులు మూసేశారు. ఈ రోజు రాజకీయ రంగంలో రిజర్వేషన్ రాజకీయాలు యుద్ధభూమిని తలపిస్తున్నాయి.

మోసపూరిత ఎత్తుగడ

మాదిగలు, బంజారాలు, కర్నాటకలోని బోవిస్‌లకు రిజర్వేషన్లు పెంచుతామని, ఆదివాసీలకు రిజర్వేన్లు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. అయితే ఇది ఆయా వర్గాల వారిని వంచించి వారి ఓట్లు దండుకునేందుకు బీజేపీ వేసిన మోసపూరిత ఎత్తుగడ మాత్రమే. ప్రాధమికంగా బీజేపీ కులంపై ఆధారపడిన పార్టీ. అందుకే అది రిజర్వేషన్ విధానాలను వ్యతిరేకిస్తోంది. సామాజిక వాస్తవాలు, సమానత్వం, న్యాయం అనే మాటలను అది ఎంతమాత్రం పట్టించుకోదు.

వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత కూడా బీజేపీ ఎవరి పక్షాన ఉన్నదో మనం అర్థం చేసుకోలేకపోతే మనలను మనమే ప్రశ్నించుకోవాల్సి ఉంటుంది. అట్టడుగు వర్గాల వారు బీజేపీని నమ్మితే గొర్రె కసాయిని నమ్మినట్లే అవుతుంది.



ముస్లింలకు మాత్రమే పిల్లలుంటారా..?

- మోడీని ప్రశ్నించిన ఖర్గే



రాయ్‌పూర్ : ముస్లింలకు మాత్రమే పిల్లలు ఉంటారా..? అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ప్రశ్నించారు. ముస్లింలపై ప్రధాని మోడీ చేస్తున్న 'అధిక సంతానం', 'చొరబాటుదారులు' వంటి ఆరోపణలను ఖర్గే తిప్పికొట్టారు. 'మేం మెజార్టీ దిశగా వెళుతున్నాం. ఈ కారణం చేతనే మోడీ ఎప్పుడూ మంగళసూత్రాలు, ముస్లింల గురించి మాట్లాడుతున్నారు. మేం (కాంగ్రెస్) మీ సొమ్మును దొంగలించి ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారికి (ముస్లింలకు) ఇచ్చేస్తామని మోడీ ఆరోపిస్తున్నారు. పేదలకు ఎక్కువ మంది పిల్లలు ఉంటారు. ముస్లింలకే ఎక్కువ మంది పిల్లలు ఉంటారా? నాకు ఐదుగురు పిల్లలు' అని ఖర్గే చెప్పారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని జంజ్గిర్-చంపా జిల్లాలో ఖర్గే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 'మోడీ ముస్లింలనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు? వారు కూడా ఈ దేశంలో భాగమే. ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయవద్దు' అని ఖర్గే చెప్పారు.

55 ఏండ్ల పాటు దేశాన్ని కాంగ్రెస్ పరిపాలించిందని, ఏ ఒక్కరి మంగళసూత్రాన్ని దోచుకోలేదని ఖర్గే గుర్తు చేశారు. 'మేం బలవంతంగా పన్నులు వసూలు చేయలేదు. ప్రజల్ని జైల్లో పెట్టడానికి ఈడీ, సీబీఐలను దుర్వినియోగం చేయలేదు. సోనియా గాంధీ ఎంతో ధైర్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారు. అలాగే ఆహార భద్రత చట్టం కూడా తెచ్చాం. బీజేపీ ఇలాంటివి ఏమైనా చేసిందా?' అని ఖర్గే ప్రశ్నించారు.

మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, రాజీవ్‌గాంధీలతో మోడీని పోల్చలేమని ఖర్గే అన్నారు. 'వారు దేశానికి ఉక్కు ఫ్యాక్టరీలు, బొగ్గు గనులు, డ్యామ్‌లు, ప్రభుత్వ సంస్థలు తీసుకొచ్చారు. మోడీ ఏమీ చేశారు.. జస్ట్ జుమ్లాస్' అని ఖర్గే విమర్శించారు.



గంజాం జిల్లాలోని ఛత్రపూర్‌లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు హింజిలి స్థానం నుంచి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

రాజ్యాంగాన్ని ముక్కలు చేస్తోన్న బీజేపీ

- రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : బీజేపీ కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే.. రాజ్యాంగాన్ని ముక్కలు చేస్తుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పేదలు, దళితులు, ఎస్‌టీ, బీసీలకు హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని.. కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే ముక్కలుగా చేసి, విసిరికొడుతుందని అన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు, బీసీలకు రాజ్యాంగం మహాత్మాగాంధీ ఉపాధి పథకం, భూ హక్కులు, రిజర్వేషన్లు సహా పలు హక్కులను కల్పించిందని అన్నారు. మోడీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని విసిరికొట్టాలనే నిర్ణయానికి వచ్చిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లకు వ్యతిరేకం కానప్పుడు .. ప్రభుత్వ సంస్థలను, రైల్వేలు, ఇతర సంస్థలను ఎందుకు ప్రయివేట్‌పరం చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోడీ కేవలం 22 నుంచి 25 మంది పారిశ్రామిక వేత్తలను బిలియనీర్లుగా మారిస్తే .. కాంగ్రెస్ కోట్లాది మంది మహిళలను లక్షాధికారులను చేస్తుందని అన్నారు. భింద్ లోక్‌సభ (ఎస్‌సీ-రిజర్వ్‌డ్) స్థానం నుండి బీజేపీ సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫూల్ సింగ్ బరయ్యను పోటీకి దింపింది.

పోల్ ఇండియా-2024

బీజేపీ ఓటమితోనే దేశ ఐక్యత

- దేశ ఉనికికే బీజేపీ ప్రమాదకరం.. అందుకే కాంగ్రెస్‌కు మద్దతు
- మోడీ పాలనలో రాజ్యాంగ సంస్థలు, స్వతంత్ర వ్యవస్థలు నిర్వీర్యం
- ఇండియా కూటమి లక్ష్యం ఎన్డీఏను గద్దె దించటం
- రఘురాంరెడ్డి గెలుపు బాధ్యత తీసుకుంటాం..
- 16 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు : సీపీఐ(ఎం) ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- బీజేపీ పాలనలో ప్రజల మధ్య విద్వేషాలు : రెవెన్యూ మంత్రి పొంగులేటి
- కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అందుబాటులో ఉంటా : అభ్యర్థి రఘురాంరెడ్డి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తూ.. రాక్షస శక్తిగా ముందుకొస్తున్న బీజేపీని ఎదుర్కొనేందుకే కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఒకే వేదికపైకి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడ్డారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో భువనగిరి పార్లమెంట్ స్థానం మినహా మిగిలిన 16 చోట్లా కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) ఖమ్మం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు అభ్యర్థి రఘురాంరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు హాజరయ్యారు.

ఎన్డీఏను గద్దె దించడమే లక్ష్యం: తమ్మినేని వీరభద్రం

పదేండ్ల మోడీ పాలనలో దేశానికి ప్రమాద కరంగా మారిన ఎన్డీఏను ఈ ఎన్నికల్లో గద్దె దించడమే ప్రధాన లక్ష్యంగా ఇండియా కూటమి ఆవిర్భవిం చిందని తమ్మినేని అన్నారు. బీజేపీ విధానపరంగా దేశ ఉనికికే ప్రమాదకరమన్నారు. బీజేపీ వెనుక ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చే ఓ ఫాసిస్టు సిద్ధాంతం ఉందని తెలిపారు. భారత రాజ్యాంగంలో ముఖ్య సారాంశమైన సమానత్వాన్ని.. రూపుమాపే సనాతన మనుధర్మాన్ని బీజేపీ ముందుకు తీసుకొస్తోందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అడ్డు తొలగించుకుంటే మనుధర్మాన్ని స్వేచ్ఛగా అమలు చేయాలనేదే బీజేపీ వ్యూహమని తెలిపారు. ప్రతిపక్షాలే కాదు, రాజకీయ పార్టీలన్నింటినీ నిర్వీర్యం చేసి ఏకవ్యక్తి రాజ్యంలా దేశాన్ని మార్చాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆర్థిక దోపిడీని విశృంఖలం చేసేందుకు పూనుకుందని తెలిపారు. రాజ్యాంగ సంస్థలు, స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేసే చర్యలతో పాటు వాక్‌స్వాతంత్ర్యాన్ని సైతం హరించేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయని, అధికారంలో ఉన్న పార్టీ చుట్టూ తిరిగే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. రామ సహాయం రఘురాంరెడ్డి గెలుపు బాధ్యతను సీపీఐ(ఎం) స్వీకరిస్తుందని, ఆయన అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసేలా చూస్తామని మాట ఇచ్చారు.

దేశ రక్షణకు ఏకం కావాలి : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

దేశ రక్షణకు అందరం ఏకం కావాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను స్వయంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరానన్నారు. దేశ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా సంఘటితంగా వెళ్దామని ముందుకు వచ్చిన సీపీఐ(ఎం) నాయకత్వానికి భట్టి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సంపద ప్రజలకు చెందేలా చూడటమే కాంగ్రెస్, కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతున్న బీజేపీని సాగనంపడమే ధ్యేయంగా ముందుకెళ్దామని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) సహకారం మర్చిపోలేను : రెవెన్యూ మంత్రి పొంగులేటి

తమ్మినేని సారథ్యంలో సీపీఐ(ఎం) సహకారంతోనే 2014లో తాను ఎంపీనయ్యానని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ విషయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. అలాగే రామసహాయం రఘురాంరెడ్డికి కూడా వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. దేశంలో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాక కామ్రేడ్లు కోరుకున్న పాలనను అందిస్తామన్నారు. అక్షింతల పేరుతో మాయ మాటలు చెప్పి బీజేపీ ఓట్లు దండుకోవాలని చూస్తుందని తెలిపారు. ఈసారి ఎన్డీఏ కూటమిని ఇంటికి పంపి.. నూటికి నూరుశాతం 'ఇండియా కూటమి' అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సీపీఐ(ఎం) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, ఎం.సుబ్బారావు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వర్లు, వై.విక్రమ్, కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏజే రమేశ్, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, కె.పుల్లయ్య, బ్రహ్మాచారి, కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, రాయల వెంకటేశ్వర్లు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, మిక్కిలినేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నర్రా వారసుడు జహంగీర్‌ను గెలిపించండి



- భువనగిరిలో ఎర్రజెండాను ఆశీర్వదించండి
- ధనబలానికి, సేవాబలానికి మధ్య ఎన్నికలు
- ఆలోచించి ఓటు వేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి
- ప్రజల సమస్యలపై అవగాహన ఉంది : జహంగీర్
- పార్లమెంట్ పరిధిలో ఊరూరా ప్రచారం..
- కళాకారుల కళాజాతా

నవతెలంగాణ - నకిరేకల్

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నర్రా రాఘవరెడ్డి వారసునిగా పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం)కు ఓట్లు వేసి ఎర్రజెండాను ఆశీర్వదించాలన్నారు. ధన బలానికి, సేవా బలానికి మధ్య జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజక వర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ధన బలంతో టికెట్లు సంపాదించుకున్నారన్నారు. వారు రాజకీయం చేసేది సేవ కోసం కాదని, వ్యాపారం చేసుకునేందుకని చెప్పారు. మంగళవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని కడపర్తి, ఓగోడు, నోముల, నకిరేకల్, మంగళపల్లితోపాటు తుంగతుర్తి తదితర ప్రాంతాల్లో భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కనపర్తి గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కళాకారుల కళాజాతాలు ప్రజలను చైతన్యపరిచాయి. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలో మతోన్మాద బీజేపీకి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయొద్దన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించే సీపీఐ(ఎం)కు ఓటు వేయాలని అభ్యర్థించారు. సీపీఐ(ఎం) నుంచి పోటీ చేస్తున్న ఎండి.జహంగీర్ 35 ఏండ్లుగా ప్రజల కోసం పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న వ్యక్తి జహంగీర్ అని చెప్పారు. పోరాటాల గడ్డ భువనగిరి నుంచి ఎర్రజెండా అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంటుకు పంపించాలని కోరారు. ఎన్నో త్యాగాలతో జిల్లా అభివృద్ధి కోసం కమ్యూనిస్టులు చేసిన కృషిని వివరించారు.

దేశంలో పదేండ్ల మోడీ పాలనలో అనేక వ్యవస్థలను దెబ్బతీశాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను లూటీ చేశారని విమర్శించారు. మోడీ మరోసారి అధికారంలోకి వస్తే దేశాన్ని అమ్మేస్తాడని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం నిలబడదన్నారు. రాజ్యాంగాన్ని మార్చేస్తారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ దుకాణం బంద్ అయ్యే పరిస్థితి ఉందన్నారు. నూటికి 80శాతంగా ఉన్న హిందువులకు మోడీ, బీజేపీ ఏమి చేసిందని ప్రశ్నించారు. కేసీఆర్ నిరంకుశ విధానాలతో నయా నవాబుగా పాలన సాగించారని విమర్శించారు. రాష్ట్రానికి 7 లక్షల కోట్ల అప్పులు, కరువు అప్పగించాడని వివరించారు.

అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా: ఎండి జహంగీర్

పార్లమెంటు ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే భువనగిరి నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని సీపీఐ(ఎం) భువనగిరి నియోజకవర్గ అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం)కు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తమ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన ఉండి పోరాడుతుందని తెలిపారు. తనకు భువనగిరి నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉందని, వాటి పరిష్కారం కోసం పోరాటాలు చేసిన విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. నర్రా రాఘవరెడ్డి వారసునిగా తనను గెలిపించాలని కోరారు. పోరాడే కమ్యూనిస్టులకు ఆయుధం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, నాయకులు బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకట్ గౌడ్, ఒంటెపాక వెంకటేశ్వర్లు, యానాల కృష్ణారెడ్డి, బాచుపల్లి ప్రకాష్ రావు, ఆకుల భాస్కర్, చెన్నబోయిన నాగమణి, సాకుంట నరసింహ, ఒంటెపాక కృష్ణ, ఏర్పుల తాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే అంకితం

- గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజాగొంతుకవుతారు: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ -చిట్యాల టౌన్

నిత్యం ప్రజా ఉద్యమాలతో ప్రజాసేవకే అంకితమై పనిచేస్తున్న భువనగిరి నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజాగొంతుకై పనిచేస్తారని చెప్పారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని స్థానిక మేకల లింగయ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చకుండా ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేయడం సాధ్యం కాదని గుర్తించిన బీజేపీ.. మళ్లీ అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని మారుస్తామంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లుగా మోడీ ప్రభుత్వం ఆలయాలు, మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పీఠాధిపతులను సైతం రాజకీయాలకు వాడుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచి కులాలు, మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారే తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. 30 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమంలో ఉండి అనునిత్యం ప్రజాసేవకే అంకితమై ఉన్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను ప్రజలు ఆదరించి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పార్లమెంటు సభ్యులుగా ఉన్న వ్యక్తులు కాంట్రాక్టులు, వ్యాపారాలు చేసుకుంటూ పార్లమెంట్లో ఏనాడూ ప్రజాసమస్యలను ప్రస్తావించలేదని గుర్తుచేశారు. సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించినట్లయితే పార్లమెంట్లో ప్రజా సమస్యలను ప్రస్తావించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు జిట్టా నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజన, శీలా రాజయ్య, బొబ్బలి సుధాకర్ రెడ్డి, లడే రాములు తదితరులు పాల్గొన్నారు.

మోడీ తెలంగాణకిచ్చింది గాడిదగుడ్డే

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం.. బీఆర్ఎస్ ఎప్పటికైనా బీజేపీతో పోతుందని గమనించే బీజేపీని ఓడించేందుకు, దేశాన్ని రక్షించేందుకు కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు.." అని తెలంగాణ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కరీంనగర్, వరంగల్, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గాల్లోని జమ్మికుంట, రేగొండ, బాలాపూర్, బడంగ్‌పేట, ఆర్కేపురం, సరూర్‌నగర్ సభల్లో మాట్లాడారు.

"నన్ను అరెస్టు చేసిన కేసీఆర్‌ను ఓ మూలకు పండబెట్టా. కారును తూకం వేయాల్సిందే. కారు షెడ్డుకు పోయింది.. అందుకే కేసీఆర్ బస్సు యాత్ర చేస్తుండు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఒకరి మీద ఒకరు బలహీన అభ్యర్థులను పెట్టుకున్నారు. బీజేపీ ఓడిపోతేనే ప్రజలు గెలుస్తారు' అని అన్నారు. గుండు, అరగుండును గెలిపిస్తే.. ఏం చేశారని జమ్మికుంట సభలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి.. ఆలోచించి దేశం బాగు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ తెలంగాణ ఏర్పాటునే పార్లమెంటులో అవమానించినా స్పందించని బండి సంజయ్‌కి సిగ్గూశరం లేదని అన్నారు. కర్నాటకకు చెంబు, ఆంధ్రప్రదేశ్‌కు మట్టి, నీళ్లు ఇచ్చినట్టే తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు.

హిందుత్వాన్ని వ్యాపార వస్తువు చేసిన మోడీ

కేంద్రంలో బీజేపీ తన రాజకీయం కోసం రాముడిని, హిందుత్వాన్ని వ్యాపార వస్తువుగా చేసి ఓట్లు అడుగుతోందని, హిందూధర్మాన్ని అవమానపరుస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కల్యాణం కాకుండానే రాముడి తలంబ్రాల పేరుతో నెల రోజుల ముందే బీజేపీ వాళ్లు పసుపు కలిపిన బియ్యం ఇంటింటికీ పంచారని గుర్తు చేశారు. ఇది హిందూ సంప్రదాయాలను, శ్రీరాముడిని అవమానించడం కాదా? అని ప్రశ్నించారు. ఐదేండ్లు ఎంపీగా వెలగబెట్టిన కరీంనగర్, నిజామాబాద్ ఎంపీలు చేసింది ఏమీ లేక రాముడి ఫొటోతో ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. హిందుత్వాన్ని రాజకీయ వ్యాపార వస్తువుగా వాడుకుంటున్న మోడీని గద్దెదించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం

తిక్కలోడు తిర్నాళ్లకు పోయినట్టుగా.. కేసీఆర్ బస్సు యాత్ర సాగుతోందని, కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావని, బీజేపీకి 200 సీట్లు వస్తాయని నిన్న ఖమ్మంలో చెప్పిన ఆయన.. వచ్చే సంకీర్ణ ప్రభుత్వంలో నామ నాగేశ్వర్‌ను మంత్రిని చేస్తానని అన్నారన్నారు. ఆ మాటల్లోనే రాబోయే రోజుల్లో బీజేపీకి మద్దతు ఇస్తానని ఒప్పుకున్నారని, అందులో భాగంగానే రాష్ట్రంలో సగం సీట్లలో బీజేపీ గెలుపునకు సహకరిస్తూ కాంగ్రెస్‌ను ఓడించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

దేశంలో బీజేపీ పాలనను అంతం చేద్దాం

దేశంలో బీజేపీ పాలనను అంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ సభలో రేవంత్ రెడ్డి అన్నారు. భూములు మింగిన అనకొండ ఆరూరి రమేష్‌ను ఓడించి కడియం కావ్యను అధిక మెజార్టీతో గెలిపించాలని, రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, అప్పుల కుప్పగా మార్చిందని, యువతను నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. అమిత్‌షాను కేసీఆర్ ఆవహించినట్టున్నారని, అందుకే గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులను పంపిస్తున్నారని అన్నారు. తనను అరెస్టు చేయడానికి ఢిల్లీ పోలీసులు వచ్చినా, సరిహద్దులో ఉన్న సైనికులు వచ్చినా భయపడేది లేదన్నారు. హామీల గురించే అడుగుతుంటే అక్రమంగా కేసులు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పదేండ్లు ఏమీ చేయని కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను ప్రశ్నించే హక్కు లేదని బడంగ్‌పేటలో అన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం కాలేడన్నారు. షెడ్డుకు పోయిన కారు ఇక రాదన్నారు.

ఉద్యమం ముసుగులో పదవులు పొందలేదు : రేవంత్

నవతెలంగాణ - మీర్‌పేట్/ చైతన్యపురి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొడుకు కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో పడిపో తుందంటున్నారు.. అయితే, వాళ్లలాగా తాను ఉద్యమం ముసుగులో విద్యా ర్థులను బలిగొని పదవి పొందలేదని.. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో ప్రభుత్వం ఏర్పాటు చేసి సీఎంను అయ్యానని రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో, ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ చౌరస్తాలో రోడ్డు షోలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డితో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేందుకు.. చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కొండా పొలిటికల్ టూరిస్ట్ అని, తాను ప్రజాసేవకున్ని అని అన్నారు. ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇతర అంశాలపై బీజేపీ నాయకులను ప్రశ్నించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనను తిట్టడానికే ప్రధాని మోడీ ఏడు విమానాలు వేసుకొని తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాతపూర్వక వాదనలు సమర్పించండి

- జల విద్యుత్ ఉత్పత్తి, కేఆర్ఎంబీ పరిధిలోని ప్రాజెక్టులపై తెలుగు రాష్ట్రాలకు 'సుప్రీం' ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ ఆధ్వర్యంలో జలవిద్యుత్ ఉత్పత్తి చేయడం, కేఆర్ఎంబీ ఆధీనంలోని ప్రాజెక్టుల పరిధిపై ఇరు రాష్ట్రాలు రాతపూర్వక వాదనలు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మంగళవారం సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 34, రిట్ పిటిషన్‌పై విచారణ ప్రారంభించింది. మెరిట్స్ ఆధారంగా కేసు విచారణ చేస్తామని ముందు సుప్రీం ప్రకటించింది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాదన్ వాదనలు వినిపిస్తూ ఏపీ లేవ నెత్తిన అంశాలు జలవివాదాన్ని ప్రేరేపిస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదిస్తూ రిట్ పిటిషన్ ద్వారా మధ్యంతర ఉత్తర్వు ఇవ్వాలని కోరారు. జలవిద్యుత్ శక్తిని 100 శాతం వినియోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం జీవో 34 ను విడుదల చేసిందన్నారు. రెండు రాష్ట్రాలు రాతపూర్వక సమాధానాలు కోర్టుకు సమర్పించాలని సుప్రీం సూచించింది. ఈకేసును జులై తొమ్మిదికి వాయిదా వేసింది.

ప్రశ్నించే తత్వం నుంచే విజ్ఞానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

- సైన్సును నిర్ణయించే స్థితిలో రాజకీయాలు
- దేశాభివృద్ధికి ఏఎస్‌రావు కృషి మరువలేనిది : సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మెన్ బీవీ రాఘవులు
- హైదరాబాద్‌లో 'మహామనిషి ఏఎస్‌రావు' టెలిఫిలిమ్ ప్రదర్శన

ప్రశ్నించే తత్వం నుంచే విజ్ఞానపు ఆలోచనలు వృద్ధి చెందుతాయని సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మెన్ బీవీ రాఘవులు నొక్కి చెప్పారు. ప్రశ్నించని చోట విజ్ఞానం పురోగమించదనీ, ఆ తత్వాన్ని చంపేస్తే దేశం ముందుకు పోదని స్పష్టం చేశారు. దేశంలో అశాస్త్రీయ భావజాలం వేగంగా విస్తరిస్తుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యువతలో ప్రశ్నించేతత్వాన్ని పెంచడమే లక్ష్యంగా ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ హోమిజే బాబా కమ్యూనిటీ హాల్‌లో ఏఎస్‌రావుపై చిత్రించిన 'మహామనిషి ఏఎస్‌రావు' టెలిఫిలిమ్‌ను ఈసీఐఎల్ ఎమ్‌డీ, చైర్మెన్ అనురాగ్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం చిత్రాన్ని ప్రదర్శించారు. అంతకుముందు బీవీ రాఘవులు మాట్లాడుతూ..విదేశాల్లో ఉన్నత చదువులు చదివిన ఏఎస్‌రావు అక్కడ ఎన్నో అవకాశాలున్నప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్‌ను ప్రపంచ దేశాల ముందు సూపర్ పవర్‌గా నిలపాలనే ధృడ సంకల్పంతో స్వదేశానికి తిరిగొచ్చారని కొనియాడారు.



సొంత ఆస్తులు కూడబెట్టుకోకుండా ఎలక్ట్రికల్ రంగంలో ఒక బ్రాండ్ ఇమేజ్‌ను ఈసీఐఎల్ ద్వారా సృష్టించారని ప్రశంసించారు. కానీ, మన దేశంలో నేటి పాలకులు ఒక్కో ప్రభుత్వ రంగ సంస్థను మింగేస్తున్నారని చెబుతూ.. ఐడీపీఎల్‌తోపాటు పలు సంస్థల స్థితిగతులను ప్రస్తావించారు. దేశంలో ఇంకా ప్రజాస్వామ్యం బతికి ఉండటం వల్లనే ఇప్పటివరకూ ఈసీఐఎల్ సంస్థ ఉండగలిగిందనీ, లేకపోతే దాన్ని కూడా ఎప్పుడో స్వాహా చేసేవారని చెప్పారు. దేశ ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలను తయారు చేసిన ఘనత కూడా ఈసీఐఎల్‌దేనని గుర్తు చేశారు. రాజకీయ నేతలు తాము గెలిస్తే ఈవీఎంల గురించి మాట్లాడటం లేదనీ, ఓడిపోతే మాత్రం ట్యాపరింగ్, హ్యాకింగ్ అంటూ దాటవేస్తున్నారని చెప్పారు. రాజకీయాలను సైన్సు శాసించేస్థాయి మన దేశంలో పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రాజకీయాలే సైన్సును నిర్ణయించే స్థితికి వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. అశాస్త్రీయ భావజాలం వేగంగా వ్యాప్తి చెందుతోందనీ, దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం సమాజం ముందుందని నొక్కి చెప్పారు. మూఢ నమ్మకాలను తాటికాయంత అక్షరాలతో ప్రచారం చేసిన బాబారాందేవ్‌ను అంతే సైజు అడ్వర్టయిజ్‌మెంట్‌తో దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలంటూ సుప్రీం కోర్టు ఆదేశించటాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అనురాగ్ కుమార్ మాట్లాడుతూ..తన ముందు ఎన్నో మంచి అవకాశాలున్నా వాటన్నింటినీ వదులుకుని దేశం కోసం పరితపించిన మహోన్నతుడు ఏఎస్‌రావు అని కొనియాడారు. దేశం ఎలక్ట్రానిక్ రంగంలో ఈ స్థాయికి ఎదగడానికి వెనుక ఆయన చేసిన కృషి ఎంతో ఉందన్నారు. నేడు సంస్థల అధిపతుల్లో దేశభక్తి తరిగిపోయి కోశభక్తి పెరిగిందన్నారు. హైదరాబాద్ అంటే సైబర్‌సిటీ, రియల్ ఎస్టేట్‌గా మాత్రమే చూడొద్దనీ, ఎన్నికలకు అవసరమైన సామగ్రిని తయారు చేసిన, టీవీని అందించిన ఈసీఐఎల్ ఉందనే విషయాన్ని మరువొద్దని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీతో ఒరిజినల్ ఇంటలిజెన్సీపై ఎఫెక్ట్ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్‌కు మానవత్వాన్ని అద్దేలా చూడాలని కోరారు. ప్రస్తుతం వస్తున్న కొన్ని బయోపిక్‌లు భయంగొల్పేలా, చరిత్రను వక్రీకరించేలా ఉంటున్నాయని వాపోయారు. వాటిని ఫక్తు రాజకీయ, మార్కెట్ కోణంలో తీసుకురావడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి.రమేశ్ మాట్లాడుతూ...104 ఇండియన్ నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లను నిర్విరామంగా నిర్వహించిన మనదేశంలో ఈ ఏడాది ఆ కార్యక్రమాన్ని ఆపేసిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సూడో సైన్స్ ప్రచారానికి నిధులు మళ్లించడమే దీనికి కారణమని తెలిపారు. అణురియాక్టర్‌కు అవసరమైన పరికరాలను తయారు చేసే శాస్త్ర సాంకేతిక స్వావలంబనను సాధించడంలో ఏఎస్‌రావు కృషి మరువలేని దన్నారు. దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షులు ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ..మహామనిషి ఏఎస్‌రావు టెలిఫిలిమ్ చిత్ర నిర్మాణంలో తమ సొసైటీ కీలక పాత్ర పోషించిందన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల పదిన ఆ ఫిలిమ్‌ను ప్రదర్శిస్తామని, ఐదో తేదీన భగత్‌సింగ్‌పై నిర్మించిన ఫిలిమ్‌ను ప్రదర్శిస్తామని తెలిపారు. ఏఎస్‌రావుతో తాను చేసిన ఇంటర్వ్యూను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. ఏఎస్‌రావు నిరాడంబర జీవితాన్ని గడిపారని కొనియాడారు. అభ్యుదయ ఆర్ట్స్ ఈసీఐఎల్ శాఖ ఆధ్వర్యంలో పాండు, సోమయ్య, రుక్మయ్య ప్రదర్శించిన తులసి తీర్థం నాటకం ఆలోచింపజేసింది.

అంటరానితనం, కులం,మతం ప్రాణాలను రక్షించవు.. సాటిమనిషితో కలిసిమెలిసి ఉంటూ మానవత్వాన్ని ప్రదర్శించాలి అనే సందేశాన్ని ఆ నాటకం ఇచ్చింది. కార్యక్రమంలో ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పి.బి.చారి, అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు, మోగల్లు వాస్తవ్యులు బి.బలరాం, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మహామనిషి ఏఎస్‌రావు టెలిఫిలిమ్ డైరెక్టర్ రఘురాంచందర్, విజ్ఞాన వేదిక నాయకులు వెంకటసుబ్బయ్య, శివరామకృష్ణ, మల్లేశం, చల్లా లీలావతి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో నారాయణ విజయశంఖారావం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ఫలితాల్లో నారాయణ స్కూల్స్ విజయశంఖారావం పూరించాయి. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఏడుగురిలో ఒకరికి పదికి పది జీపీఏ వచ్చిందని తెలిపారు. 12.5 శాతం మంది విద్యార్థులకు పదికి పది జీపీఏ సాధించారని పేర్కొన్నారు. 32,135 మంది విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఏ గ్రేడ్ సాధించారని వివరించారు. సబ్జెక్టుల వారీగా 19,224 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారని తెలిపారు. పదికి పది జీపీఏ, 9.8 ఆపైన సాధించిన విద్యార్థులు 1,707 మంది, 9.5 జీపీఏ ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 43 శాతం ఉన్నారని పేర్కొన్నారు. 9.0 జీపీఏ ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 65 శాతం ఉన్నారని తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన బ్రాంచీలు 65 శాతం ఉన్నాయని వివరించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ



పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను తమ రోజువారీ సిలబస్‌లో భాగంగా బోధించడం ద్వారా నారాయణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. నారాయణ సీవో, స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ ప్రోగ్రామ్‌లతో బోధించడం కారణంగానే ఘనవిజయాలను సాధిస్తున్నామని తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయదుందుభి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ విజయదుందుబి మోగించింది. 1,402 మంది విద్యార్థులు పదికి పది జీపీఏను సాధించారని శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ చెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 9.8 జీపీఏ ఆపైన సాధించిన విద్యార్థులు 2,803 మంది, 9.5 జీపీఏ ఆపైన సాధించిన విద్యార్థులు 5,207 మంది, 9.0 జీపీఏ ఆపైన సాధించిన వారు 8,216 మంది ఉన్నారని వివరించారు. తమ విద్యాసంస్థలో 99.2 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. వంద శాతం ఉతీర్ణత పొందిన తమ బ్రాంచ్‌లు 84 ఉన్నాయని అన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఏ గ్రేడ్ సాధించిన విద్యార్థులు 17,913 మంది ఉన్నారని వివరించారు. గ్రేడ్ పాయింట్స్ అయినా, మార్కులైనా పదో తరగతి ఫలితాల్లో ఎల్లప్పుడూ శ్రీచైతన్య నెంబర్‌వన్ స్థానంలో నిలుస్తుందని చెప్పారు.

ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీ ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సీబ్యాచ్, సివిల్స్, మెడికాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్‌లు, మైక్రోస్థాయి బోధనతోపాటు అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులేని అన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను ఆమె అభినందించారు.

ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ నెరవేర్చలే

(మొదటిపేజీ తరువాయి)

అయ్యిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారని, కానీ ఇప్పటికీ చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటలు కరెంట్ ఇచ్చామని, ఇప్పుడు కరెంట్ ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో అయోమయంగా ఉందన్నారు. రైతులకు త్రీ ఫేస్ కరెంట్ కోసం కోట్లు ఖర్చుపెట్టామని, ఇప్పుడు కరెంట్ కోతలతో మోటార్లు కాలుతూ రైతులు గోస పడుతున్నారని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో ఉన్న చిన్న గిరిజన గ్రామానికి ఆనాడు మిషన్ భగీరథ నీళ్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.55 ఎకరాల పోడు పట్టాలు ఇచ్చి, రైతు బంధు ఇచ్చామన్నారు. ఇప్పుడు పోడు రైతులకు రైతు బంధు వచ్చిందా.. అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు సంపాదించాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య కాలంలో గిరిజన, ఆదివాసీలకు గుర్తింపు లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నడిబొడ్డున కోట్ల రూపాయలతో గిరిజన భవనాలు కట్టామని, సింగరేణి బిడ్డలకు సాయం, బోనస్, స్పెషల్ ఇంక్రిమెంట్.. ఇచ్చామని అన్నారు. సీఎం చోటే భాయ్... మోడీ బడే భాయ్ అంటూ విమర్శించారు. కేంద్రంలో 10 ఏండ్ల బీజేపీ పాలనలో ఒక్క హామీ నెరవేరలేదన్నారు. గోదావరి నీళ్లు ఎత్తుకుపోయి తమిళనాడుకు ఇస్తామని మోడీ అంటున్నారని, ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించాడు. సీతారామ ప్రాజెక్టు జిల్లాకు వరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం పెట్టి, ఆటో డ్రైవర్లను వీధిన పడేసిందని ఆరోపించారు. తెలంగాణ సమస్యలు, తెలంగాణ నదులు మనకు దక్కాలంటే బీఆర్ఎస్ గెలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో 91.31 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ ప్రాంగణంలో మంగళవారం విడుదల చేశారు. ఈ ఏడాది 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 86.60 శాతం ఉత్తీర్ణత వచ్చింది. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో గతేడాది కంటే ఇప్పుడు 4.71 శాతం ఉత్తీర్ణత పెరగడం గమనార్హం. రెగ్యులర్ విద్యార్థులు 4,94,207 మంది పరీక్షలకు హాజరుకాగా, 4,51,272 (91.31 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు 2,48,999 మంది పరీక్షలు రాయగా, 2,22,656 (89.42 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. బాలికలు 2,45,208 మంది పరీక్షలకు హాజరైతే 2,28,616 (93.23 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కంటే బాలికలు 3.81 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 11,606 మంది విద్యార్థులు ప్రయివేటుగా పరీక్షలకు హాజరుకాగా, 5,772 (49.73 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇందులో 7,583 మంది బాలురు హాజరైతే 3,594 (47.40 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,023 మంది బాలికలు పరీక్ష రాస్తే, 2,178 (54.14 శాతం) మంది పాసయ్యారు. ప్రయివేటు విద్యార్థుల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే బాలికలు 6.74 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు, సమగ్ర శిక్ష డైరెక్టర్ మల్లయ్య బట్టు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి, పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్, లింగయ్యతోపాటు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు విజయభారతి, శ్రీనివాసరావు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గురుకులాల్లో 98.71 శాతం ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులకు సంబంధించి 3,927 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. ఈసారి ఆరు పాఠశాలల్లో 'సున్నా' ఫలితాలొచ్చాయి. తెలంగాణ గురుకుల పాఠశాలలు 98.71 శాతంతో అత్యధిక ఉత్తీర్ణతను నమోదు చేశాయి. తెలంగాణ గురుకు లాలు, బీసీ, ఎస్సీ, గిరిజన, మైనార్టీ గురుకులాలతోపాటు మోడల్ స్కూళ్లు, ప్రయివేటు పాఠశాలలు, కేజీబీవీలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 91.31 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ఆశ్రమ పాఠశాలలు, ఎయిడెడ్, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 91.31 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణతను సాధించాయి.


99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ ప్రథమం

పదో తరగతి ఫలితాల్లో 99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 8,908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 8,823 (99.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 4,300 మంది బాలురు పరీక్షలు రాస్తే 4,246 (98.74 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,608 మంది బాలికలు పరీక్షలకు హాజరైతే 4,577 (99.33 శాతం) మంది పాసయ్యారు. 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్ధిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,976 మంది పరీక్షలు రాయగా, 13,788 (98.65 శాతం) మంది పాసయ్యారు. 98.27 శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో ఉన్నది. ఈ జిల్లా నుంచి 6,470 మంది పరీక్షలు రాస్తే, 6,358 (98.27 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 65.10 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి వికారాబాద్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,357 మంది పరీక్షలు రాయగా, 8,695 (65.10 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 2,28,616 (93.23 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కంటే బాలికలు 3.81 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 11,606 మంది విద్యార్థులు ప్రయివేటుగా పరీక్షలకు హాజరుకాగా, 5,772 (49.73 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇందులో 7,583 మంది బాలురు హాజరైతే 3,594 (47.40 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,023 మంది బాలికలు పరీక్ష రాస్తే, 2,178 (54.14 శాతం) మంది పాసయ్యారు. ప్రయివేటు విద్యార్థుల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే బాలికలు 6.74 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు, సమగ్ర శిక్ష డైరెక్టర్ మల్లయ్య బట్టు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి, పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్, లింగయ్యతోపాటు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు విజయభారతి, శ్రీనివాసరావు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల వివరాలు


రెగ్యులర్	బాలురు	బాలికలు	మొత్తం
హాజరు	2,48,999	2,45,208	4,94,207
ఉత్తీర్ణత	2,22,656	2,28,616	4,51,272
శాతం	89.42	93.23	91.31

శ్రామిక మహిళలంతా ఏకమై



మేడే... ఎనిమిది గంటల పనికై సాగిన పోరాటానికి చిహ్నం. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కదం తొక్కిన కార్మికుల ఘన చరిత్ర. 138 ఏండ్ల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ వీరోచిత పోరాటంలో మహిళల పాత్ర కీలకం. ఆనాడు బట్టల మిల్లుల్లో పెద్ద ఎత్తున పని చేసే మహిళలు సైతం ఈ పోరాటంలో తమ వంతు పాత్ర పోషించారు. త్యాగాలు చేసి ఎన్నో హక్కులు సాధించుకున్నారు. ఆ హక్కులన్నీ కాలరాయబడుతున్న తరుణంలో ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకుంటున్నాం. నేడు మన ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొనేందుకు శ్రామిక మహిళలంతా ఐక్యతతో మరింత చైతన్యంతో పోరాడాల్సిన అవసరాన్ని ఈ మేడే గుర్తుచేస్తోంది.

భారత్ నేడు 140 కోట్లకు పైగా జనాభాతో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనాను అధిగమించింది. ఇందులో 65శాతం జనాభా యువత కావడం వల్ల ఆర్థిక వృద్ధికి పూర్తి అవకాశాలున్నాయని నిపుణులు అంగీకరిస్తున్నారు. అయితే మహిళా ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం ఒక సమస్యగా మారింది. గత రెండు దశాబ్దాల్లో శ్రామిక మహిళల సంఖ్య రికార్డు స్థాయికి పడిపోయింది. శ్రామిక శక్తిలో మహిళలు 37శాతం మాత్రమే ఉన్నారు. అంటే భారతదేశ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు తక్కువగానే ఉంది. అంటే ఐదుగురిలో ముగ్గురికి పైగా మహిళలు పనికి దూరంగా ఉంటున్నారు.



ఆధిపత్య కాంప్లెక్స్

భారతదేశం పురుషాధిక్య సమాజం. కారణంగా మహిళల మనుగడలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా గృహ హింస, భ్రూణహత్యలు, నిరక్షరాస్యత, వివక్ష వంటి అనేక సమస్యలను ప్రతిచోటా ఎదుర్కొంటున్నారు. ఎవరైనా దీని నుండి తప్పించుకుంటే ఆమెకు కార్యాలయంలో లైంగిక వేధింపులు తప్పవు. దీని వెనుక ఒక కచ్చితమైన కారణం ఉంది. ఇది ఉన్నత స్థానంలో కూర్చున్న మనిషిలో ఆధిపత్య కాంప్లెక్స్. ఇది అసంఘటిత రంగం లేదా స్థానిక స్థాయిలో పనిచేసే వ్యక్తుల విషయంలో మాత్రమే కాదు బహుళ జాతీయ కంపెనీలలో, సివిల్ సర్వెంట్ కార్యాలయంలో కూడా కనిపిస్తుంది. ఈ సమస్య ప్రత్యేకించి మన దేశంలో మాత్రమే లేదు. చాలా దేశాలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి.

మరింత దిగజారిపోయింది

దేశంలో శ్రామిక శక్తిలో భాగమౌతున్న మహిళల్లో 95 శాతం మంది ఎటువంటి చట్టాలు వర్తించని అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. కరోనా తర్వాత శ్రామిక మహిళల స్థితి మరింత దిగజారిపోయింది. వర్క్ ఫ్రం హెూం ఫలితంగా పని గంటలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటీవల కాలంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పని చేసే వారిలో మహిళల సంఖ్య బాగా పెరిగిపోయింది. 8 గంటల పని విధానం చివరకు ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా కనుమరుగైపోయింది. ఆర్టీసీ, బ్యాంకులు, విద్యా, వైద్యం ఇలా ఏ రంగంలో చూసినా మహిళలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. కొన్ని చోట్ల 24 గంటలు పని చేయాల్సిన పరిస్థితి కూడా వచ్చేసింది. కొందరికి కనీసం ప్రసూతి సెలవులు కూడా వర్తించడం లేదు. ఇక షాపుల్లో సేల్స్ గర్ల్స్‌గా పని చేస్తున్న మహిళల పరిస్థితి మరింత దారుణం. పని చేసినంత సేపు నిలబడే ఉండాలి. వీరి జీతాలు అత్యంత దుర్భరంగా ఉంటున్నాయి. ఇలాంటి వారికి కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు కూర్చునే హక్కును కల్పించాయి. అలా అన్ని రాష్ట్రాలు చేస్తే కొంతైనా వెసులుబాటు దక్కుతుంది.

చట్టాలు నిర్వీర్యం

నేడు దేశాన్ని పాలిస్తున్న మతోన్మాదులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా కార్మికులు మరిన్ని సమస్యల్లోకి నెట్టివేయబడుతున్నారు. కార్పొరేట్లతో జత కట్టిన పాలకులు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. పోరాటాలు చేసి సాధించిన చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు. కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అదే జరిగితే శ్రామిక మహిళలపై దీని ప్రభావం మరింత ఉంటుంది. కనుక అందరూ ఐక్యంగా కార్పొరేట్లకు తొత్తులుగా మారిన మతోన్మాద పాలకులను తరిమి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను 24 ఏండ్లుగా స్వీపర్‌గా చేస్తున్నాను. నేను పర్మినెంట్ ఉద్యోగిని. విద్యానగర్లోని మసీదు రోడ్డులో పారిశుద్ధ కార్మికురాలిగా పనిచేస్తున్నాను. ఉద్యోగంలో చేరినప్పుడు నా జీతం 6000. ఇప్పుడు 18,000. అన్ని కటింగ్‌లు పోను 15,500 చేతికి వస్తుంది. నా భర్త మేస్త్రీగా పని చేసేవాడు. 13 ఏండ్ల కిందట బీపీ ఎక్కువై చనిపోయాడు. అప్పటి నుండి ఎన్నో కష్టాలు పడుతూ పిల్లలను పెంచుకుంటూ వచ్చాను. కరోనా సమయంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నాను. కుటుంబం నుంచి కూడా నాకు ఎటువంటి సహాయం అందలేదు. ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోలేదు. ముఖ్యంగా ఉదయం పూట 5.30 గంటలకి పనిలో ఉండాలంటే ఆ సమయంలో బస్సులు అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఆటోలో వస్తే ఒక్కొక్కరికి 200 అవుతుంది. పండుగలు వచ్చినప్పుడు మమ్మల్ని కనీసం హాఫ్ డే అన్నా పంపిస్తే పండుగ చేసుకోగలుగుతాం. మంచి యూనిఫామ్ కూడా మాకు లేదు. ఇప్పుడు వాళ్ళు ఇస్తున్న కోటు మా ఆడవాళ్ళకి ఎందుకూ పనికిరాదు. అది వేసుకుంటే చాలా అసౌకర్యంగా ఉంటుంది. ఇలా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. పనికి సమయానికి రాకపోతే జీతంలో కోత విధిస్తారన్న టెన్షన్ అనుక్షణం అనుభవిస్తున్నాం. దయచేసి ప్రభుత్వం మాకు తగిన సహాయం చేయాలని కోరుకుంటున్నాం.

- హంస, హయత్‌నగర్

భయంతో బతుకుతున్నాం



కాంట్రాక్ట్ స్వీపర్‌గా ఐదేండ్ల నుండి చేస్తున్నాను. విద్యానగర్, మసీదు రోడ్డు, బ్యాంకు రోడ్డు నేను పని చేసే ప్రాంతాలు. పొద్దున 5:30 నుండి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు వీధులు ఊడుస్తూ ఉంటాను. ఇన్ని రోజులుగా ఎంతో కష్టపడుతున్నాం, కానీ ప్రభుత్వం మాకు జీతాలు పెంచడం లేదు. నేను చేరినప్పుడు నా జీతం 12000/- ఇప్పుడు పదిహేను వేలు. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలంటే మా జీతాలు సరిపోవడం లేదు. మాలాగా మా పిల్లల జీవితాలు అవ్వకూడదు అని కోరుకోవడం తప్పా? నాకు భర్త లేదు. కిందటి ఏదాది క్యాన్సర్‌తో చనిపోయాడు. నాకు ముగ్గురు కొడుకులు, ఒక బిడ్డ. ఎలా బతకాలి అని ప్రతి రోజూ భయంతో కూడుకున్న దిగులు. మేము రిటైర్ అయ్యాక పెన్షన్ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మేము మనుషులమే. మాకూ కుటుంబం ఉంది. మా కష్టాన్ని చూసి ప్రభుత్వం కొన్ని సౌకర్యాలు కల్పించాలి. కొందరు పనిలోకి ఎంతో దూరం నుంచి వస్తారు. బస్సులు అందుబాటులో లేకపోతే ఆటోలో రావాలంటే మా జీతం ఆటో కిరాయిలకే సరిపోతుంది. ఒక్కరోజు పనిలోకి వెళ్ళకుంటే జీతం కట్ చేస్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా మా శ్రమను గుర్తించాలి.

- ఎన్.లలిత, అంబర్ పేట.

కొవిషీల్డ్‌తో ప్లేట్‌లెట్‌లు పడిపోతాయి

న్యూఢిల్లీ : కోవిడ్ కోసం తాము రూపొందించిన వ్యాక్సిన్ కొవిషీల్డ్ కారణంగా ప్లేట్‌లెట్‌ల సంఖ్య పడిపోవడం, రక్తం గడ్డ కట్టడం వంటివి సంభవించే అవకాశాలు వున్నాయని ఈ వ్యాక్సిన్ తయారీ సంస్థ, అంతర్జాతీయ ఔషధ రంగ దిగ్గజ కంపెనీ ఆస్ట్రాజెనికా అంగీకరించింది. అయితే అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే ఇవి చోటు చేసుకుంటాయని తెలిపింది. థ్రాంబోసిస్ విత్ థ్రాంబోసిటోపెనియా సిండ్రోమ్ (టిటిఎస్)గా పిలిచే వైద్య పరిస్థితికి తమ వ్యాక్సిన్‌కు సంబంధముందని కంపెనీ తొలిసారిగా అంగీకరించింది. ఆస్ట్రాజెనికా వ్యాక్సిన్ ఫార్ములాను పూనే కేంద్రంగా పనిచేసే వ్యాక్సిన్ తయారీ సంస్థ సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఐఐ)కి అందచేశారు. దాంతో భారత్‌లో కోవిషీల్డ్ వ్యాక్సిన్లను 174కోట్ల డోసులకు పైగా వేశారు. వ్యాక్సిన్లు వేసిన నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు ఈ అంశం హఠాత్తుగా తెర మీదకు రావడానికి కారణం ఆస్ట్రాజెనికా కంపెనీ ఈ విషయాన్ని అంగీకరిస్తూ కోర్టుకు పత్రాలు అందచేయడమే. ఇద్దరు పిల్లల తండ్రి అయిన జేమీ స్కాట్ ఈ వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత 2021 ఏప్రిల్‌లో తనకు బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టిందని, దాంతో రక్తస్రావం జరిగి శాశ్వతంగా మెదడులో కొంత భాగం గాయపడిందని, దాంతో పనేమీ చేయలేకపోతున్నానని ఫిర్యాదు చేస్తూ కోర్టుకు వెళ్లారు. బ్రిటన్‌కు చెందిన టెలిగ్రాఫ్ ఈ కేసును వివరిస్తూ లండన్ హైకోర్టులో ఇటువంటివి 51 కేసులు నమోదయ్యాయని తెలిపింది. వారు కంపెనీ నుండి నష్టపరిహారాన్ని కోరుతూ కేసులు వేశారని పేర్కొంది. ఆ కేసుల విచారణ సందర్భంగా కంపెనీ ఈ విషయాలు వెల్లడించింది. అయితే, పది లక్షల కేసుల్లో నలుగురికి ఇలా సంభవించే అవకాశం వుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది. ఈవ్యాక్సిన్లు వేయడానికి ముందుగా అంటే 2021 జనవరిలో భారత ప్రభుత్వం కూడా ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. తక్కువ ప్లేట్‌లెట్‌ల సంఖ్య వుండేవారికి అత్యంత జాగ్రత్తగా ఈ వ్యాక్సిన్ ఇవ్వాల్సి వుంటుందని నిర్దిష్టంగా చెప్పింది.

బీజేపీ బెదిరింపులతో పోటీ నుంచి ఔట్

- వైదొలగిన ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి !
- 17 ఏండ్ల నాటి కేసుకు హత్యాయత్నం ఆరోపణలు జోడింపు

ఇండోర్ : ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో వున్న అక్షయ్ కాంతి బామ్ ఎన్నికల బరి నుండి వైదొలిగారు. 17ఏండ్లనాటి పాత కేసులో హత్యా యత్నం ఆరోపణలను జోడించాల్సిందిగా ఇండోర్‌లోని సెషన్స్ కోర్టు ఈ నెల 24న పోలీసులను ఆదేశించింది. అదే రోజున కాంతి నామినేషన్ వేశారు. కానీ ఐదు రోజుల తర్వాత సోమవారం అక్షయ్ కాంతి తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని, బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ బేకప్ అభ్యర్థిగా మోతీ సింగ్ వేసిన నామినేషన్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. అక్షయ్ కాంతిని ఉపసంహరించుకున్న నేపథ్యంలో సింగ్ తన నామినేషన్‌ను ఆమోదించాల్సిందిగా ఇండోర్ హైకోర్టుకు వెళ్ళారు. కానీ మంగళవారం ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చారు. అక్షయ్ కాంతితో పాటు మరో8మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మే 13న ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. బరిలో 13మంది మిగిలారు. బీజేపీకి గట్టి పట్టు వున్న ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో లేకపోవడం ఇదే మొదటిసారి. అక్షయ్ కాంతిని బెదిరించి మరీ వారి పార్టీలోకి లాక్కున్నారని మధ్య ప్రదేశ్ కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ముందుగా, వారిని బెదిరించి, నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జితూ పట్వారి విమర్శించారు. కాంతిపై ఒత్తిడి తెచ్చేందుకే ఏండ్ల నాటి పాత కేసును నవరిస్తూ మార్పులు తీసుకువచ్చారన్నారు.

పాత కేసును తవ్వి...

2007 నాటి ఈ కేసులో బామ్ కుటుంబం తొలుత యూనస్ ఖాన్ అనే వ్యక్తి నుండి స్థలంకొనుగోలు చేసింది. ఆ తర్వాత బామ్‌పై ఫిర్యాదు చేస్తూ ఖాన్ పోలీసులను ఆశ్రయించాడు. దాంతో మేజిస్ట్రేట్ కోర్టు జారీ చేసిన ఆదేశాల ప్రకారం, పోలీసులు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గాయపరచడం, బహిరంగంగా అసభ్య పదజాలం ఉపయోగించడం, నేరపూరితమైన అడ్డగింపు, అల్లర్లకు పాల్పడ్డం, చట్టవ్యతిరేకంగా సమావేశమవడం, పేలుడు పదార్థాలతో తప్పుడు పనులు వంటి అంశాలపై కేసు నమోదైంది. తాజాగా ఈ నెల 24న 307, 436 సెక్షన్లను చేర్చాల్సిందిగా కోర్టు పోలీసులను ఆదేశించింది. ఇది హత్యాయత్నానికి సంబంధించిన సెక్షన్ కావడంతో బెదిరిపోయిన బామ్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు.

అబద్ధాల ప్రధానిది.. డంబాచారమే

'బీజేపీ బందిఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం' బుక్‌లెట్ ఆవిష్కరణలో బీవీ రాఘవులు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ నాయకులు, ప్రధాని మోడీ మళ్లీ మూడోసారి గెలవాలని తాపత్రయ పడుతున్నారని చెప్పారు. కానీ..వారి మాటలు, వారి చేతలు చూస్తే..తీవ్రమైన భయాందోళనలో ఉన్నట్టు అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. అందుకే డంబాచారాలకు పోతూ, అబద్ధాలను వల్లె వేస్తూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలో బీజేపీ బండారాన్ని బయట పెట్టేందుకు తెలంగాణ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రకరకాల రూపాల్లో దాని అబద్ధాల ప్రచారాన్ని ఎండగట్టాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో 370 నుంచి 400 సీట్లు గెలుస్తామని ఊదరగొట్టిన మోడీ.. ఇప్పుడా మాటలకు విరామమిచ్చారని గుర్తు చేశారు. 'మంగళసూత్రాలు కూడా గుంజుకుంటుందని, ముస్లీంలకు రిజర్వేషన్లు తీసేస్తాం' అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను సెంటిమెంటుతోపాటు మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం ద్వారా గెలవాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ఆ పాలన ఎంత అధ్వాన్నంగా ఉందో పదేండ్ల పాలన చూస్తే అర్థమవుతోందని వివరించారు. దేశంలో మోడీ హయాంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిందన్నారు. మొత్తం మీద 20 శాతం చదువుకున్న వారు నిరుద్యోగులుగా ఉన్నారని చెప్పారు. అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేండ్లలో రూ. 7వేల కోట్లకు పైబడి ఆస్తి కలిగిన బిలియనీర్ల సంఖ్య 60 మంది నుంచి 220 మందికి ఎలా పెరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. పారిశ్రామికీకరణ పూర్తిగా స్తబ్దతలోకి పోయిందన్నారు. అవినీతి బాగా పెరిగిందని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లలో సగం బీజేపీ దక్కించుకుందనీ, ఆ రకంగా ఇచ్చిన వారికి రాయితీలు ఇచ్చిందనీ, వారి అవినీతి ఈ దెబ్బతో మాఫీ అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాదాన్ని పాతి పెట్టేందుకు అది శతవిధాలా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఇదంతా కేవలం ట్రైలరే..అసలు సినిమా ముందుందంటూ చెబుతున్నారని గుర్తు చేశారు. అసలు సినిమా అంటే ఏమిటి? మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి రైతులపై బలవంతంగా రుద్దుతారా..? నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా అమలు జరిపి, కార్మికులపై భారం మోపుతారా? గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులను అణచేస్తారా? సీఏఏను అమలు జరిపి, మైనార్టీలకు పౌరసత్వం లేకుండా, ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తారా..? ప్రజాస్వామిక హక్కులు కాలరాస్తారా? వన్‌నేషన్, వన్ ఎలక్షన్ ద్వారా ఏకవ్యక్తి పరిపాలనను అమలు చేస్తారా? చెప్పాలంటూ నిలదీశారు. వీటి కోసమే అయితే.. అలాంటి సినిమా మనకొద్దనీ, ఆ సినిమాను వదిలించుకోవడం మంచిదని సూచించారు. లేకపోతే దేశానికి భవిష్యత్తే లేదని ఆయన హెచ్చరించారు.

అలాగే సీపీఐ (ఎం) చూపే ప్రత్యామ్నాయ విధానాలను కూడా ప్రజలకు వివరించాలని రాఘవులు ఈ సందర్భంగా కోరారు. బీసీలకు కుల గణన కావాలి, అది చేయాల్సిన అవసముందని అన్నారు. 50 శాతం రిజర్వేషన్ సిలింగ్‌ను ఎత్తివేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. మైనార్టీలకు, మహిళలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 'ఉపా'లాంటి చట్టాల్ని ఎత్తేయాల్సిన అవసరముందని చెప్పారు. ఇలాంటి ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికతో సీపీఐ(ఎం) ప్రజల ముందుకు పోతోందని స్పష్టం చేశారు. మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలనీ, కార్మికులకు కనీస వేతనాలిచ్చి వారి కొనుగోలు శక్తి పెంచాలన్నారు. లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారిని, అలాంటి వాటి కోసం పనిచేసే వారిని లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాల్సిన అవసరముందని చెప్పారు. బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భువనగిరి పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ పోటీ చేస్తున్నారనీ, ఆయన్ను గెలిపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని శాసన సభ, ఒక పార్లమెంట్ స్థానానికి సీపీఐ (ఎం) పోటీ చేస్తున్నదనీ, ఆయా స్థానాల్లో కూడా సీపీఐ(ఎం)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



విద్యావేత్త చుక్కా రామయ్యకు బీవీ రాఘవులు పరామర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్యను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మంగళవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని విద్యా నగర్‌లో గల ఆయన నివాసానికి వెళ్లిన రాఘవులు..రామయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహ రావు కూడా ఉన్నారు.

కాంగ్రెస్-బీఆర్ఎస్ తోడు దొంగలే..

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. మంగళవారం మెదక్ జిల్లా అల్లాదుర్గంలో జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజక వర్గాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం నిర్వహించిన ఎన్నికల ప్రచార జన సభలో మోడీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవినీతి పాలన చేపట్టి పాలన, విధానపరమైన నిర్ణయాలతో భ్రష్టు పట్టించాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పంచ సూత్రాలైన కుటుంబం, అవినీతి రాజకీయాలు, అబద్ధాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిలో నుంచి 55 శాతం అధిక ట్యాక్స్‌లు వసూలు చేసే కుట్ర పన్నుతోందని అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో దోచుకున్నదని, వీరిద్దరూ ఒకరినొకరు కాపాడుకుంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయకపోగా వంద రోజుల్లో రుణమాఫీ చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం కఠినమైన కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చిందని చెప్పారు. బేటీ పడావో బేటీ బచావో పేరుతో చదువుతో పాటు రక్షణ కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కులను కాలరాసిందన్నారు. ముస్లింలను ఓబీసీల జాబితాలో చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. సామాజిక న్యాయం, భారత రాజ్యాంగాన్ని గౌరవించడంలో మోడీ మొదటి స్థానంలో ఉంటారని, గుజరాత్ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికైన తర్వాత పార్లమెంట్ హాల్‌లో రాజ్యాంగానికి మోకరిల్లి నమస్కారం చేశానని చెప్పారు. అలాంటి తాను రాజ్యాంగాన్ని ఎందుకు మారుస్తానని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం, భగవద్గీత పవిత్ర గ్రంథాలని, వాటిని సమానంగా కొలుస్తానని అన్నారు. రాజ్యాంగం పట్ల దుష్ప్రచారం చేస్తున్న రేవంత్‌రెడ్డి చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజ్యాంగాన్ని అవమానపరిస్తే సహించేది లేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తున్నారని హెచ్చరించారు. కేంద్రంలోని పదేండ్ల బీజేపీ పాలనలో తెలంగాణ అభివృద్ధి సాధించిందన్నారు. నాలుగు జాతీయ రహదారులు, 40 రైల్వే స్టేషన్లకు ఆధునీకరణ, కొత్త ప్రాజెక్టులు మంజూరు చేసినట్టు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు, జహీరాబాద్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజల్ని కోరారు. సభలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, సంగారెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే ఎ.వెంకటరమణారెడ్డి, నాయకులు మురళీయాదవ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఓట్లే లక్ష్యంగా..


- ఏపీలో కూటమి ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల
- రాష్ట్రం అప్పుల్లో ఉందంటూనే అలవికాని హామీలు
- కేంద్రం, బీజేపీ ప్రస్తావన లేకుండానే..

అమరావతి : ఏపీ ఎన్నికలకు టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి ఉమ్మడి మ్యానిఫెస్టోను మంగళవారం విడుదల చేసింది. ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో మూడు పార్టీల నేతలు దీన్ని ఆవిష్కరించారు. చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ ఏపీ ఇన్‌చార్జీ సిద్ధార్థ్‌నాథ్ సింగ్ ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగు జాతికి పూర్వ వైభవం తీసుకురావాలన్న లక్ష్యంతోనే మూడు పార్టీలు కూటమిగా జట్టు కట్టామని చంద్రబాబు తెలిపారు.రాష్ట్రాన్ని కాపాడుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలతో ముందుకొచ్చినట్టు చెప్పారు.మ్యానిఫెస్టో అమలుకు కేంద్రం సహకారం మెండుగా ఉంటుందని పేర్కొన్నారు. రేపటి ఆకాంక్షలను సాకారం చేసే విధంగా మ్యానిఫెస్టోను రూపొందించినట్టు పవన్ కల్యాణ్ తెలిపారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచారు. ప్రజా రాజధాని అమరావతిని విధ్వంసం చేశారు. వందకు పైగా సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారు. లక్షలాది ఎకరాల ప్రజల ఆస్తులు కబ్జా చేశారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన రూ.12 వేల కోట్లు మళ్లించారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు, విధ్వంస పాలనను సాగనంపేందుకు కూటమి ముందుకొచ్చింది" అని పవన్ తెలిపారు.అయితే కేంద్రం, బీజేపీ గురించి ప్రస్తావన లేకుండా మ్యానిఫెస్టో విడుదల చేయటం గమనార్హం.

మోడీ-షాకు నోటీసులివ్వాలి

రేవంత్‌రెడ్డిని జైల్లో పెట్టేందుకు బీజేపీ కుట్ర : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బదులుగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నోటీసులివ్వాలని ఢిల్లీ పోలీసులను సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ కోరారు. కేంద్రం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే ఢిల్లీ, జార్ఖండ్ సీఎంలను ఇప్పటికే జైల్లో పెట్టారనీ, కొత్తగా రేవంత్ రెడ్డిని జైలులో పెట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని ఏదో పద్ధతిలో ఇబ్బందికి గురిచేస్తూ వారిని ఇరికించే ప్రయత్నం చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యర్థులు లేకుండా బీజేపీ కొత్త పన్నాగం పన్నుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. బీజేపీకి వ్యతిరేకంగా కర్నాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారనీ, ఆయన్ను నియంత్రించేందుకే నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఇండియా కూటమి గెలిస్తే దేశానికి ప్రమాదమంటూ మోడీ చెప్పడం సరైంది కాదన్నారు. జాతి ఔన్నత్యానికి, లౌకికవాదానికి వ్యతిరేకంగా మోడీ, అమిత్ షా మాట్లడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే మోడీ పతనం మొదలవుతుందని చెప్పారు. ప్రధాని కక్షపూరితంగా వ్యవహరిస్తూ దిగజారి ప్రవర్తిసున్నారని నారాయణ ఈ సందర్భంగా విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత దిగజారిన ప్రధాని మరొకరు లేరన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండబోదనీ, హిట్లర్ తరహాలో నియంతృత్వ పాలన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలను పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాబోదని అన్నారు. రాష్ట్రంలో ప్రమాదకర బీజేపీ ఎదిగేందుకు బీఆర్ఎస్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

దండకారణ్యంలో మళ్లీ పేలిన తూటా



నారాయణపూర్ : ఛత్తీస్‌గఢ్‌లో 15 రోజుల వ్యవధిలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళలతో కలిపి పది మంది మావోయిస్టులు మృతి చెందారు. నారాయణపూర్- కంకెర్ జిల్లాల మధ్య ఉన్న అడవిలో భద్రతా సిబ్బంది, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి విజయ్ శర్మ తెలిపారు. ఈ నెల 16న కంకెర్ జిల్లాలోని కల్పెర్ గ్రామంలో 29 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే. మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం కల్పెర్ గ్రామానికి దక్షిణంగా సుమారు 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌ను భారీ విజయంగా హోం మంత్రి విజయ్ శర్మ అభివర్ణించారు. మావోయిస్టులు ఇప్పటికైనా చర్చలకు ముందుకు రావాలని, హింసా మార్గాన్ని వీడాలని విజ్ఞప్తి చేశారు.

అభుజ్మాడ్ ప్రాంతంలోని టెక్మెత, కకూర్ గ్రామాల మధ్య ఉన్న అడవిలో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. పోలీసులకు చెందిన జిల్లా రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సంయుక్త బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని చెప్పారు. ఈ ప్రాంతంలో సాయుధ నక్సలైట్లు ఉన్నారనే కచ్చితమైన సమాచారంతో సోమవారం రాత్రి నుంచి ఈ తనిఖీలు ప్రారంభించినట్టు పోలీసు అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ ముగిసిన తరువాత 10 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారని తెలిపారు. మృతి చెందిన వారిని ఇంకా గుర్తించాల్సి ఉందని అన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి ఒక ఎకె-47 రైఫిల్, ఒక ఐఎన్‌ఎస్‌ఎఎస్ రైఫిల్, ఇతర ఆయుధాలు, మందు గుండు సామగ్రి, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ తనిఖీల్లో పాల్గొన్న భద్రతా సిబ్బందిని ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ అభినందించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా సిబ్బందికి ఎలాంటి హాని జరగలేదని చెప్పారు. 'ముఖ్యమంత్రి విష్ణు దేవసాయి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను మావోయిస్టులతో చర్చల ద్వారా పరిష్కరించాలని కోరుకుంటుంది. మావోయిస్టులు వ్యక్తిగతంగా కానీ, గ్రూపులుగా కానీ వీడియో కాల్ లేదా మధ్యవర్తి ద్వారా మాట్లాడాలనుకుంటే మేం సిద్ధంగా ఉన్నాం. వారికి మెరుగైన పునరావాసం కల్పిస్తాం. ఆయుధాలు వీడి ప్రధాన జీవన స్రవంతిలో చేరాలని మేం వారిని కోరుతున్నాం. బస్తర్‌లో శాంతి నెలకొనాలని, అభివృద్ధి చెందాలని మేం కోరుకుంటున్నాం' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

మరోవైపు నారాయణపూర్, కాంకెర్‌తో సహా మొత్తం ఏడు జిల్లాలు ఉన్న బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 91 మంది మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు చెప్పారు.

ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టను కాంగ్రెస్ దెబ్బతీసింది

- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వందేండ్ల ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి నీళ్లు, కరెంట్ ఇవ్వలేమనీ, విద్యార్థులు వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. సర్కార్ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తడంతో చీఫ్ వార్డెన్‌కు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలుంటే వర్సిటీకి సెలవులెట్లా ప్రకటిస్తారని ప్రశ్నించారు. బీసీ,ఎస్సి, ఎస్టీలకు చెందిన విద్యార్థులను హస్టల్ నుంచి వెళ్లగొట్టే కుట్ర జరిగిందని ఆరోపించారు. అవగాహన లేకుండా రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాల వల్ల విద్యార్థులతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట మారుస్తున్నదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
బుధవారం | మే 1, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ తీగల మాధవి సాయినాథ్ రెడ్డి మంగళవారం మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జిల్లెల నరేందర్ రెడ్డి, మీర్ పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండు గౌడ్, రవీంద్ర చారి, యాదిరెడ్డి ఉన్నారు.

పదిలో తిరుగులేని విజేత శాంతినికేతన్



నవతెలంగాణ - హయత్ నగర్

పదో తరగతి ఫలితాలలో హయత్ నగర్‌లోని శాంతి నికేతన్ విద్యా సంస్థల విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని విద్యా సంస్థల చైర్మన్ రాధాకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 10/10 పాయింట్లు 29మంది, 9.8పాయింట్లు 26మంది సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జన్సీ రాధాకృష్ణ, శేషారావు, సుధీర్, ఫణిశ్రీ ప్రబంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదిలో పలు పాఠశాలల ప్రభంజనం

టెన్త్‌లో లార్డ్స్ పాఠశాలల విజయ దుందుభి..



నవతెలంగాణ - మీర్‌పేట్

పదవ తరగతి ఫలితాలలో లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డితో కలిసి సిద్దాల బీరప్ప మాట్లాడారు. మొత్తం 138 మంది విద్యార్థులు ఎ1 గ్రేడ్‌ను సాధించి లార్డ్స్ ప్రభంజనాన్ని మరోసారి నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో లార్డ్స్ స్కూల్ విద్యార్థులది అందెవేసిన చెయ్యి అని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను లార్డ్స్ స్కూల్ యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదిలో సత్తా చాటిన 'విశ్రా' విద్యార్థులు



నవతెలంగాణ - మీర్ పేట్

పదో తరగతి ఫలితాలలో 'విశ్రా' విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారని విశ్రా విద్యాసంస్థల డైరెక్టర్ దోర్బల హరినాథ్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 99 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. మొత్తం 43 మంది విద్యార్థులలో గణితం-9,సైన్స్-10, ఇంగ్లీషు-8, సాంఘిక శాస్త్రం- 9, హిందీ- 16, తెలుగు-5 మంది, 10/10 ఏ1 గ్రేడ్ పాయింట్లు సాధించారని చాలా సంతోషంగా ఉందన్నారు. మొత్తంగా 43 మందికి గాను 36 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్లు సాధించారని అన్నారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

టెన్త్‌లో 'ఏమినెంట్ విద్యాసంస్థల' విజయకేతనం



నవతెలంగాణ - మీర్ పేట్

పదో తరగతి ఫలితాలలో 'ఏమినెంట్' విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఏమినెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ వి వి రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. దెంది సహస్ర రెడ్డి- 10/10 ఏ1 గ్రేడ్, గంటేల జ్యోస్న - 9.8/10, సుఖమేటి శ్రీష - 9.8/10, దెంది సహర్ష్ రెడ్డి - 9.5/10, ఎమ్మది వర్షిత - 9.5/10 పాయింట్లు సాధించారని చాలా సంతోషంగా ఉందన్నారు. మా పాఠశాలల్లో విద్యార్థులపై ఒత్తిడి లేకుండా, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులచే విశాల వాతావరణంలో విద్యాబోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోకిల రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయకేతనం ఎగరవేసిన ఎడుస్టార్ట్



నవతెలంగాణ- సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఎడుస్టార్ట్ స్కూల్ విద్యార్థులు 100% ఫలితాలు సాధించినట్టు స్కూల్ డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మా పాఠశాలలో 10/10 జీపీఏ ఒకరికి, 9.2 జీపీఏ ఇద్దరికి, 9.7 జీపీఏ ఇద్దరికి, 9.5 జీపీఏ ఇద్దరికి, 9.2 జీపీఏ ముగ్గురికి, 9 జీపీఏ 10 మందికి వచ్చాయని తెలిపారు. ఈ ఫలితాల పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లీదండ్రులు ఎంతో సంతోషంగా హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బృందం కృషి వలనే మంచి ఫలితాలు వచ్చాయని కొనియాడారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా, ఏ విధంగా పరీక్షలకు ప్రిపేర్ కావాలో సూచించారు. విద్యార్థుల జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుటకు పదో తరగతి చాలా ముఖ్యమన్నారు. ఇప్పటినుండి క్రమ పద్ధతిలో విద్యను కొనసాగిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రిన్సిపల్ సంధ్యారెడ్డి, ఉపాధ్యాయులుచ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- సిటీబ్యూరో

మంగళవారం వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ గిరిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యను అందిస్తున్నామని, ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే విద్యను అందిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కాకుండా వారికి పాఠాలు బోధిస్తూ ఈ యొక్క ఫలితాలు సాధించామని అన్నారు. అనంతరం ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. సాయి సోహన్ 10/10, జస్వంత్ 9.7, జ్యోతి ప్రకాష్ 9.5, సాయి కృష్ణ 9.5, శ్రీ హారిక 9.5, హర్షవర్ధన్ 9.2, మణికంఠ 9. ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేశవరెడ్డి హై స్కూల్



నవతెలంగాణ - సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాలలో కేశవరెడ్డి హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని స్కూల్ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ ఎమ్మెస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యం.సాహితి 10/10, అక్షయ్ కుమార్ 9.7, ఏం. లాస్య 9.3, కే. కావ్య 9.2, ఎస్. లక్ష్మీ ప్రసన్న 9.2, ఎస్. ప్రశాంతి 9.0 ఫలితాలు సాధించారని తెలిపారు. మా పాఠశాల యందు ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు లక్ష్యాలలో నిర్దేశిస్తూ వాటిని ఏ విధంగా చేరుకోవాలో సూచిస్తూ వారికి విద్య విలువను తెలియజేస్తూ చదువును ఇష్టంగా చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని విద్యార్థులు ఇప్పటినుండి క్రమ పద్ధతిలో చదువును కొనసాగిస్తే విజయ తీరాలకు చేరవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - సంతోష్ నగర్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సంతోష్‌నగర్ భాష్యం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘన విజయాన్ని సాధించారని సీఈవో చైతన్య తెలిపారు. 17 మంది విద్యార్థులు 10/10 జీపీఏ, 16 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించినట్టు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను జెడ్ ఈవో అంకమ్మరావు అభినందించారు. ఈ సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ సునీత అభినందించారు.

సత్తా చాటిన గీతాంజలి విద్యాలయ విద్యార్థులు



నవతెలంగాణ - సంతోష్‌నగర్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గీతాంజలి విద్యాలయ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ దయాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి. ప్రణీత్ 10/10 జీపీఏ సాధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విజయభేరి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విజయభేరి మోగించిందని స్కూల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ వారాల నరేందర్ రెడ్డి, డైరెక్టర్స్ బి.సౌమ్య, డి. స్నేహ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మా స్కూల్ అద్భుత విజయాలను కొనసాగిస్తుందన్నారు. ఏ .హనీ 10/10, కె.మనిషా రెడ్డి 10/10 సాధించారని, డి.నిషిత 9.8, కె .ప్రణీకా రెడ్డి 9.8, పి. అశ్విని 9.8, కె.మనీషా 9.8, 9.7 ముగ్గురు సాధించారని తెలిపారు. మొత్తం 65 మంది విద్యార్థులకు గాను 65 మంది విద్యార్థులు పాస్ అయ్యారని అన్నారు. విద్యార్థుల యొక్క జీవితం తరగతుల నుండి ప్రారంభమవుతుందని అన్నారు. పిల్లలు చిన్నప్పటి నుంచి చదువులో ముందుండాలని, లక్ష్యాన్ని నిర్దేశించినప్పుడు జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని అన్నారు. మా స్కూల్ నందు ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులను పరిశీలిస్తూ.. విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా సలహాలు సూచనలు ఇస్తూ పిల్లల్ని చదువుపై శ్రద్ధ కనబరిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన ఆర్కేపురం భాష్యం



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురంలోని భాష్యం పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు భాష్యం హైదరాబాద్ సీఈవో చైతన్య తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఎల్బీ నగర్ జోన్ జెడ్ఈఓ అంకమ్మరావు పాఠశాల ప్రిన్సిపల్ అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ బ్రాంచ్ నుండి 168 మంది విద్యార్థులకు గాను 17 మందికి 10/10 , 18 మందికి 9.8, 25 మందికి 9.7, 5 గురుకి 9.5, 109 మంది విద్యార్థులు 9.0 పైగా సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ అనుపమ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - చైతన్యపురి

పక్కా ప్రణాళికతోనే పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించామని చైతన్యపురి భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ పల్లవి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పల్లవి రెడ్డి మాట్లాడుతూ 139 మంది విద్యార్థులకు గాను 10 మందికి 10/10, 10 మందికి 9.8, 9 మందికి 9.7, 8 మందికి 9.5, 9 జీపీఏ పైగా 60 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదిలో పహాడి షరీఫ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ - బడంగ్ పేట్

పదో తరగతి ఫలితాల్లో మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పహాడి షరీఫ్ ఉర్దు మీడియం పాఠశాలలో 23 మంది విద్యార్థులకు గాను 22 విద్యార్థులతో 96% ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అమతుల్ మహమూది, ఉపాధ్యాయులు సలీం, దస్తగీర్ బీరప్ప జేబ, తస్లీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో లోటస్ లాప్ ప్రభంజనం



నవతెలంగాణ-తుర్కయంజాల్

పది ఫలితాల్లో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ ప్రభంజనం సృష్టించిందని పాఠశాల చైర్మన్ ఎ. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ మం జుల రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనస్థలిపురం, హయత్ నగర్, కమలానగర్ విద్యార్థులు అత్యున్నత ఫలితాలను సాధించారని తెలిపారు. 146 విద్యార్థులలో 9 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధిం చారన్నారు. విద్యార్థులు ఈ. అదితి, డి. జన్రితా రెడ్డి, పి.ప్రణ వి, ఎమ్. సాయి హర్షిత, జి.సృజన, జి. లాస్యా రెడ్డి, గురాన్ష్ సింగ్, కె. దీపక్ రెడ్డి, పి. అభిరామ్ 10/10 సాధించినట్లు చెప్పారు. తమ స్కూళ్ల నుంచి 82 శాతం విద్యార్థులు 9 జీపీఏకు పైగా ఉత్తీర్ణత సాధించారన్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ ఎ. శ్రీనివాస్ రెడ్డి, జోనల్ ప్రిన్సిపల్స్ ఉషాకిరణ్, అతీకా ఫాతిమా ప్రిన్సిపల్స్ మహాలక్ష్మి, లక్ష్మి ప్రియ, చైతన్యకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

టెన్త్‌లో శ్రీ ఆదిత్య స్కూల్ విజయకేతనం



నవతెలంగాణ- సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ ఆదిత్య స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని స్కూల్ చైర్మన్ కెవిస్వి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ముగ్గురికి 10/10, 29 మంది 9 జీపీఏ పైగా, 23 మంది 8 జీపీఏ పైగా సాధించారని తెలిపారు. ఈ మంచి ఫలితాలకు ముఖ్య కారణం ఉత్తమ విద్యా బోధన, క్రమశిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఒకటి రెండు సార్లు పాఠాలు చెప్పడం, ఎటువంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధిస్తూ ఈ ఫలితాలు సాధించమని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభంజనం సృష్టించిన మెగా సిటీ స్కూల్



నవతెలంగాణ- సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాలలో మెగాసిటీ స్కూలు అద్భుత ఫలితాలు సాధించిందని మెగాసిటీ స్కూల్ డైరెక్టర్ పి. సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా మా స్కూలు అద్భుత ఫలితాలు సాధిస్తూ వస్తుందని, దీనికి ముఖ్య కారణం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం అన్నారు. విద్యలో ఎటువంటి రాజీ లేకుండా పిల్లలకు భవిష్యత్ గురించి లక్ష్యాలను నిర్దేశిస్తూ... వారికి చదువు యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ చదువు పట్ల ఇష్టాన్ని పెంచుతూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నామని అన్నారు. మా స్కూల్ నుండి ఎంతోమంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పడానికి మేము గర్వపడుతున్నామని అన్నారు. పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉంటే విద్య చెప్పినందుకు ఉపాధ్యాయులుగా మాకు తల్లిదండ్రులకు ఎంతో పేరు తెచ్చిన వారు అవుతారని అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. 10/10 ఐదుగురికి, 9.8 ఎనిమిది మందికి, 9.7 ఏడుగురికి, 9.5 ఆరుగురుకి 9.3 ముగ్గురికి, 9.2 ఆరుగురుకి, 9.0 నలుగురుకి ఫలితాలు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపాల్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ ఇచ్చిందేమీ లేదు..

గాడిద గుడ్డు తప్పా..

నవతెలంగాణ - మీర్ పేట్/ చైతన్యపురి

గడిచిన 10 సంవత్సరాలలో మోడీ బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదు.. గాడిద గుడ్డు తప్ప అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో, ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ చౌరస్తాలో రోడ్డుషోలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డితో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు సెమీఫైనల్స్ అని సెమీఫైనల్స్ లో అవినీతి అక్రమాలు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బండ కేసు కొట్టి ఓడించి గెలిచామని ఇప్పుడు జరుగుతున్న ఎంపీ ఎన్నికలు ఫైనల్స్‌గా అభివర్ణించారు. కార్యకర్తలు నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేసి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేందుకు హస్తం గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ జీవితంలో మళ్లీ పదవియోగం లేదని జ్యోష్యం చెప్పారు. కూతురు కవిత బెయిల్ కోసం కేసీఆర్ బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకొని బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపిక చేసి ఆయనను బలి చేస్తున్నారని అన్నారు. ఇక బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలకు సేవ చేయడం కోసం రాజకీయం చేయడం లేదని వ్యాపారం చేయడం కోసం రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. విశ్వేశ్వర్ రెడ్డిని కలవాలంటే అపాయింట్మెంట్ ఉండాలని అలాంటి వ్యక్తికి ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఉందా అని ప్రజలు ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలు తలుచుకుంటే బండైనా కొండైనా చిత్తు చేస్తారని అదే రీతిలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గతంలో కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీగా ఉండి చేవెళ్ల నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐటిఐఆర్ చేవెళ్ల నియోజకవర్గానికి మంజూరు చేస్తే మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఐటిఐ రద్దు చేశారని అయినా అప్పుడు ఎంపీగా ఉన్న కొండ ప్రశ్నించలేదని ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని తెలిపారు. ఇక తనను తిట్టడానికే ప్రధాని మోడీ ఏడు విమానాలు వేసుకొని తిరుగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కే ఎల్ ఆర్, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డీసీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారి జాత నర్సింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు షోలో మోడీ, కేసీఆర్‌లపై విరుచుకుపడ్డ సీఎం రేవంత్ రెడ్డి

బద్ధకస్తుడికి.. బాధ్యతాయుతమైన నాకు పోటీ..

ఉద్యమం ముసుగులో పదవులు పొందలేదు..

కొండా పొలిటికల్ టూరిస్టు.. నేను ప్రజాసేవకున్ని

కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో పదవి పొందా..







హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాలల్లో పనిచేసిన 24 మంది పదవీవిరమణ పొందారు. బంజారాహిల్స్‌లోని సీసీసీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ జే.పరిమళ హననూతన్, చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ సుధారాణి, సిటీ పోలీస్ కోవాపరేటీవ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సెక్రెటరీ, సిటీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నల్లా శంకర్‌రెడ్డి,ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు. పదవీవిరమణ పొందిన వారిని నగరసీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-ముషీరాబాద్



రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి విజయం తథ్యమని దానికి గాంధీనగర్ డివిజన్ నుండి భారీ మెజారిటీని అందిస్తామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని చిక్కడపల్లి వివేక్ నగర్ బస్తీ, కాపు వాడ, పర్ధివాడ, కల్లెపల్లి బ్రదర్స్‌వీధి, బాపు నగర్‌లలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పది ఫలితాలల్లో లిటిల్ ఫ్లవర్100శాతం ఉత్తీర్ణత

- విద్యార్థులకు సత్కారం

నవతెలంగాణ-ఓయూ



ఓల్డ్ ఆల్వాల్, టెంపుల్ ఆల్వాల్, వెంకటాపురంలో గల లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థలు పది ఫలితాలల్లో ప్రభంజనం సృష్టించాయి. ఈ సందర్భంగా మంగళవారం విడుదలైన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన విద్యార్థులను లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ కె.సదానంద్, ప్రిన్సిపాల్ జ్యోతి సదానంద్ డైరెక్టర్ సాహితీ సదానంద్, వైస్ ప్రిన్సిపాల్ శివిలి రాయి, హెడ్‌మాస్టర్ లక్కీ శామ్యూల్, నాగజ్యోతి తదితరులు10/10జీపీఏ సాధించిన ఎస్. ప్రీతి, వి.ఆనంద్ విద్యార్థులకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందనలు తెలియ జేశారు. 9.8 సాధించిన 5గురు విద్యార్థులు, 9.7సాధించిన 8 మంది విద్యార్థులు, 9.5సాధించిన 10 మంది విద్యార్థులు,9.3 సాధించిన 5 మంది విద్యార్థులు, 9.2 సాధించిన సాధించిన ముగ్గురు విద్యార్థులకు 9పాయింట్స్ సంపాదించిన 9మంది విద్యార్థులకు, డిస్టింక్షన్ పొందిన విద్యార్థులకు, ఇతర విద్యార్థులకు పాఠశాల ఆవరణలో శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యాసంస్థల పనితీరును విద్యార్థుల పట్ల వారు తీసుకుంటున్న శ్రద్ధను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ కె. సదానంద్ మాట్లాడుతూ. విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయుల కృషి మహోన్నతమైనదని కొనియాడారు.

పదో తరగతి ఫలితాలలో శ్రీసాయిరాం గ్రూప్ ఆఫ్ స్కూల్స్

విద్యార్థుల ఉత్తమ ఫలితాలు



- 10/10 మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

పదవ తరగతి ఫలితాలలో శ్రీసాయిరాం గ్రూప్‌ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తమ ఫలితాలు సాధించారు. హైదరాబాద్ సిటీలోని అన్ని బ్రాంచీల నుండి 292 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా 290 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. అన్ని బ్రాంచ్‌లలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. శ్రీకృష్ణనగర్ బ్రాంచ్ నుండి 193 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ బ్రాంచ్‌లో 10/10మార్కులతో 9 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా శ్రీ సాయిరాం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ వెంకటేశ్వరరావు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మా అన్ని బ్రాంచ్లలో 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, అందుకు చాలా సం తోషంగా ఉందని అన్నారు. అందుకు ప్రధాన కారణం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, క్రమ శిక్ష ణ, ప్రతినెల 10వ తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించటం వల్ల ఉపాధ్యాయుల కృషి, పట్టుదల ఉత్తమ ఫలితాలు సాధించుటకు ప్రధాన కారణమని చైర్మెన్ ఉపాధ్యాయులను అభినందించారు. మొదటగా ఉపాధ్యాయులతో విద్యార్థులతో కలిసి వేడుక చేసుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్

పార్లమెంటరీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వరనగర్ డివిజన్‌లో సికింద్రాబాద్ పార్లమెంటరీ ఎన్నికల బూత్ కమిటీ సన్నహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానమైన ఐదు అంశాలను నాయకులందరూ కలిసి చర్చ గోష్టి నిర్వహించి తీర్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార రథాలపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి, ఫోటోను ముద్రించాలని కోరారు., ఎన్నికల ప్రచార పాంప్లెట్లు స్టిక్కర్ల ఉండాలని, ఎంపీ అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో వెంటనే సమా వేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లో ఎక్కడ ప్రచార కార్యక్రమాలు ఏర్పాటు చేసిన భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రచారాన్ని ఎంపీ అభ్యర్థి నుండి ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాలని సమావేశంలో తీర్మానించి ఇన్‌చార్జిలకు తీర్మాన పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర నగర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు డివిజన్ కమిటీ సభ్యులు బూత్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన మంచి వికాస్ ప్రతినిధులు







నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఉప ఎన్నిక నేపథ్యంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డంఎబెల్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ బాబు ఇన్‌చార్జి రఘునాథ్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ వికాస్ మంచ్ సభ్యులు మాట్లాడుతూ కంటోన్మెంట్ లో శ్రీగణేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని, పోరాడుతున్న వికాస్ మంచ్ పోరాటానికి కాంగ్రెస్ మద్దతు తెలపడం శుభపరిణామమన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాను కూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కంటోన్మెంట్‌లో స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్లు తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అభ్యర్థి శ్రీగణేష్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువు సామాజిక న్యాయం అనే ఎజెండాతోనే టీఎస్ఏ ఆవిర్భావం



నవతెలంగాణ-ఓయూ

చదువు పోరాటం సామాజిక న్యాయం అనే ఎజెండాతో తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఏ), ఆవిర్భవించిందని, విద్యార్థులు నిరుద్యోగుల పక్షాన పోరాడుతామని విద్యను వ్యాపారం చేసే కార్పొరేట్ శక్తులపై పోరాటం చేస్తామని టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల లో మంగళవారం టీఎస్ఏ నూతనంగా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధు లుగా రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ చంద్ర కుమార్, అమరుడు శ్రీకాంత చారి తల్లి కాసోజు శంకరమ్మ, రాజారాం యాదవ్ యువజన సమాఖ్య అధ్యక్షులు పిల్లుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ.సామాజిక న్యాయనికై పాటుపడాలని పేదలకు ఉచిత మెరుగైన విద్య వైద్యం ఈ సమాజం లో దొరకడం లేదని పాలకులు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఇది సమాజానికి పేద ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యార్థి నాయకులు పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి రాష్ట్ర కార్యదర్శి రంజిత్ వర్మ సిటీ ప్రెసిడెంట్ సిద్దు ఓయూ ప్రెసిడెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి

- పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు 30వ స్థానం
- 86.76 శాతం ఉత్తీర్ణత సాధింపు
- 9,691 మంది విద్యార్థులు ఫెయిల్
- జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు అవకాశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన పదో తరగతి ఫలితాల్లో హైదరాబాద్ జిల్లాకు 30వ స్థానం దక్కింది. జిల్లాలో ఈసారి మొత్తం 73,202 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 63,511 మంది ఉత్తీర్ణత సాధించి 86.76శాతంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలో 30వ స్థానంలో నిలబెట్టారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఈసారి 5శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఇక హైద రాబాద్ జిల్లాలో బాలికలు 37,818 మంది పరీక్షలకు హాజరుకాగా, 33,998 మంది ఉత్తీర్ణత సాధించి 89.90 శాతం నమోదు చేశారు. 35,384 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 29,513 మంది ఉత్తీర్ణత సాధించి 83.41 శాతం నమోదు చేసి, బాలికల కంటే 6 శాతం తక్కువ నమోదు చేసి వెనుకంజలో నిలిచారు.మొత్తంగా పదోతరగతి ఫలితాల్లో బాలికలే తమ హవా కొనసాగించారు. కాగా జిల్లాలోఈ పరీక్షల్లోబాల, బాలికలు కలిపి మొత్తం 9,691మంది విద్యార్థులు ఫెయిల్‌అయ్యారు. పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) ప్రాంగణంలో విద్యాశాఖ ముఖ్య కార్య దర్శి బుర్రావెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవ సేనా, ఆశాఖ ఉన్నతాధికారులతో కలిసి ఫలితాలు విడుదల చేశారు.

పర్వాలేదనిపించిన ప్రభుత్వ విద్యార్థులు

పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో హైదరాబాద్ జిల్లాల్లోని సర్కారు పాఠశాలల్లోని విద్యార్థులు పర్వాలేదనిపించారు. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ధీటుగా మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఫలితాలు మెరుగుపడడం విశేషం. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు జిల్లా అధికారి నుంచి మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్ల కృషి, విద్యార్థుల కఠోర శ్రమే ఈ ఉత్తమ ఫలితాలకు కారణమని తెలిసింది. జిల్లాలో 182 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వీటి నుంచి 7,445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 5,873 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 78.89శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాదిలాగే ఈసారి కూడా పలు ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదిలావుంటే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు 10కి10 జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు. ఇందులో వి.ప్రతీక్ష (సుల్తాన్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల), డి.అక్షిత(అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), బి.చరిత(హైదరగూడ ప్రభుత్వ సెయింట్ పీటర్స్ హైస్కూల్), జె.జోష్న ప్రియా(మాసబ్‌ట్యాంక్ రెడ్‌క్రాస్ ప్రభుత్వ బాలికల పాఠశాల)ఉన్నారు.ఇక నాంపల్లిజోన్ పరిధిలో 15 ప్రభుత్వ పాఠశాలల్లో.. రెండు సర్కారు బడులు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఒకటి గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ అలియా కాగా.. మరోకటి గోషామహల్ బజార్ ఘాట్ గవర్నమెంట్ హైస్కూల్. ఇదిలావుంటే నాంపల్లి మండంలోని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి వి.ప్రతీక్ష 10 జీపీఏ సాధించగా.. ఇదే స్కూల్‌కు చెందిన విద్యార్థి పూజ శర్మ 9.8 జీపీఏ సాధించింది. అలాగే కుంట రోడ్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుప్రియ 9.7, జి.తరుక్ 9.2 జీపీఏ సాధించారు. హైదరాగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశా లకు చెందిన శ్రీవిద్య 9.3 జీపీఏ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.భవాని 9.7జీపీఏ సాధించింది. ఇదిలావుంటే సైదాబాద్ మండంలోని జీహెచ్ఎస్ మలక్‌పేట్‌కు చెందిన విద్యార్థులు అంజనేయులు 9.7 జీపీఏ, పూజిత, స్పందన 9.5 జీపీఏ, హరిక, ఐశ్వర్య 9.2జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మండల విద్యాధికారులు అభినందనలు తెలిపారు. ఇదిలావుంటే జిల్లాలోని పలు మండలాల్లో చాలామంది విద్యార్థులు 9 నుంచి 9.5జీపీఏ సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఓవరాల్‌గా హైదరాబాద్ 86.76శాతం ఉత్తీర్ణత సాధించి 30వ స్థానంలో నిలిచింది. మొత్తం 73,202 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 63,511 మంది పాసయ్యారు. కాగా ఫలితాల్లో అమ్మాయిలదే పైచేయిగా నిలిచింది.







జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

వచ్చే నెల 3 నుంచి 14 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16లోపు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు విధించినట్టు వెల్లడించారు. జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

పది ఫలితాలలో సత్తా చాటిన

వివేకానంద విద్యార్థులు



- సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఉన్న వివేకా నంద స్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. ఫిలింనగర్‌లోనే అత్యధికంగా ఈ పాఠశాలో నుంచి ఇద్దరు విద్యార్థులు గౌరీ, బి.హేమలతలు 10/10 జీపీఏ సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. మొత్తంగా 97శాతం ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రయ్య తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ అనంతరాములుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.

పది ఫలితాల్లో రేడియంట్ హైస్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, ఎల్లారెడ్డిగూడలోని రేడియంట్ హైస్కూల్లో పదవ తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మెన్ ఉత్తీర్ణులైన విద్యార్థులను, అధ్యాప కుల ను, వారి తల్లిదండ్రులను జూబ్లీహిల్స్ రేడియంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అహ్మద్ అభినందించారు. అధ్యాపకులు పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థులలో క్రమశిక్షణ, ఉత్తమ ఫలి తాలు సాధించుటకు ప్రధాన కారణమన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించామని స్కూల్ చైర్మెన్ ఆనందం వ్యక్తం చేశారు.

పది ఫలితాలల్లో నూర్ గ్రూప్ ఆఫ్ హైస్కూల్‌లో ఉత్తమ ఫలితాలు



- జవహర్‌నగర్ నూర్ హైస్కూల్లో నూరు శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం జవహర్‌నగర్‌లో గల నూర్ హైస్కూల్లో పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా నూర్‌హై స్కూల్ చైర్మెన్ మహమ్మద్ కాజా కుద్బుద్దీన్ పలు వివరాలను తెలియజేశారు. ఆ పాఠశాల మూడు బ్రాంచ్‌లలో 125 మంది పదవ తరగతి పరీక్షలు రాశారని, అయితే 118 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అదేవిధంగా ఉత్తమ ఫలితాలు సాధనకు కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

పది ఫలితాలల్లో సాయి కృప హైస్కూల్లో

నూరు శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం, కృష్ణానగర్‌లోని సాయి కృప హైస్కూల్లో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ అంజన్ రావు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యా ర్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించటానికి ఉపాధ్యాయుల పట్టుదల, విద్యార్థుల కృషి ,తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్య కారణం అని ప్రిన్సిపాల్ వారిని అభినందించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించామని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థి కీర్తిక తెలుగు, హిందీలో10/10 మార్కులు సాధించింది. అదే విధంగా ప్రార్థన తెలుగు, బయాలజి, హిందీలో10/10 సాధించినట్లు తెలిపారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన

శాంతినికేతన్ హైస్కూల్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్‌నగర్‌లోని శాంతినికేతన్ హై స్కూల్‌లో మంగళవారం వెలు వడిన పదవ తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రుద్రరాజు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను, వారి తల్లిదం డ్రులను అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపాధ్యాయుల పట్టుదల, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన ఉత్తమ ఫలితాలు సాధించామని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పదవ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. పలువురు విద్యార్థులు వర్ధిని యాదవ్ (9.7), బి.తనుష్క (9.5), ఎస్ నందిత, డి దేశిక్, ఎస్ స్వాతి ,ఎం . జయశ్రీ (9.3) జిపిఏలు సాధించారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు









నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్‌రోడ్ నెంబర్ 7 ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల, తెలుగు,మాధ్యమంలో చదువుతున్న విద్యా ర్థినీలు పదిలో సత్తా చాటారు. ఆంగ్ల మాధ్యమంలో రిషిత (9.2), వి.విజయ(9.2), శ్రీలేఖ(9.2) తెలుగు మీడియంలో మరియమ్మ పది ఫలితాలల్లో తమ ప్రతిభను కనబర్చారు.

ప్రయివేట్ యూనివర్సిటీలను ప్రోత్సాహించింది కేసీఆరే

నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ యూనివర్సిటీలను భ్రష్టు పట్టించి ఆగం చేసి ప్రయివేట్ యూనివర్సిటీలకు రెడ్ కార్పెట్ వేసింది కేసీఆర్ అని ఓయూ జేఏసీ చైర్మెన్ లోకేష్ యాదవ్ అన్నారు. ఉస్మా నియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళా శాల వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఓయూలో వాటర్ కరెంట్ కొరత ఉందని మాజీ సీఎం కేసీఆర్ ట్విట్టర్ చేయడాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్ మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం ఓయూలో వేసవి సెలవుల సందర్భంగా ఓయూ అధికారులు ఒక సర్కులర్ జారీ చేశారు. ఆ సర్కులర్ తప్పు పడుతూ కెసిఆర్ ట్విట్టర్ చేశారు. 9 సంవత్సరాలు కేసీఆర్ రాష్ట్రాన్ని పాలించి ఏ రోజు కూడా ఓయూ గురించి మాటాడని కేసీఆర్ ఈరోజు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగం పెంచింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ముసలి కన్నీరు కారుస్తున్నారు. 17 లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ పార్టీ గెలవదని, ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.



అంతర్జాతీయ కార్మికవర్గ ఐక్యతకు సంకేతం మేడే

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒక్కటై తమ హక్కుల కోసం కార్మికులు రక్తం చిందించి వీరోచితంగా పోరాడి సాధించిన రోజే మేడే.... ఈ రోజు కార్మిక వర్గ చైతన్యానికి ప్రతి రూపం 8 గంటల పని విధానం గురించి నినదిస్తూ 1886 మే 1న లక్షలాది కార్మికులు పోరాటం ప్రారంభించారు. దీనికి మద్దతుగా నాలుగు రోజుల తర్వాత అమెరికా దేశం చికాగో లోని హే మార్కెట్ లో భారీ ప్రదర్శన నిర్వహించారు.కానీ అదికాస్త ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. విచక్షణ రహితంగా జరిపిన కాల్పులలో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. ఒక పోలీసును హత్య చేశారని నిరాధార అభియోగంతో కార్మిక నాయకులను ఉరితీశారు. అయినా కార్మిక లోకం వెనకడుగు వేయలేదు మార్కెట్లో జరిగిన మారణకాండను నిరసిస్తూ అనేక దేశాల్లో ఉద్యమాలు జరిగాయి. చికాగో మారణకాండలో ప్రాణాలర్పించిన కార్మికులను స్మరిస్తూ ప్రతిఏటా మే 1న కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్నారు. అప్పటినుంచి మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు మేడే వేదికగా మారింది.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా ఉండేటట్లు నాలుగు కోడ్ లు తెచ్చింది. "సంపదను ఉత్పత్తి చేసే వాడికే సంపద చెందాలి"అనే నినాదం కార్మికులు చేసే పోరాటాలకు మార్గదర్శకం ప్రస్తుతం భారత ప్రజానీకం అనేక సవాళ్లని ఎదుర్కొంటున్న అధికధరలు, నిరుద్యోగం పేదలకు అందని విద్యా,వైద్య సదుపాయాలు కర్మాగారాల మూసివేతలు లాకౌట్ ఇంకా ఎన్నో విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అతి తక్కువ వేతనాలతో సామాన్యుని బ్రతుకు భారమైంది. కార్మికుల జీవన ప్రమాణాలు రోజురోజుకు పడిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో మరిన్ని కార్మిక పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కాంట్రాక్టు లేబర్ విధానాన్ని రద్దుచేసి "సమాన పనికి సమాన వేతనం" చెల్లించాలనేది ఏఐటీయూసీ కార్మిక సంఘం ద్వారా కోరుకుంటున్నాం..

చికాగో నందు జరిపిన ఉద్యమ స్ఫూర్తి తో 138 వ మే డే కార్మిక సంఘీభావ దీక్ష దినోత్సవం మేడ్చల్ జిల్లావ్యాప్తంగా కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుండి తెలియజేసుకుంటున్నాం.... ప్రపంచ కార్మికులారా ఏకంకండి ..కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి...

ఏ.ఐ.టి.యూ.సి.జిల్లా కమిటి.
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా...

కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం





- శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దపురం మదన్ గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంఘటిత , అసంఘటితరంగ కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తానని కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, స్వర్ణ కంకణం సన్మాన గ్రహీత, ముద్దాపురం మదన్ గౌడ్ అన్నారు. 138వ ప్రపంచ కార్మిక దినోత్సవ నేపథ్యంలో... సోమవారం షాపూర్ నగర్‌లోని తన కార్యాలయంలో ముద్దాపురం మదన్ గౌడ్ నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు... కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, షాపూర్ నగర్‌లోని తన నివాసంలో ఉంటూ... కార్మిక నాయకుడిగా గత 4 దశాబ్దాలుగా కార్మికులకు సేవలు అందించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తన మనసులోని సంతోషం వ్యక్తపరిచారు. జీడిమెట్ల, గాంధీ నగర్, బాలనగర్, పారిశ్రామిక వడలలోని చాలా పరిశ్రమలలో తాను కార్మిక నాయకుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ... పరిశ్రమలలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి అండగా ఉంటూ.. ఆపద సమయంలో ప్రత్యక్షంగా పాల్గొని చేయూత అందించి, ఆ కార్మికునికి, కార్మిక కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందించడమే తన జీవిత లక్ష్యం అన్నారు.

అప్పట్లో రెడ్డీస్ ల్యాబ్ లో నాయిని నరసింహారెడ్డి పై గెలుపు...

కార్మిక నాయకుడు ముద్దపురం మదన్ గౌడ్ ప్రస్థానం గత 40 సంవత్సరాల క్రితం అప్పటి జనతాదళ్ పార్టీ ఎమ్మెల్యే నాయిని నరసింహారెడ్డి పై మొదటిసారి " డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ "కంపెనీ నందు యూనియన్ ఎన్నికలలో పోటీ చేసి ఘన విజయం సాధించడంతో కార్మిక నాయకుడిగా ప్రస్థానం మొదలైంది. షాపూర్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడి నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాయికి తీసుకురావడంతో విద్యా కమిటీ చైర్మెన్‌గా ఎన్నలేని సేవలు అందిచారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందనే భవనంతో 32 సంవత్సరాల క్రితమే సూరారం శివ హిల్స్ లోని " శ్రీ ఉమామహేశ్వర స్వామి " ఆలయం నిర్మించారు. ప్రస్తుతం జీడిమెట్ల, గాంధీనగర్ ,బాలనగర్ లలోని చాలా కంపెనీలలో నాయకత్వం వహించడం జరుగుతుంది. కార్మికులకు సేవలు అందించినందుకు 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు ఇచ్చారు. 2012లో దక్షిణ కొరియాలో జరిగిన అంతర్జాతీయ కార్మికుల సదస్సులో మన భారతదేశం తరపున కేంద్ర కార్మిక శాఖ, ప్రధాన కార్యదర్శి వసుంధర శర్మ తో కలిసి ముద్దాపురం మదన్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్మిక సదస్సులో 11 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు వేతన ఒప్పందం చేసిన సందర్భంగా జీడిమెట్ల లోని " పోరస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ " కంపెనీ కార్మికులందరూ కలిసి స్వర్ణ కంకణం తొడిగి సన్మానించారు. కరోనా సమయంలో కార్మికులకు సేవలందించినందుకు " చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ " డాక్టరేట్ అవార్డు తో శ్రీ ముద్దాపురం మదన్ గౌడ్ ని సత్కరించింది. ఆ రోజుల్లో ఐఎన్టీయూసీ కార్మిక నాయకుడిగా ఉన్నప్పటికీ, కార్మికులకు సేవ చేయడం గుర్తించి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉత్తమ కార్మిక నాయకుడిగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితర నాయకులు పాల్గొనడం జరిగింది. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రతిదినం.. అనుక్షణం పోరాడుతూ.. కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ.. కార్మికుల ఆనందమే తన తన జీవితంగా భావిస్తున్న.... కార్మిక నాయకుడు ముద్దాపురం మదన్ గౌడ్. మే డే ను విజయవంతం చేద్దాం : 138వ ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జరగబోయే మేడే ఉత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.



శ్రీనివాస నగర్ కాలనీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కాంగ్రెస్‌కు ఓటు వేసి, అభివృద్ధికి బాటలు వేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం శ్రీనివాస నగర్ కాలనీ వాసవి నగర్ కాలనీ గంగపుత్ర కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజసింహారెడ్డి, బలవంత రెడ్డి, నాగేశ్వరరావు , సూర్య కిరణ్ , మధు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అల్వాల్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళ వారం మల్లాపూర్ డివిజన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVILJUDGE: RANGA REDDY DISTRICT, AT: MAHESHWARAM
O.S.No.234 OF 2023

Between:
1.Jasty Chandrika Rani, W/o. LateJasty Satyanarayana, Age: 67yrs, Occ:- Housewife, R/o Plot No.36 C, Eshwaripuri Colony, Sainikpuri, Hyderabad-500094.
2.K.Pavani, Wo.Manoj Kumar, D/o.Late Jasty Satyanarayana, Age: 42 Yrs, Occ: Housewife, R/o.H.No:1-1-284/31, Kapra Part, Kapra, Secuendrabad-500062.
...Plaintiffs
AND
All concerned.
...Defendants

NOTICE

Please take notice that the Plaintiffs herein has filed the Suit for Declaration of Legal Heirs of Deceased Late Jasty Satyana rayana. The suit is stands posted **to 27-12-2023** for appearance. If anybody have any right or claim regarding the mentioned suit schedule properties. The Conce rned will be required to present before the Hon'ble Junior Civil Judge at Maheshwaram **on 27-12-2023 at 10:30am,** either in person or through an advocate, failing which the Hon'ble Court shall proceed to determine the matter exparte.

(BY ORDER OF THE COURT)
Advocate for Plaintiffs.

IN THE COURT OF HON'BLE III JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S.No.1717 of 2024

Between:
Smt.Kurut Suryamma and others
...Plaintiffs
AND
The Tahasildar, Nampally Mandal and another
...Defendants

To,
ALL CONCERNED
(Defendant No. 2)

Take notice that plaintiffs have filed above suit O.S No.1717 of 2024 on the file of Hon'ble III Junior Civil Judge, City Civil Court, Hyderabad seeking Decree of Declaration against defendants and Hon'ble Court was pleased to permit plaintiffs to publish case summons through this newspaper against Defendant No.2 i.e., All Concerned. Take further notice that above case O.S No.1717 of 2024 is posted **on 3 June, 2024** and the Hon'ble Court directed all concerned to appear in person or through advocate on said date **at 10:30 a.m.** and if failed to do so will be said ex-parte and matter will be decided according to law and procedure.

//BY ORDER OF COURT//
SUDHAKAR RAO KULKARNI
RAJESH KULKARNI
RAKESH KULKARNI
ADVOCATES
H.No. 5-1-193, Jambagh, Hyderabad-95
9959360401, 7799116901, 9885792197

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: L.B.NAGAR
SO.P.No.86 OF 2021

BETWEEN:
A.Dasharath Rami Reddy
...Petitioner
AND
AYVL Narsimha Reddy & 13 Others
...Respondents

To
Dr.Shivashankar Reddy, S/o. K.Premsagar Reddy, R/o.Flat No.101, Plot No.21, Om Sai Sujatha Residency, Doctor's Colony, Saroornagar, L.B.Nagar, Ranga Reddy District.
...Respondent no.4
Vasavi Co-operative Bank, Rep. by its Manager, Malakpet, Hyderabad
...Respondent No.13

Whereas the above named Petitioner filed the above S.O.P for Grant a Succession Certificate in favour of the Petitioner of the Deceased Late A.Amruth Reddy in respect of Petition Schedule Properties as per Will Deed dated 21-06-2021 against the Respondents. The same is stand posted **on 11-06-2024** for your appearance **at 10-30 A.M** before this Hon'ble Court, either in person or through an advocate duly instructed by you, failing which the matter will be decided on merits, by setting you exparte.

//BY ORDER OF THE COURT//
M/s.K.SRINIVASA REDDY
M.DEEPIKA REDDY,
Advocates
Flat No.401, 16-2-751/55/21 Tulip Siri, GA-2, SBH Colonies, Gaddiannaram Hyderabad-60
Counsel for the Petitioner

PUBLIC NOTICE

General Public are hereby informed that, my client **M/s.SRI SAI BALAJI PILLING POINT** a Partnership firm having its TAN NO, HYD5701378, PAN NO. AEQF53074L, and Firm No.484 of 2022 having its registered office at Survey No.172/A Solipur Village, Shadnagar By-Pasa, Farooq Nagar, R.R.District T.S. represented by its Partners **SMT.KANTEPUDI SAIDAMMA and ANDRA ANUSHA** have decided to dissolve the said Firm. Any person having any claim or objection m may inform to the undersigned in writing within a week from today failing which my client will proceed with. the dissolution process as if there are no objection or claims from any one.

MOHIR HAMEED KHAN
H.No.1-8-495/19/C. Vikar Nagar. Near Prakash Nagar, Begumpet. Secunderabad, Hyderabad, Telangana Mobile No.9391025702.

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT, AT:HYDERABAD
I.A.No.1432 of 2024
in
A.S.SR.No.7348 of 2024

Between:-
1.Matha Devalayam (Pochamma Gudi) Office in the premises of Sri. Ammawari Allaya Palaka Mandali, Rep.by its Chairman Demarshetty Prem Kumar and others.
...Petitioners/ Appellants
AND
1.A.Hanumanthu and others
...Respondents/Respondents

To,
1.A.Hanumanthu, S/o.A.Jangaiah Aged about: 28 yrs, Occ: Business, R/o.H.No.16-4-317, D.C.Patel Colony. Near Commu nity Hall, Hyderabad.
2.M.Anna, S/o. not known, Aged about: 50yrs, Occ: Business, R/o.H.No.22-2-410, Noor Khan Bazar, Opposite Jaffaria Hospital, Hyderabad.

NOTICE

Please take notice that the above named Petitioners/Appellants have filed the above said I.A. under section 5 of Limitation Act in the Appeal before the Hon'ble Chief Judge, City Civil Court at Hyderabad and you were arrayed as Respondents No.1 and 2 in the above said I.A. and that the said I.A.is posted **on 05-06-2024.** Hence, you are hereby directed to appear before the above said Hon'ble Court **on 05-06-2024 at 10.30 A.M** either in person or through your Advocate, failing which the matter will be decided in your absence on the material available on record before the Hon'ble Court.

//BY ORDER OF THE HON'BLE COURT //
M/s.Suresh Shiv Sagar, Advocate,
Off:5-9-58, Gupta Estates, Ground Floor, Basheer Bagh 'X' Roads, Hyderabad

IN THE COURT OF THE HON'BLE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, AT:: L.B.NAGAR
C.C.No.196 of 2023

BETWEEN:
Patakamuri Rama Rao
...Complainant
And
Sri Venkata Ranganath Chava and others
...opposite parties

To
1.Mrs.V.Krishna Kumari, W/o.V. Ramachandra Rao, Age about 40 yrs, Occ: Pvt Employee, R/o.Flat No.501, 5 th Floor, CVR Residency, Sri Ven Enclave,Street No.6 (Last Building) Gajulara maram Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist
(OP No.2 to 4)
2.V.Raghavendra Rao, S/o. Prasad Rao, Aged about 45 yrs, Occ: Pvt Employee, R/o.Flat No.501, 5 th Floor, CVR Residency, Sri Ven Enclave,Street No.6 (Last Building) Gajulara maram Village, Quthbullapur Mandal,Medchal-Malkajgiri Dist
3.Cherukuri Gopi Raju, S/o.Not known,Aged about 35 yrs, Occ: Software employee, R/o.Flat no.502, 5 th Floor, CVR Residency, Sri Ven Enclave,Street No.6 (Last Building) Gajularama ram Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Petitioner has filed the above complaint against you under Consumer Protection Act seeking allotment of car parking and other reliefs. Whereas in the said application, notices sent to you through process of Court and through R.P.A.D, could not be served upon you as the same were returned unserved. Therefore as per Orders of the Honourable Court, this notice is published, the said application stands posted **on 27-05-2024** for your appearance in the above court **at 10.30 A.m.** and in case you do not appear either in person or through an Advocate the petition will be heard and decided in your absence setting you exparte.

(By Order Of The Court)
K.RAMANJANEYULU
GANGADHAR DESHPANDE
ADVOCATES
Flat No. 305, Raghava Towers, Opp.Archana Hospital, Madinaguda, Hyderabad-49
Mob:9848275561

IN THE COURT OF THE HON'BLE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, AT:: L.B.NAGAR
C.C.No.197 of 2023

BETWEEN:
Madaraboina Ramanjaneyulu
...Complainant
And
Venkata Ranganath Chava and 3 others
...opposite parties

To
1.Mrs.V.Krishna Kumari, W/o. V.Ramachandra Rao, Age about 40 yrs, Occ: Pvt Employee, R/o. Flat No.501, 5 th Floor, CVR Residency, Sri Ven Enclave,Street No.6 (Last Building) Gajularama ram Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.
(OP No.2 to 4)
2.V.Raghavendra Rao, S/o. Prasad Rao, Aged about 45 yrs, occ: Pvt Employee, R/o.Flat No.501, 5 th Floor, CVR Residency, Sri Ven Enclave,Street No.6 (Last Building) Gajularama ram Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.
3.Cherukuri Gopi Raju, S/o.Not known,Aged about 35 yrs, Occ: Software employee, R/o.Flat no.502, 5 th Floor, CVR Residency, Sri Ven Enclave,Street No.6 (Last Building) Gajularama ram Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District.

Please take notice that the Petitioner has filed the above complaint against you under Consumer Protection Act seeking allotment of car parking and other reliefs. Whereas in the said application, notices sent to you through process of Court and through R.P.A.D, could not be served upon you as the same were returned unserved. Therefore as per Orders of the Honourable Court, this notice is published, the said application stands posted **on 27-05-2024** for your appearance in the above court **at 10.30 A.m.** and in case you do not appear either in person or through an Advocate the petition will be heard and decided in your absence setting you exparte.

(By Order Of The Court)
K.RAMANJANEYULU
GANGADHAR DESHPANDE
ADVOCATES
Flat No. 305, Raghava Towers, Opp.Archana Hospital, Madinaguda, Hyderabad-49
Mob:9848275561

IN THE COURT OF THE HON'BLE V JUNIORCIVIL JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD
O.S.No 482 of 2024

BETWEEN:
S.V Venu Gopal Rao, S/o S.V. Shivarama Das
...Petitioner/Plaintiffs
AND
The State of Telangana, Rep. by its District Collector, Lakadikapool , Hyderabad.And others
...Respondents/Defendants

To
The State of Telangana Rep. by its District Collector, Lakadikapool , Hyderabad.
The Thasildar Represented by its Himyatnagar Mandal, Hyderabad.GHMC, Represen ted by Zonal Commissioner, Charminar zone ,Charminar,T.S
All Concerned.

Please take notice that the above named Plaintiff filed an Original Suit Vide O.S. No: 482 of 2023, Before the Hon'ble V Junior Civil Judge, City Civil Court, At Hyderabad, the notice issued to you through the Court as well as by post was returned un-served. Hence the Hon'ble V Junior Civil Judge, City Civil Court, At Hyderabad ordered substitute service by way of paper publication vide orders dt. 15-04-2024, the case is now posted on dated: 03-05-2024 for your appearance. You are therefore, called upon to appear in the O.S. No 482 of 2024 at the Hon'ble V Junior Civil Judge, City Civil Court, at Hyderabad on dated: 03-05-2024 at 10.30 a.m. either in person or through an advocate. Otherwise the case will be heard and decided as exparte in your absence.

// BY ORDER OF THE COURT //
P.ACHUT RAMA SHASTRY,
Advocate Office at: H.No: 10-389/2A, Satyaraghavendra Colony, Malkajgiri, Hyderabad
LANDLINE: 040-27059840 Mobile No. 9000009840



పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం గడపగడపకు గులాబీ జెండా కార్యక్రమాన్ని వీరారెడ్డి నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీ, న్యూ అంబేద్కర్ నగర్ కాలనీల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

నవతెలంగాణ-కాప్రా

Format C-1

Declaration about criminal cases

(As per the judgement dated 25th September, 2018 pf Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors Vs. Union of India & Anr.)
Name and address of candidate: **DANAM NAGENDER**
Name of political party: **INDIAN NATIONAL CONGRESS PARTY.**
Name of Election : **HOUSE OF PEOPLE (LOK SABHA)**
Name of Constituency: **08- SECUNDERABAD PARLIMENTARY CONSTITUENCY – TELANAGANA STATE**
I DANAM NAGENDER, a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases

Sl. No.	FIR No.with Name and Adress of Police Station Concerned	Case No. withName of the court	Sections of Acts Concerened Acts Brief Description of Offence(s)	Wheather charges have been farmed (mention Yes or No)
1	224/2023 Khairataba Police Station Hyderabad	CC No. 1809/2024 Dated 27.2.2024	181 IPC Compliant Made by Y.Anitha Reddy, Officer	No
2	403/2023 Narayanguda Police Station Hyderabad	PP Opinion Pending	188, 171E IPC Allegation That Sunil Yadav BRS worker Distributing Cash at Himayat Nagar	No
3	379/2023 Narayanaguda Polic station Hyderabad	CC No. 2964/2024	188, 171(H) IPC, Sec 21/76 of CP Act. Meeting Running Overttime attended	No
4	254/2023 Khairatabad Police Station Hyderabad	Pending Trail Vide CC No. 1874/2024 Dated 28.02.2024	290, 188 r/w 34 IPC & 67 (A) CP Act. For Obstructing Free flow of Traffic.	No
5	231/2023 Khairatabad Police Station Hyderabad	Pending Trail Vide CC No. 1681/2024 Dated 28.02.2024	341, 290, 171(H) IPC and 21/76 CP Act. For Obstructing Free flow of Traffic	No
6	343/2023 Banjarahills Police Station, Hyderabad	Pending with MP & MLA Court	147, 148, 149, 160, 323, 427 307 & 506 IPC r/w 156(3) Cr. P.C Allegation That Fisted and pushed into Car.	No
7	745/2012 Banjarahills Police Station, Hyderabad	Pending with MP & MLA Court	143, 353, 427, 504, 506, 342 r/w 34 IPC. Allegation of threat to leave the temple premises and not celebrate Sri Krishna Janamshtami	No

(B) Details about cases of conviction for criminal offences

1	Case No & Name of the Court	CC.No. 120/2020 Hon'ble Special Sessions Judge For Trial Of Criminal Cases Relating To Elected MP's & MLA's Of The State Of Telangana, Hyderabad	Not Applicable	Not Applicable
2	Sections of Act/ Codes involved	U/S 323,506 r/w 34 IPC	Not Applicable	Not Applicable
3	Brief description of offence for which convicted	Allegation Of Voluntarily Causing Hurt & Criminal Intimidation	Not Applicable	Not Applicable
4	Dates of orders of conviction	07/07/2021	Not Applicable	Not Applicable
5	Punishment imposed	Simple imprisonment for six months and pay fine Rs 1000/-	Not Applicable	Not Applicable
6	Whether any Appeal has been filed against conviction order (Mention YES or No)	YES	Not Applicable	Not Applicable
7	If answer to (g) above is YES, give details and present status of appeal	CRLA NO. 279/2021 Pending On The File Of Hon'ble High Court Of Telangana, Hyderabad. The Hon'ble High court suspended the sentence imposed by Trial court till the disposal of the CRLA NO 279/2021. The appeal is pending for disposal before the Hon'ble High Court.	Not Applicable	Not Applicable

Sd/- DANAM NAGENDER
08- Secunderabad Parliament Contesting Candidate

కార్మిక, కర్షకులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

- తెలంగాణ కార్మిక విభాగం అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మోతెశోభన్ రెడ్డి,
- జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

బానిసత్వం, వెట్టిచారికికి వ్యతిరేకంగా, శ్రమదోపిడీని ఎదురిస్తూ కార్మికలోకం కీలక హక్కులు సాధించుకున్న రోజు మేడే అని శ్రమకు తగిన గుర్తింపు, సరైన వేతనం, రోజుకు 8గంటల పని హక్కును కార్మికులు పోరాడి సాధించుకున్న (మే1)ను ఇండియా సహా వందలాది దేశాలు ప్రపంచ కార్మిక దినోత్సవంగా జరు పుకొంటాయని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు నేత, సీనియర్ కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత యూరో పి యన్ దేశాల్లో మే1ని సెలవు దినంగా పాటించినట్లు తెలి పారు. అనేక దేశాలు ఇదే బాటలో నడిచా యని, చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆరోజునేఅమల్లోకి రావడం మొదలయ్యాయన్నారు. రోజు లో ఉన్న 24 గంటలలో 8గంటలుపని, 8గంటలు విశ్రాంతి మరో 8గంటలు రిక్రీయేషన్ అనేవి ఈ పోరాటం ద్వారా కార్మికులు సాధించుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మిక, కర్షక సోదర సోదరిమనులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు అని తెలియజేశారు.

ఓయూకు సెలవులు రద్దు : ప్రొ.పి.లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యా లయానికి సోమవారం ప్రకటిం చిన వేసవి సెలవులను రద్దు చేస్తున్నట్లు యూనివర్సిటీ రిజి స్ట్రార్ ప్రొఫెసర్ ప్రొ. లక్ష్మీనారా యణ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఓయూ గతంలో మాదిరి గానే హాస్టల్స్, మెస్ లో యథావి ధిగా కొనసాగుతాయని తెలి పారు. హాస్టల్ మరమ్మతులు, విద్యా ర్థులు తమ తల్లి దండ్రులతో గడపాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం వేసవి సెలవులు ఇస్తామని గుర్తు చేశారు. సెలవులు కూడా ఆ నేపథ్యంలోనే ప్రకటించామన్నారు. ఈ నెలలో గ్రూప్-1, గ్రూప్2, గ్రూప్3, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థుల విజ్ఞప్తి మేరకు సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. హాస్టల్స్ మెస్‌లు యథావిధిగా కొనసాగుతాయన్నారు. అంతకుముందు పలువురు విద్యార్థులు వివిధపోటీ పరీక్షలు ఉండటంతో ప్రిపరేషన్ కోసం హాస్టల్స్ మెస్ లు ఉంచాలని కోరిన విషయం తెలిసిందే.

ఓయూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

నవతెలంగాణ-ఓయూ

ఓయూ ప్రతిష్ఠను ఇబ్బంది కలిగించే విధంగా కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఓయూ పీఎస్‌లో చీఫ్ వార్డెన్ డా.కె.శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు దీనితో వారిపై ఓయూ పోలీసులు కేసు నమోదు చేశారు. తమ సర్క్యులర్‌ను మార్చి వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్లలో ప్రచారం చేస్తు న్నారని, ఓయూ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్న అధికారుల కోరారు. దీంతో 207/ 2024 ఐపీసీ 466,468 ,469, 505 (1)(సీ) కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, గడ్డం రంజిత్ రెడ్డి తనయుడు అర్యన్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో, అల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో, ఛత్రపతి శివాజీ కాలనీకి చెందిన స్వరూపా, ఎల్లమ్మబండ మైనారిటీ యువ నాయకులు షఫీ, బషీర్ అలాగే వారితోపాటు సహచర మహిళలు, యువ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, సమ్మారెడ్డి, సయ్యద్, రాజు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి

ముఖ్యమంత్రి రోడ్డుషోను విజయవంతం చేయండి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షోను విజయవంతం చేయాలని బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోటింరెడ్డి వినయ్ రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చాటిన పటేల్ హై స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్‌లోని పటేల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ రావుల వరప్రసాద్ అన్నారు. తమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులందరు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సానియా బేగం జీపీఏ 9.8, వై.చందన జీపీఏ 9.5, బి.సాయి చరణ్ జీపీఏ 9.3, జి.డి.శ్రీమన్నారాయణ జీపీఏ 9.2,యస్.జ్ఞానేశ్వరి జీపీఏ 9.0 గ్రేడ్, పాయింట్లు సాధించి ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచారన్నారు. మంగళవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కార్యాలయంలో అభినందించి జ్ఞాపికలను అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ స్ఫూర్తి కొనసాగించి ఎదగాలని విద్యార్థులను ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ రావుల సునీత దేవి, ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు నవీన్, మూర్తి, నరేందర్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే సంపూర్ణ అభివృద్ధి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాయని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ కారు గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజల సహాయ సహకారాలతో కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశామన్నారు.కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తూ పాలిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగించాలంటే ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహుమానంగా అందజేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, డివిజన్ మాజీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరాగౌడ్, సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్, బండ మహేందర్, శశిధర్ ముదిరాజ్, పాపులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఏ శక్తి ఆపలేదు...

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఏ శక్తి ఆపలేదని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండ, నరసింహ బస్తి,రావి నారాయ ణరెడ్డి నగర్, కట్ట మైసమ్మ బస్తి,దేవేందర్ నగర్‌లలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ శివారులోని బస్తీలల్లో, కాలనీలలో కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులు కల్పిస్తూ మరోపక్క సంక్షేమ పథకాలతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదటి నెలనే దాదాపు 46 లక్షల మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్లను ఎగ్గొట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. అదేవిధంగా ప్రతీ పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్కరికి రూ.15 లు వేసిన పాపానా పోలేదన్నారు. ఇటువంటి నాయకుల వల్ల తెలంగాణ ప్రజలకు ఇటువంటి ఉపయోగం లేదని కేంద్రంతో కొట్లాడి మన నిధులను మనము తెచ్చుకుంటేనే సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయన్నారు. కాబట్టి ప్రజా సంక్షేమం కోసం పనిచేసే మన నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఫాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, నాయకులు శివ ముదిరాజ్, అజయ్ ప్రసాద్, చెట్ల వెంకటేష్ పాల్గొన్నారు.



పది ఫలితాల్లో సత్తా చాటిన జెడ్‌పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మంగళవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్‌పల్లికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి 166 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కాగా, 136 మంది విద్యార్థులు ఉత్తీర్ణు లు అయ్యారు. ఉత్తీర్ణత శాతం 82 శాతం కాగా, అత్యధిక జీపీఏ 9.8, 9 ఆపై జీపీఏ సాధించిన వారిలో 9 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురాచారి, మాట్లాడుతూ.. కూకట్‌పల్లి పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను నవ రత్నాలుగా అభివర్ణించారు. మనిదీప్ తివారీ 9.8 జీపీఏ, బి.నితిన్ 9.7, లక్ష్మీ నవ్య శ్రీ 9.7, ఇ.లికిత్ కుమార్ 9.5, నాగ నందినీ 9.3, మధుళిక 9.3, యశశ్విని 9.0, సందీప్ 9.0, దనుష్ 9.0 ఈ విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించి ఆణిముత్యాలుగా నిలిచారు. పాఠశాల విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురాచారి, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తపరిచారు.

టెన్త్ ఫలితాల్లో దుమ్మురేపిన వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ ఎస్ఎస్‌సి - 2024 ఫలితాలలో వివేకానద విద్యా మందిర్ హై స్కూల్ విజయదుందుభి మోగించింది. ఎప్పటిలాగే వివేకానంద విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 100 శాతం ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. వీరిలో ధనుష్ 9.8, విశాల్ 9.8, గ్రేడ్ లతో పాటు గంటా చందు 9.7 ధీరజ్ 9.7, తనీష్ 9.7 అమిత్ కుమార్ 9.5 భుక్య రిషిత 9.5, చందన 9.3 నెహబాటి 9.3 ఖుషి బర్ఫ 9.3, రోహిత్ 9.2, సరస్వతి 9.2, సాయి సంతోష్ 9.0 (గ్రేడ్స్ సాధించి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస గౌడ్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాల అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ ఉపాధ్యాయుల బృందం పనిచేస్తుందన్నారు. 100 శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల బృందాన్ని, సిబ్బందిని కరెస్పాండెంట్ ఎం.సునీత అభినందించారు.



టెన్త్ ఫలితాల్లో విజయ భేరి మోగించిన నేతాజీ హై స్కూల్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదవ తరగతి ఫలితాల్లో నేతాజీ హై స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. మధ్యతరగతి విద్యార్థులతో 99 శాతం ఫలితాలు సాధించి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎస్. ధరణి 10/10, ఏ.సాయి చరణ్ 10/10, కె .సంజన యాదవ్ 10/10 జీపీఏ సాధించారు. అన్నపూర్ణ కుమారి - 9.8/10, ఎం.హాసినీ 9.8/10 , ఆర్ లీలా 9.8/10, ఈ. సోనిక 9.8/10, బి. రాఘవేంద్ర 9.7/10, పీయూష 9.7/10, జీపీఏ సాధించారు. ఆపై దాదాపు 30 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ చింతల మహేష్ , అకాడమిక్ డైరెక్టర్ నందిని.. మెరుగైన ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాల అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా నేతాజీ హై స్కూల్ పనిచేస్తుందన్నారు. ప్రతిష్టమైన అకాడమీ ప్రణాళిక, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ, విద్యార్థుల నిర్విరామ కృషి, తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం వలన ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు.

టెన్త్ ఫలితాలలో టీవీఆర్ మోడల్ హై స్కూల్ ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదవ తరగతి ఫలితాల్లో అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హై స్కూల్ విద్యార్థులు మంగళవారం అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారు. ప్రతీ ఏడాది లాగే ఈ సంవత్సరం సైతం పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో 10 జీపీఏ సాధించారు.134 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా...శ్రావణీ, యోగిత భాటి, అంజలి కుమారి, ఎస్.చాందిని, వర్ష వైష్ణవ్, నక్కిన హిమ హాసిని, ఎం.స్నిగ్ధ , బుక్క వరుణ్ తేజ్, కోసుని సూర్యతేజ వర్మ, శీలం మోహన్ కార్తిక్, ఈ. వర్షిత రెడ్డి, బొంతు చరణ్య, జడ్డు ఎస్.ఎస్.ఎన్ మహాలక్ష్మి 13 మంది విద్యార్థులు 10 /10 జీపీఏ సాధించారు. 22 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు. 49 మంది విద్యార్థులు 9.7 సాధించగా, 29 మంది విద్యార్థులు 8.8 సాధించి, మిగిలిన 21 మంది విద్యార్థిని, విద్యార్థులు 7 జీపీఏ సాధించి.100 శాతం ఉత్తీర్ణతతో టీవీఆర్ మోడల్ హై స్కూల్ మరొకసారి విజయ దుందుభి మోగించింది. 10/10 జీపీఏ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టీ.కోటి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ టీ.వంశీకృష్ణ రెడ్డిలు అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాల అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పనిచేస్తున్నాయ న్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పది ఫలితాల్లో విజయభేరి మోగించిన భాష్యం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

పది ఫలితాల్లో విజయదుందుభి మ్రోగించిన, వివేకానందర్ కాలని భాష్యం హై స్కూల్, ఈ సందర్భంగా వివేకానంద నగర్ భాష్యం హై స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. మా విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులై ఉత్తమమైన ఫలితాలు సాధించి, తమ సత్తా చాటారని తెలిపారు. పాఠశాల విద్యార్థులు అందరూ మంచి కృషి చేసి వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. వారు ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిల కృషి అభినందనీయం అని కోనియాడారు. అందరి కృషి వల్ల, విద్యార్థుల ప్రతిభ వల్ల ఈ ఫలితాలు సాధించగలిగామని పేర్కొన్నారు. 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులు 40 మంది, 41 మంది 9.8 ఉండగా,9 కి పైగా జీపీఏ సాధించిన విద్యార్థులు 238 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్ ఈ ఓ శిరీష, ప్రిన్సిపాల్ శ్రీదేవి, విజయలక్ష్మి, యమున విద్యార్థులకు పుష్ప గుచ్చాలు అందించి అభినందించారు.

టీచర్స్ ప్రోత్సాహం వల్లే మాకు ఉత్తమ ఫలితాలు

ఉత్తీర్ణులైన విద్యార్థులు మాట్లాడుతూ.. మా టీచర్స్ అందరూ కూడా మా స్నేహపూర్వకంగా ఉంటూ, మోటివేశషనల్‌గా బోధిస్తూ,రివిజన్ పూర్తి చేసి ఎప్పటికప్పుడు మాతో పరీక్షలు రాయిస్తు, మమ్మల్ని ప్రోత్సహించడం వల్ల పరీక్షల్లో భయం లేకుండా సులువుగా రాసి, ఉత్తమ ఫలితాలు రాయొచ్చు అనుకునేలా మమ్మల్ని ప్రోత్సహించడం వల్లే ఉత్తమ ఫలితాలు వచ్చాయని విద్యార్థులు తెలిపారు.

పది ఫలితాలలో యూనిక్ హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఐడీపీఎల్ సూర్య నగర్‌లోని యూనిట్ హై స్కూల్లో 22 మంది విద్యార్థులు జీపీఏ 10/10 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని పాఠశాల కరస్పాండెంట్ పి.శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా తమ పాఠశాల విద్యార్థులు కుత్బుల్లాపూర్ మండలంలోని అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ఈ సంవత్సరం కూడా ఫలితాలలో 22 మంది విద్యార్థులు జీపీఏ 10/10 మార్కులు సాధించి, కుత్బుల్లాపూర్ మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పరీక్షకు హాజరైన147 విద్యార్థులలో 146 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. 14 మంది విద్యార్థులు జీపీఏ 9.8, ఏడుగురు, 9.7 జీపీఏ, ఏడుగురు 9.5 జీపీఏ 12మంది 9.3 జీపీఏ, 12 మంది 9.2 జీపీఏ13 మంది, 9.0 జీపీఏ 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. పాఠశాల మొత్తంలో 9/10 జీపీఏ 93 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ సందర్భంగా పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అందుకు సహాయ సహకారాలు అందించినటువంటి ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ పి.శివయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. నాగభూషణం విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలలో సీఎంఆర్ మోడల్ హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గాజుల రామారం డివిజన్ పరిధిలోని సీఎంఆర్ మోడల్ హై స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జీపీఏ 10/10 ఇద్దరు విద్యార్థులు సాధించి విజయకేతనం ఎగరవేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఏ ఓ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి పరీక్షకు హాజరైనటువంటి 120 మంది విద్యార్థులలో జీపిఏ 10/10, ఇద్దరు విద్యార్థులు సాధించి టాపర్‌గా నిలవగా.9.8 జీపిఏ 9 మంది విద్యార్థులు,9.7జీపిఏ ముగ్గురు విద్యార్థులు సాధించగా ఏ1 గ్రేడ్ 36 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో విజయం సాధించిన న్యూ ఎరా హై స్కూల్





నవతెలంగాణ-కూకట్‌పల్లి

పదవ తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసిన న్యూ ఎరా హై స్కూల్ విద్యార్థులు, మంగళవారం వెలువడిన పదవతరగతి ఫలితాల్లో, 23 మంది విద్యార్థులు 10/10 జీపీఏ పాయింట్లు సాధించగా,13 మంది 9.8 జీపీఏ సాధించగా, 27 మంది 9.7, మరో 13 మంది 9.5 జీపీఏ,22 మంది 9.2 మొత్తం 261 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై నవ శకంలోకి అడుగు పెట్టిన న్యూ ఎరా విద్యార్థులు.. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించి ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అందుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వాళ్ళను ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రేరణ అందించిన ఉపాధ్యాయులను డైరెక్టర్ వేణుగోపాల్ అభినందించారు.

కార్మిక వ్యతిరేక బీజేపీని,అవినీతి బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఓడిద్దాం

- ఐ.ఎన్.టి.యు.సి.రాష్ట్ర కార్యదర్శి

గూడ ఐలయ్య గౌడ్ కార్మికులకు పిలుపు

నవతెలంగాణ : జగద్గిరిగుట్ట.



కార్మిక వ్యతిరేక బీజేపీని అవినీతి బీఆర్ఎస్ ను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట,గాంధీనగర్ పారిశ్రామిక వాడలో కార్మికులను ఐఎన్‌టీయూసీ బృందంతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ సర్కార్ కార్మిక చట్టాలనురద్దుచేసి నాలుగు భాగాలుగా విభజించి కార్పొరేట్ సంస్థలకు కార్మికుల హక్కులను తాకట్టు పెట్టిన మతోన్మాద బీజేపీని ఓడించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి రాజ్యాంగ విరుద్ధంగా ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీల రిజర్వేషన్లను ఎత్తివేయడానికి ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న ప్రజాపాలన, కార్మిక సంక్షేమ పాలన,పై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని కార్మిక రాజ్యం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు.మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిని పట్నం సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కార్మికులకు కరపత్రాలు పంచుతూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు. సి.నాయకులు యాదగిరి, చంద్రయ్య,శేఖర్, మహిళ కార్మికులబృందం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు, హక్కులు ప్రమాదంలోకి..



● ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) అడిషనల్ జనరల్ సెక్రటరీ గొడిషాల అబ్రహం

నవతెలంగాణ-సిటీబ్యూరో

"ఎన్నో ఉద్యమాలు, రక్తతర్పణల ఫలితంగా కార్మిక వర్గం సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను నేడు దేశంలోని మోడీ నాయకత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వం కారణంగా ప్రమాదంలో పడినాయి. నిజానికి మోడీ కానీ, ఆయన నాయకత్వంలోని బీజేపీ కానీ ఆది నుంచి కూడా కార్మిక, శ్రామిక వ్యతిరేకతను నరనరాన నింపుకొని, బడా పెట్టుబడిదారుల తొత్తుగా వ్యవహరిస్తున్నది. అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు దేశంలోని అనేక పబ్లిక్ లిమిటెడ్ సంస్థలను కట్టబెడుతున్నది. గతంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నెలకొల్పబడి దేశానికి కీర్తి కిరీటాలుగా, సంపద సృష్టికర్తలుగా లక్షలాది మంది కార్మికులకు జీవన భృతి కల్పించిన బ్యాంకులు, పోర్టులు, విమానాశ్రయాలు, ఎయిర్ ఇండియా, గనులు, పెట్రోలియం, టెలిఫోన్, రైల్వేలను మోడీ సర్కారు అక్రమంగా, అన్యాయంగా ప్రయివేట్ పరం చేస్తూ..క్రమంగా దేశాన్ని ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. మరోపక్క ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ప్రజలకు నిరంతరం ట్రాన్స్‌పోర్ట్ సేవలందించే ఆర్టీసీ వంటి సంస్థలకు మరణ శాసనం రచిస్తున్నది. ఆ దిశలో తీసుకువచ్చిన శాసనమే 106/2 చట్టం. ఈ చట్టం ప్రకారం ప్రమాదం జరిగితే డ్రైవర్‌కు అయిదేండ్లు జైలు, 10 లక్షల జరిమానా విధించవచ్చు. ఇలాంటి ఎన్నో పాశవిక చట్టాలు, కార్మిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ దేశంలో అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తున్న కార్మిక ద్రోహి, ప్రజా విద్రోహి నరేంద్ర మోడీ ప్రభుత్వ చర్యలను నేటి మేడే ఉద్యమ స్ఫూర్తితో కార్మికవర్గం ముక్త కంఠంతో వ్యతిరేకించాలని, సమైక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి" అని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీ యూసీ) తరపున ఆ సంఘం అడిషన ల్ జనరల్ సెక్రటరీ గొడిషాల అబ్ర హం కార్మిక వర్గాన్ని పిలుపునిచ్చారు. అఖిల భారత ఐఎన్‌టీ యూసీ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని, మేడే సందర్భంగా యావత్ ఆర్టీసీ కార్మికులకు, సమస్త కార్మిక సోదరులకు శుభాకాంక్షలు, ఉద్యమ జేజేలు ఆయన తెలిపారు.



'వంశీ తిరుమల బ్యాంక్' ఉగాది కామధేను పురస్కారాల ప్రదానోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

1972 నుంచి వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వంశీ ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్, 25 ఏండ్లుగా బ్యాంకింగ్ రంగంలో సేవలు అందిస్తున్న తిరుమల బ్యాంక్‌తో కలసి మొట్టమొదటిసారిగా తెలుగు ఉగాది సందర్భంగా "వంశీ తిరుమల బ్యాంక్ ఉగాది కామధేను పురస్కారాలను" వివిధ రంగాలకు చెందిన 100 మంది దేశ విదేశీయ ప్రముఖులకు బహూకరించారు. రవీంద్ర భారతిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తిరుమల బ్యాంకు ఫౌండర్ చైర్మెన్, వంశీ ఆర్ట్ థియేటర్స్ చైర్మెన్ నంగనూరి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, విశిష్ట అతిథిగా మురళీమోహన్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ, సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు, హీరో సుమన్, రోజా రమణి, దర్శకులు రేలంగి నరసింహారావు, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, సిల్వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. అమెరికా, ఖతార్, సింగపూర్ న్యూజిలాండ్,ఉగాండా దేశాల నుంచి కొంతమంది ప్రముఖులు ప్రవాస భారతీయ పురస్కారాలను అందుకున్నారు. వారితో పాటు భారతదేశం నుంచి సినీ రంగం, వైద్యరంగం, సాహిత్య రంగం, సంగీత రంగం, నాటక రంగం, పత్రికా రంగం, వ్యాపార రంగం, టీవీ రంగం మొదలైన వివిధ కళా, సాంఘిక రంగాల నుంచి 100 మంది ప్రతిభామూర్తులను ఉగాది కామధేను పురస్కారాలతో సత్కరించారు.

కెమికల్ రియాక్టర్ పేలి వ్యక్తి మృతి

నవతెలంగాణ- కీసర

కెమికల్ రియాక్టర్ పేలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని అస్సాంపూర్ గ్రామానికి చెందిన సోను కుమార్ (23) కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలోని సాల్వ్ ఎక్స్ ప్లోజివ్ కెమికల్ కంపెనీలో పని చేస్తున్నాడు. కెమికల్ రియాక్టర్ పేలి నేలమట్టం అయింది. ప్లాంట్ లో ఆపరేటర్‌గా పని చేస్తున్న సోను ప్లాంట్ లోపలే ఉండగా మృతుడు ఆనవాలు లభించలేదు. దీంతో దీంతో మృతుడి కుటుంబ సభ్యులు కీసర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

























సేవ చేయడం గొప్ప అవకాశం

- విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి
- రాచకొండ సీపీ తరుణ్ జోషి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో వివిధ విభాగాలల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన వారిని రాచకొండ సీపీ తరుణ్ జోషి ఘనంగా సన్మానించారు. ఎస్‌బీ అడిషనల్ డీసీపీ రఫీక్, సబ్ ఇన్‌స్పెక్టర్ యాదయ్య, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అహ్మద్, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ యలద్రిలు పదవీవిరమణ పొందారు. ఈ నేపథ్యంలో మంగళవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో సుదీర్ఘ కాలంగా అంకితభావంతో పని చేసి పదవీ విరమణ చేస్తున్న అధికారులకు అభినందనలు తెలియజేశారు. కర్తవ్య నిర్వహణ కోసం తమ సుఖసంతోషాలను త్యాగం చేసి, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అంకి తం అవుతారని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో కుటుంబసభ్యుల పాత్ర ఎంతో ఉంటుందని, రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, వీలైతే సమాజసేవలో పాలు పంచుకోవాలన్నారు. రిటైర్ మెంట్ డబ్బును భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఖర్చు చేయాలన్నారు. ఈ సందర్భంగా కో ఆపరేటివ్ సొసైటీ బెనిఫిట్‌తోపాటు వారి పొదుపు డబ్బులకు సంబంధించిన చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ ఇందిర పదవీ విరమణ చేస్తున్న అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఆరోగ్యం పట్లశ్రద్ధ వహించాలని, వారికి పోలీసు శాఖ తరఫున అందాల్సిన ఇతర ప్రయోజనాలు అన్నీ త్వరగా అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీసీపీ కరుణాకర్, ఏసీపీలు శ్రీధర్ రెడ్డి, రమేష్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, సీఏఓలు సుగుణ, పుష్పరాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీ.హెచ్ భద్రా రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ ట్రెజర్ బాలరాజు, డైరెక్టర్ సువర్ణ, కుటుంబ సభ్యులు కమిషనరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓ కార్మికుడా ఏమిచ్చినా నీ రుణం తీర్చుకోలేం.
ఎందరికో నీవు ప్రేరణాత్మకం.
నీ సేవల్ని ఎప్పటికీ స్మరించుకుంటాం.
నీకు మే డే శుభాకాంక్షలు

కార్మిక కర్షక లోకం వర్థిల్లాలి
శ్రమ దోపిడీని అరికట్టాలి
నిజమైన న్యాయం జరగాలి
కార్మిక సోదర, సోదరీమణులకు
మే డే శుభాకాంక్షలు

అమలు కాని కార్మిక చట్టాలు, నేటికీ అందని సంక్షేమ ఫలాలు



కార్మికుల శ్రమకు తగ్గ ఫలితమే కాదు, కనీస భద్రత లేకుండా పోయింది. ప్రపంచ కార్మికుల పండుగ మేడే వస్తుంది, పోతుంది. ఘనంగా వేడుకలు జరుగుతున్నాయి. కానీ కార్మికుల బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఉపాధి, భద్రత కలగానే మిగులుతోంది. కండల్ని కరిగించినా కనీస వేతనం వారికి దక్కడం లేదు. సమాన వేతనాలు. క్రమబద్ధమైన పనివేళలు వారంతపు సెలవులు ఇలాంటివి నేటికీ వారికి అందని ద్రాక్షగానే మిగిలాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో కార్మిక హక్కులు కనుమరుగవుతున్నాయి. లక్షలాది మంది కార్మికుల ఉపాధికి గండిపడుతోంది.

-శ్రీనివాస్ నాయక్ ,సీఐటీయూ నాయకులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో తమ కష్టాలు పరిష్కారం కావాలని కార్మికులు సమ్మెలు ఆందోళనలు చేశారు. సమ్మె చేస్తున్న కార్మికులను పిలిచి చర్చలు చేయకపోగా, పనికిమాలిన సంఘాలటూ అవమానపరిచింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో కార్మికులకు లబ్ధి చేకూరుతుందని కార్మికులు భావిస్తున్నారు. కంపెనీలలో పనిచేసే కార్మికులకు రెగ్యులర్ చేసేంతవరకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత సౌకర్యాలను కల్పించాలి. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న సుమారు మూడు లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలన్నారు.

- ఉయ్యాల ప్రవీణ్. ఐఎఫ్‌టీయూ
హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ

మేడే రోజు ఎర్ర జెండా మాత్రమే ఎగరేయాలి



మేడే రోజు ఎగుర వేయాల్సిన ఎర్ర జెండా, మేడే పోరాటంలో పాల్గొన్న కార్మికుల్ని పాలక వర్గ దుర్మార్గులు పోలీసులను ఉసిగొల్పి కాల్పులు జరిపితే ఆ కాల్పుల్లో కార్మికులు శరీరం చిద్రమై కారిన రక్తంలో తడిసి ముద్దయిన జెండా ఎర్రజెండా. ఎవ్వరైనా మేడే రోజు ఎర్ర జెండానే ఎగురవేయాల్సిందే. కాని నేడు బూర్జువా ట్రేడ్ యూనియన్లు ఎర్రజెండాను కాకుండా (పంచరంగుల) వారి పార్టీ జెండాలను ఎగురవేస్తున్నారు. ఇది ద్రోహపు చర్య. మేడే జెండా దిమ్మలకు కొబ్బరికాయలు కొట్టడం, అగర్ బత్తులు వెలిగిం చటం, కుంకుమబొట్లు పెట్టడం లాంటివి పాటిస్తున్నారు."మేడే" స్ఫూర్తితో పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చడానికి కార్మికులు ఒక్కరే కాకుండా రైతాంగం, వ్యవసాయ కార్మికుల్ని కూడా ఉద్యమాలకు కదిలించాలి.

- దర్శనం యాదగిరి, ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం,

ఒక రాజు ఒక
పనిని
ప్రారంభిస్తాడు..
ఒక సేవకుడు
దానిని ఒంటరిగా
పూర్తి చేస్తాడు..

- జోసెఫ్ జౌబర్ట్

కార్మిక శక్తికి వేడుక మేడే

పనికి విలువుందని
చెప్పిన రోజు
నవశకానికి నాంది
పలికిన రోజు
నిప్పుకణాల్లా చెమట
చుక్కలు
ఎగసి పడిన రోజు
మనుగడ కోసం నెత్తుటి
మడుగుల్లో పిడికిలి
బిగించిన రోజు
ఎర్రటి ఎండల్లో
నక్షత్రాల్లా మెరుస్తున్న
కూలీలు
బండను
కరిగించడంలో
బతుకు అందాన్ని
చూసిన రోజు
దాస్యశృంఖలాలను
తెంచి
అరుణ పతాకాన్ని
ఎగురవేసిన రోజు
మేడే అంటే ఆశ
మేడే అంటే శ్వాస

- ఈసరి భాగ్యం



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

టెన్త్‌లో 91.31 శాతం ఉత్తీర్ణత



99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ ప్రథమం

పదో తరగతి ఫలితాల్లో 99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 8,908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 8,823 (99.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 4,300 మంది బాలురు పరీక్షలు రాస్తే 4,246 (98.74 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,608 మంది బాలికలు పరీక్షలకు హాజరైతే 4,577 (99.33 శాతం) మంది పాసయ్యారు. 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్ధిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,976 మంది పరీక్షలు రాయగా, 13,788 (98.65 శాతం) మంది పాసయ్యారు. 98.27 శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో ఉన్నది. ఈ జిల్లా నుంచి 6,470 మంది పరీక్షలు రాస్తే, 6,358 (98.27 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 65.10 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి వికారాబాద్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,357 మంది పరీక్షలు రాయగా, 8,695 (65.10 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తు గడువు 15

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల మూడు నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసిన వారు ఆ ఫలితాల కోసం ఎదురుచూడకుండా ఈ పరీక్షలకు ఫీజు చెల్లించాలని కోరారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు తుది గడువు ఈనెల 16వ తేదీ వరకు ఉందని చెప్పారు. ఆలస్య రుసుం రూ.50తో ఆ సబ్జెక్టు పరీక్ష ప్రారంభానికి రెండు రోజుల ముందు వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని వివరించారు. ఫలితాలు వెల్లడించిన 15 రోజుల్లోగా అంటే ఈనెల 15 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు కోరారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసిన, కార్యాలయానికి సమర్పించిన దరఖాస్తులనే అంగీకరిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సీ బోర్డుకు పోస్టు ద్వారా పంపిన దరఖాస్తులు ఆమోదించబోమని వివరించారు. వివరాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ గురుకులాల్లో
98.71 శాతం

పదో తరగతి ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులకు సంబంధించి 3,927 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. ఈసారి ఆరు పాఠశాలల్లో 'సున్నా' ఫలితాలొచ్చాయి. తెలంగాణ గురుకుల పాఠశాలలు 98.71 శాతంతో అత్యధిక ఉత్తీర్ణతను నమోదు చేశాయి. తెలంగాణ గురుకులాలు, బీసీ, ఎస్సీ, గిరిజన, మైనార్టీ గురుకులాలతోపాటు మోడల్ స్కూళ్లు, ప్రయివేటు పాఠశాలలు, కేజీబీవీలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 91.31 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ఆశ్రమ పాఠశాలలు, ఎయిడెడ్, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 91.31 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణతను సాధించాయి.

పరీక్షలే జీవితం కాదు

ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాక సుమారు పది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. విద్యార్థులకు పరీక్షలే జీవితం కాదని చెప్పారు. జీవితంలో అవి కూడా ఒక భాగమని వివరించారు. టెన్త్, ఇంటర్‌లో ఫెయిలై ఆ తర్వాత ఉత్తీర్ణులై జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. ఫెయిలయ్యారనీ, మార్కులు తక్కువగా వచ్చాయంటూ ఆందోళన చెందొద్దని కోరారు.

బుర్రా వెంకటేశం

ఎనిమిదేండ్ల ఉత్తీర్ణత శాతం వివరాలు

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2024	4,94,207	4,51,272	91.31
2023	4,84,370	4,19,460	86.60
2022	5,03,579	4,53,201	90
2021	5,21,073	అందరూ	100
2020	5,34,903	అందరూ	100
2019	5,06,202	4,67,859	92.43
2018	5,01,732	4,20,365	83.78
2017	5,07,938	4,27,430	84.15

పది జీపీఏ సాధించిన విద్యార్థులు (గ్రేడ్ పాయింట్ యావరేజ్)

సంవత్సరం	విద్యార్థులు
2024	8,883
2023	6,163
2022	11,343
2021	2,10,647
2020	1,41,383
2019	8,676
2018	4,768
2017	2,427

సబ్జెక్టుల వారీగా రెగ్యులర్ విద్యార్థుల ఉత్తీర్ణత (4,94,207 మంది)

సబ్జెక్టు	ఉత్తీర్ణత	శాతం
ప్రథమ భాష	4,79,634	97.12
ద్వితీయ భాష	4,92,665	99.87
తృతీయ భాష	4,85,016	98.30
గణితం	4,76,513	96.46
సామాన్యశాస్త్రం	4,77,255	96.60
సాంఘిక శాస్త్రం	4,89,276	99.05

డీఈవో

జిల్లాల వారీగా పదో తరగతి ఫలితాలు

జిల్లా	ఉత్తీర్ణత శాతం
1. నిర్మల్	99.05
2. సిద్ధిపేట	98.65
3. రాజన్న సిరిసిల్ల	98.27
4. జనగామ	98.16
5. సంగారెడ్డి	97.86
6. సూర్యాపేట్	96.91
7. కరీంనగర్	96.65
8. పెద్దపల్లి	96.32
9. నల్లగొండ	96.11
10. హన్మకొండ	95.99
11. జగిత్యాల	95.76
12. మహబూబాబాద్	94.62
13. ములుగు	94.45
14. నిజామాబాద్	93.72
15. నారాయణపేట	93.13
16. జయశంకర్ భూపాలపల్లి	92.96
17. ఆదిలాబాద్	92.93
18. మెదక్	92.90
19. కామారెడ్డి	92.71
20. మంచిర్యాల	92.42
21. ఖమ్మం	92.24
22. వరంగల్	92.20
23. నాగర్‌కర్నూల్	91.57
24. రంగారెడ్డి	91.01
25. యాదాద్రి భువనగిరి	90.44
26. భద్రాద్రి కొత్తగూడెం	90.39
27. మేడ్చల్ మల్కాజిగిరి	89.61
28. మహబూబ్‌నగర్	89.47
29. వనపర్తి	86.93
30. హైదరాబాద్	86.76
31. కొమురంభీం ఆసిఫాబాద్	83.29
32. జోగులాంబ గద్వాల	81.38
33. వికారాబాద్	65.10
మొత్తం	91.31

యాజమాన్యాల వారీగా వంద శాతం, సున్నా శాతం ఫలితాలు, పది జీపీఏ వివరాలు

యాజమాన్యం	స్కూళ్ల సంఖ్య	సున్నా శాతం	వంద శాతం	పది జీపీఏ విద్యార్థులు
1. ఎయిడెడ్	152	02	17	58
2. ఆశ్రమ	225	--	81	1
3. బీసీ గురుకుల	255	--	142	386
4. ప్రభుత్వ	492	--	37	17
5. కేజీబీవీ	475	--	177	32
6. మోడల్	194	--	60	137
7. ప్రయివేటు	4,994	04	1,814	7,635
8. తెలంగాణ గురుకుల	35	--	24	89
9. మైనార్టీ గురుకుల	207	--	77	79
10. ఎస్సీ గురుకుల	238	--	112	201
11. గిరిజన గురుకుల	101	--	39	36
12. జిల్లా పరిషత్	4,101	--	1,347	212
మొత్తం	11,469	06	3,927	8,883

పదో తరగతి ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రభంజనం

అభినందనలు తెలిపిన ఆయా సంస్థల కార్యదర్శులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల, తెలంగాణ గిరిజన, ఎస్సీ గురుకుల సంస్థల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, గిరిజన గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి, మంగళవారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను , బోధనా సిబ్బందిని వారు ఈ సందర్భంగా అభినందించారు.

కేసీఆర్ గోబెల్స్‌ను మించిపోయారు

- హాస్టళ్ల మూసివేత బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభం : సీఎం రేవంత్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టు చెప్పడంలో గోబెల్స్‌ను మించిపోయారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హాస్టళ్ల మూసివేత బీఆర్ఎస్ (మే,2023) హయాంలోనే ప్రారంభమైందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఆ ప్రతిపాదన లేకపోయినా, ఉన్నట్టు కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈమేరకు మంగళవారం ట్వీట్ చేశారు. మొన్న సూర్యాపేటలో, నిన్న మహబూబ్‌నగర్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 2023 మేలో కూడా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ వేసవి సెలవులకు సంబంధించి, నెల రోజులపాటు హాస్టళ్లు, మెస్‌లు మూసివేయడం గురించి ఇలాంటి నోటీసునే జారీ చేసినట్టు తెలిపారు. (12-05-2023 నుంచి 05-06-2023 వరకు). అందులో కూడా విద్యుత్, నీటి కొరతల గురించి ప్రస్తావించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాకే యూనివర్సిటీ మూసేస్తున్నట్టు దిక్కుమాలిన దివాళా కోరు ప్రచారం చేయడం కేసీఆర్ దిగజారుడుతనానికి పరాకాష్ట అని పేర్కొన్నారు.

నోటీసులకు 15 రోజుల గడువడిగాం
టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి

ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసులకు 15 రోజుల్లో సమాధానమిస్తామనీ, ఈమేరకు తాము గడువు అడిగినట్టు టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఆ నోటీసులను ఢిల్లీ ఇన్‌స్పెక్టర్ నీరజ్ చౌదరి ద్వారా గాంధీభవన్‌లో తానే అందుకున్నట్టు తెలిపారు. ఎఫ్ఐఆర్ పూర్తిగా చదివిన తర్వాత వాటిపై స్పందిస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. సోషల్ మీడియా వారియర్స్ తప్పు చేయబోరని తెలిపారు.

వేతన సవరణ బాండ్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

- రవాణా శాఖ మంత్రికి ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్టీసీ ఉద్యోగులందరికీ 2013 వేతన సవరణ బాండ్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న వినతి పత్రం అందించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణ బాండ్లను వెంటనే చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి మూడు నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 281 కోట్లకు గాను కేవలం రూ.81 కోట్లు మాత్రమే చెల్లించారని గుర్తు చేశారు. సర్కార్ విడుదల చేసిన సొమ్ము కొంత మంది డ్రైవర్లకు మాత్రమే సరిపోయిందని తెలిపారు. మూడు నెలలుగా పలుమార్లు విజ్ఞప్తి చేసినా రేపు, మాపు అంటున్నారే తప్ప మిగతా సొమ్మును విడుదల చేయడం లేదని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. సంస్థలో పని చేసే అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు 2013 వేతన సవరణ బాండ్ల డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభినందనలు తెలిపారు. సకాలంలో ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు ప్రకటించారు. యాజమాన్యాల వారీగా చూసినపుడు ఫలితాలు వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టే విధంగా ఉన్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రకాల గురుకులాలు ఈ ఫలితాల్లో పై మెట్టున ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక పరీక్షల ద్వారా ప్రవేశాలు చేపడుతున్నందున పై వరుసలో ఉన్నాయని వివరించారు. అన్ని యాజమాన్యాల్లో చేరిన తర్వాతే మిగిలిన విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేరుతున్నారని గుర్తు చేశారు. అందుకే ఆ పాఠశాలలు ఫలితాల్లో దిగువన ఉన్నాయని తెలిపారు. అయినా మంచి ఫలితాలు సాధించినట్టేనని పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో ఫలితాలు మెరుగ్గా కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జీరో ఫలితాల్లేవని వివరించారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు 3,927లో జిల్లా పరిషత్ పాఠశాలలు-1,347, కేజీబీవీలు-177, మోడల్ స్కూళ్లు-60, ప్రభుత్వ పాఠశాలలు-37, ఆశ్రమ పాఠశాలలు-81, గురుకులాలు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఫలితాల స్ఫూర్తితో ప్రభుత్వరంగ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచుకోవాలని సూచించారు.

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో
ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం

- టీచర్లకూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానం
- పార్లమెంటు ఎన్నికల తర్వాతే బదిలీలు, పదోన్నతులు
- టెట్ రాతపరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు
- విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాం
- బడుల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం: విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాల్సిన అవసరముందని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని చెప్పారు. ఫీజుల నియంత్రణ కోసం ఉత్తర్వులిస్తే కోర్టులో సవాల్ చేస్తే అవి నిలబడ్డం లేదన్నారు. న్యాయపరంగా ఎదుర్కోవాలంటే చట్టం అవసరమని అభిప్రాయపడ్డారు.

మంగళవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న విధానమే రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరంలోనూ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం కోసం ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. వారానికి ఐదు గంటలు అదనంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంచుతామన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థులు పరిపూర్ణంగా అభివృద్ధి చెందేలా చూస్తామన్నారు. అందుకనుగుణంగా మాడ్యూళ్లను రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి తీసుకొస్తామని అన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో దీన్ని అమలు చేస్తామన్నారు. మార్కులు తక్కువొచ్చినా, ఫెయిలైనా కుంగిపోకుండా, ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా ఆత్మవిశ్వాసం ఉండేలా విద్యార్థులను తయారు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు ఉన్నట్టుగానే ఉపాధ్యాయులకూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమలు చేస్తామన్నారు. పదోన్నతి పొందాలంటే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని అన్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత పదోన్నతులు, బదిలీలు చేపడతామని చెప్పారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులుంటాయని అన్నారు. ఈనెల 27న నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉందనీ, వచ్చేనెల నాలుగో తేదీన సాధారణ ఎన్నికల ఫలితాలుంటాయని చెప్పారు. దీంతో ఈనెల 27న, వచ్చేనెల మూడో తేదీన జరిగే టెట్ రాతపరీక్షల తేదీల్లో మార్పులుంటాయని వివరించారు. మిగిలిన పరీక్షల షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థుల సంఖ్య ఎక్కువుండి ఉపాధ్యాయుల్లేని చోట అవసరమైతే విద్యావాలంటీర్లను నియమిస్తామని బుర్రా వెంకటేశం చెప్పారు.

రెండో పీఆర్సీ 40 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే ప్రకటించాలి.

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లకు 2023 జూలై 1 నుంచి రావలసిన రెండో పీఆర్సీని 40 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీఆర్సీ కమిషన్ ఆహ్వానం మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఆ కమిటీ చైర్మెన్ ఎన్.శివశంకర్, సభ్యులు బి.రామయ్యను యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసి చర్చించింది. గతంలో ఇచ్చిన పీఆర్సీ నివేదికలో పేర్కొన్న అంశాలతో పాటు సమగ్ర నివేదికను కూలంకషంగా చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలని బృంద సభ్యులు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం రూ. 30,400, గరిష్ఠ వేతనం రూ.2,58,980గా నిర్ణయించాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖను మిగతా ప్రభుత్వ శాఖల మాదిరిగా చూడకూడదని వివరించారు. నిత్యం రకరకాల వ్యాధులతో ఉన్న రోగుల మధ్య పని చేస్తున్న నేపథ్యంలో రిస్క్ అలవెన్స్‌తో పాటు మెరుగైన వేతన సవరణ చేయాలని విన్నవించారు. ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ పథకాన్ని ప్రతి ఐదేండ్లకోసారి ఇవ్వాలనీ, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 30శాతం, జిల్లా కేంద్రాల్లో 25 శాతం, ఇతర ప్రాంతాల్లో 20 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వడంతో పాటు గ్రాట్యూటి రూ,16 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అడిషనల్ హెచ్ఆర్ఏ వైద్య ఆరోగ్య ఉద్యోగులందరికీ వర్తింప చేయాలనీ, దశాబ్దాల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనీ, ఖాళీ పోస్టులను శాశ్వత పద్ధతిలో భర్తీ చేసి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందనిని రెగ్యులర్ చేయడంతో పాటు అలవెన్స్‌లు వర్తింపజేయాలని కోరారు. అందరికీ ఆమోదయోగ్యమైన పీఆర్సీని రూపొందించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు చైర్మెన్ హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్,రాష్ట్ర అధ్యక్షులు ఎండి. ఫసియుద్దీన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.కిరణ్మయి, బైరపాక శ్రీనివాస్, జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ పార్టీ నుంచి ప్రజ్వల్ బహిష్కరణ



బెంగళూరు : మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణపై జెడిఎస్ వేటు వేసింది. హసన్ లోక్‌సభ స్థానానికి పోటీ చేసిన ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన అసభ్యకర వీడియోలు గత కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వ్యవహారంలో జెడిఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజ్వల్ రేవణ్ణను, అతని తండ్రి హెచ్‌డి రేవణ్ణలను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి మంగళవారం వెల్లడించారు. వారిని సస్పెండ్ చేయాలని సొంత పార్టీ నేతల నుంచే డిమాండ్లు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే ప్రజ్వల్‌ను పార్టీ నుంచి బహిష్కరించేందుకు నిర్ణయం తీసుకున్నామని, ఈ దీనిపై జెడిఎస్ కోర్ కమిటీ సమావేశంలో చర్చించి ప్రకటన చేస్తామని కుమారస్వామి పేర్కొన్నారు.

ప్రయివేటు కంటే ఉత్తమ ఫలితాలు

- పది ఫలితాల్లో గురుకులాల ప్రభంజనం
- వెనుకంజలో సర్కారు బడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ రంగంలోని గురుకుల పాఠశాలలు ప్రభంజనం సృష్టించాయి. ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయి. ప్రయివేటు పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలు సాధించడం గమనార్హం. తెలంగాణ గురుకులాలు 98.71 శాతం ఉత్తీర్ణత సాధించి యాజమాన్యాల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. ఆ తర్వాత బీసీ గురుకులాలు 98.21 శాతం, ఎస్సీ గురుకులాలు 98.02 శాతం, గిరిజన గురుకులాలు 97.16 శాతం, మైనార్టీ గురుకులాలు 96.82 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ప్రయివేటు పాఠశాలల్లో 93.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో వెనుకంజలో ఉన్నాయి. జిల్లా పరిషత్ బడుల్లో 86.03 శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 80.18 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత వివరాలు

యాజమాన్యం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణత	శాతం
తెలంగాణ గురుకుల	2,475	2,443	98.71
బీసీ గురుకుల	17,467	17,154	98.21
ఎస్సీ గురుకుల	18,063	17,706	98.02
గిరిజన గురుకుల	6,893	6,697	97.16
మైనార్టీ గురుకుల	10,076	9,756	96.82
మోడల్ స్కూళ్లు	17,592	16,723	95.06
ప్రయివేటు పాఠశాలలు	2,29,043	2,14,712	93.74
కేజీబీవీ	17,546	16,329	93.06
ఆశ్రమ పాఠశాలలు	7,913	7,093	89.64
ఎయిడెడ్	6,526	5,783	88.61
జిల్లా పరిషత్	1,38,272	1,18,962	86.03
ప్రభుత్వ స్కూళ్లు	22,341	17,914	80.18
మొత్తం	4,94,207	4,51,272	91.31

తెలంగాణ గురుకులాల సత్తా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


పదో తరగతి ఫలితాల్లో గురుకులాల్లోని విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 35 గురుకుల పాఠశాలల్లో 2,475 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,443 (98.71 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అందులో 24 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని పేర్కొన్నారు. 89 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారని వివరించారు. అందులో 55 మంది అమ్మాయిలు, 34 మంది అబ్బాయిలున్నారని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో అగ్రగామిగా నిలిచినందున విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన అభినందించారని పేర్కొన్నారు.

60 మోడల్ స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలో 60 మోడల్ స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూళ్ల నుంచి 17,592 మంది పరీక్షలు రాస్తే, 16,723 (95.06 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని వివరించారు. 137 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారని తెలిపారు. 2,987 మంది విద్యార్థులు ఏ1 గ్రేడ్, 5,747 మంది ఏ2 గ్రేడ్ సాధించారని పేర్కొన్నారు.

కేజీబీవీల్లో 93.06 శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలోని 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో 17,546 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే, 16,329 (93.06 శాతం) మంది విద్యార్థులు పాసయ్యారని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య బట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 177 కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. పదికి పది జీపీఏ సాధించిన విద్యార్థులు 32 మంది ఉన్నారని పేర్కొన్నారు. తొమ్మిది నుంచి 9.9 జీపీఏ సాధించిన విద్యార్థులు 2,152 మంది ఉన్నారని తెలిపారు.



అబద్ధాలు... వక్రీకరణలు

- ప్రధాని ప్రసంగాల్లో కాంగ్రెస్‌పై నిరాధార నిందలు
- మ్యానిఫెస్టోలో లేని అంశాలను ఆపాదించే ప్రయత్నం
- ప్రజలను గందరగోళంలో పడేసే ఎత్తుగడ

న్యూఢిల్లీ : గత వారం రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ తన ఎన్నికల ప్రచార సభల్లో వాస్తవాలు కప్పిపెడుతూ, అబద్ధాల మీద అబద్ధాలు వల్లె వేస్తూ ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 21న రాజస్థాన్‌లోని బన్‌స్వారాలో చేసిన ప్రసంగంతో ఈ అబద్ధాల పర్వం ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ ప్రజల సొమ్మును కొల్లగొట్టి, దానిని ముస్లింలకు పంపిణీ చేయాలని యోచిస్తోందని మోడీ ఆ సభలో ఆరోపించారు. పైగా ముస్లింలపై చొరబాటుదారులు, అధిక సంతానాన్ని కనే వారు అనే ముద్ర వేశారు. వివిధ కులాలు, మతాల మధ్య పరస్పర విద్వేషాలను రెచ్చగొట్టడం లేదా ఉద్రిక్తతలు కలిగించడం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. మోడీ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారంటూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. ఆ తర్వాతే మోడీ తన ప్రసంగాల్లో ముస్లింల ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడ్డారు. అయితే మోడీ కేవలం ఒకే ఒక రోజు మాత్రమే నిగ్రహాన్ని పాటించారు. ఈ నెల 23న మరోసారి మైనారిటీ సమాజంపై నిందారోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సామాజికంగా వెనుకబడిన హిందూ గ్రూపుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ తప్పుడు ఆరోపణలు చేశారు. ఈ నెల 21 నుండి 25వ తేదీ వరకూ వివిధ ఎన్నికల ప్రచార సభల్లో మోడీ చేసిన ప్రసంగాలను 'స్క్రోల్' పోర్టల్ విశ్లేషించింది. ఆయన వాదనల్లో వాస్తవమెంతో నిగ్గు తేల్చింది. ముఖ్యంగా మతాల మధ్య చిచ్చు పెట్టేలా మోడీ చేసిన వ్యాఖ్యలను నిశితంగా పరిశీలించింది. ఆ వివరాలు....

21న బన్‌స్వారాలో...

రాజస్థాన్‌లో బన్‌స్వారాలో ఈ నెల 21న జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోడీ ఏమన్నారంటే...'వివాహిత హిందూ మహిళల మంగళసూత్రాలు సహా ప్రైవేటు సంపదలన్నింటినీ సర్వే చేస్తామని, స్వాధీనం చేసుకుంటామని, వాటిని పున:పంపిణీ చేస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. నా తల్లులు, సోదరీమణుల వద్ద ఉన్న బంగారు ఆభరణాలు కేవలం ప్రదర్శనకు ఉద్దేశించినవి కావు. వాటికి వారి ఆత్మగౌరవంతో సంబంధం ఉంది. వాటిని లాక్కుంటామని వారు మ్యానిఫెస్టోలో బెదిరించారు'... అయితే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రైవేటు ఆస్తుల స్వాధీనం ప్రస్తావనే లేదు. మహిళల మంగళసూత్రాల మాటే లేదు. దేశ వనరులకు ముందుగా ముస్లింలే హక్కుదారులని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందంటూ మోడీ వివాదానికి తెరలేపారు. 2009లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన ప్రసంగాన్ని మోడీ వక్రీకరించారు. మతపరమైన మైనారిటీలే కాకుండా ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనుకబడిన తరగతులు, మహిళలు, చిన్నారులు సహా దేశంలోని అణగారిన వర్గాలన్నింటినీ అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని మాత్రమే మన్మోహన్ ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోని ప్రైవేటు సంపదను చొరబాటుదారులు, అధిక సంతతి కలిగిన ముస్లింలకు పంపిణీ చేస్తుందని మోడీ చెప్పారు. అసలు ముస్లింలు చొరబాటుదారులు అనడానికి ఆధారాలేవీ లేవు. అక్రమ వలసదారులపై తన వద్ద సమాచారమేమీ లేదని మోడీ ప్రభుత్వమే పార్లమెంటుకు తెలియజేసింది. హిందువుల కంటే ముస్లింలలో సంతానోత్పత్తి రేటు అధికమే గానీ ఇప్పుడది ఇతర మతాలన్నింటితో పోలిస్తే అది అత్యంత వేగంగా తగ్గిపోతోంది. పైగా సంతానోత్పత్తి అనేది ఆర్థిక పరిస్థితికి సంబంధించిందే తప్ప మతానికి సంబంధించింది కాదు. నిరుపేద రాష్ట్రమైన బీహార్‌లో నివసిస్తున్న హిందువుల కంటే బాగా అభివృద్ధి చెందిన తమిళనాడులోని ముస్లింలే తక్కువ మంది పిల్లలను కంటున్నారు.

22న అలీఘర్‌లో....

ప్రైవేటు ఆస్తులను సర్వే చేసి, స్వాధీనం చేసుకుంటామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో చెబుతోందని మోడీ మరోసారి తప్పుడు వాదన విన్పించారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఎంత ఆదాయం, ఆస్తి, సంపద, ఇళ్లు ఉన్నాయో సర్వే చేస్తుందని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి పంపిణీ చేస్తుందని, పార్టీ మ్యానిఫెస్టో ఈ విషయాన్నే చెప్పిందని రాహుల్ గాంధీ అంటున్నారు' అని మోడీ తెలిపారు. అయితే కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో అలా చెప్పలేదు. 'దేశాన్ని ఎక్స్‌రే తీస్తాము. దీనివల్ల దేశ సంపదలో తమ వాటా ఎంతో వెనుకబడిన తరగతులు, దళితులు, ఆదివాసీలు, సాధారణ ప్రజల్లో పేదలు, మైనారిటీలు తెలుసుకోగలుగుతారు' అని మాత్రమే రాహుల్ అన్నారు. ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకొని, వాటిని తిరిగి పంపిణీ చేస్తామని ఆయన ఎక్కడా అనలేదు. కాంగ్రెస్ ఇలా చెప్పడం మావోయిస్టుల ఆలోచన కాదా అని ప్రధాని ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ చెప్పిందేమిటి? భూ గరిష్ట పరిమితి చట్టాలను అనుసరించి ప్రభుత్వ భూములు, మిగులు భూములను మాత్రమే పేదలకు పంపిణీ చేస్తామని ఆ పార్టీ మ్యానిఫెస్టోలో ఉంది.

23న టాంక్-సవాయ్ మాదోపూర్‌లో....

రాహుల్ చేసిన 'ఎక్స్‌రే' వ్యాఖ్యకు మోడీ విపరీతార్థాలు తీశారు. ప్రజల వద్ద రెండు ఇళ్లు ఉంటే వాటిలో ఒక దానిని కాంగ్రెస్ లాక్కుంటుందని చెప్పారు. అయితే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో కానీ, ఆ పార్టీ నేతల ప్రసంగాల్లో కానీ ప్రజల ఇళ్లను స్వాధీనం చేసుకుంటామని కానీ, వాటిని తిరిగి పంపిణీ చేస్తామని కానీ ఎక్కడా చెప్పలేదు. మోడీ తన ప్రసంగంలో మన్మోహన్ సింగ్ వ్యాఖ్యలను మరోసారి వక్రీకరించారు.

24న బేతల్‌లో....

ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ గ్రూపుల నుండి రిజర్వేషన్లు గుంజుకొని వాటిని ప్రత్యేక ఓటు బ్యాంకుకు ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోందని మోడీ చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రణాళికలో మత రిజర్వేషన్ల ఊసే లేదు. పన్నును మోడీ మరోసారి ప్రస్తావించారు. వారసత్వ పన్ను విధించాలని అప్పటి హోం మంత్రి చిదంబరం సూచించినప్పటికీ కాంగ్రెస్ అంగీకరించలేదు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే వారసత్వ పన్నును మోడీ తొలి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన అరుణ్ జైట్లీ కూడా ప్రస్తావించారు.

24న సాగర్‌లో....

చట్టవిరుద్ధమైన పద్ధతుల ద్వారా మత ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించిందని మోడీ కర్నాటకలో ఆరోపించారు. ఓబీసీ కోటాలో ముస్లింలను చేర్చడాన్ని ఆయన ప్రస్తావించారు. వాస్తవానికి 1962లోనే కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని ముస్లిం కులాలను ఓబీసీల జాబితాలో చేర్చింది. నాగన గౌడ కమిషన్ సిఫార్సుల మేరకే ఆ పని చేసింది తప్ప మత ప్రాతిపదికన కాదు. 1994లో దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (ఎస్) ప్రభుత్వం అన్ని ముస్లిం కులాలనూ ఓబీసీల జాబితాలో చేర్చింది. వారికి 4 శాతం ఉప కోటా కల్పించింది. 12 సంవత్సరాల క్రితం నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింలను ఓబీసీ కేటగిరీలో చేర్చారు.

24న సర్‌గుజాలో....

మత ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేసేందుకు కాంగ్రెస్ తొలుత ఆంధ్రప్రదేశ్‌లో ప్రయత్నించిందని, ఆ తర్వాత అదే కోటాను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని చూసిందని మోడీ తెలిపారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లలో కోత పడుతుందని చెప్పారు. వాస్తవానికి ముస్లింలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే దీనిని హైకోర్టు కొట్టివేసింది. 2009, 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలలో రిజర్వేషన్ల ప్రస్తావన తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ 2019లో మాత్రం మౌనం వహించింది. కాగా కర్నాటకలో మత ప్రాతిపదికన కాంగ్రెస్ రిజర్వేషన్లు కల్పించిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసామని మోడీ గుర్తు చేశారు. కానీ నిజం ఏమంటే 2023 మార్చిలో బీజేపీ ప్రభుత్వం ముస్లిం ఓబీసీలకు 4 శాతం సబ్-కోటాను రద్దు చేసింది. కానీ ఆ కోటాను దళితులు, ఆదివాసీలకు ఇవ్వలేదు. దానికి బదులుగా ఆ కోటాను రాష్ట్రంలో ప్రాబల్యం కలిగిన లింగాయతులు, ఒక్కలిగులకు బదిలీ చేసింది. అయితే దీనిపై సుప్రీంకోర్టు స్టే విధించింది. వారసత్వ పన్ను విధిస్తామని కాంగ్రెస్ చెబుతోందని మోడీ విమర్శించారు. దీనిపై ఆయన ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేశారు. అయితే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆ ప్రస్తావన ఎక్కడా లేదు.

25న వివిధ ప్రాంతాల్లో...

ఓబీసీ కోటాలోని 27శాతం రిజర్వేషన్లలో కొంత భాగాన్ని విడదీసి మతపరమైన రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ యోచిస్తోందని మోడీ చెప్పుకొచ్చారు.అయితే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ ప్రస్తావనే లేదు. వారసత్వ పన్ను విధింపునకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలను కూడా ప్రధాని మరోసారి ఏకరువు పెట్టారు. అదే రోజు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగిస్తూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో లేని పలు అంశాలను ఆ పార్టీకి ఆపాదించారు.

రఫాపై దాడి చేసి తీరుతాం : నెతన్యాహు

- తాజా ప్రతిపాదన ఆమోదించాలంటూ హమాస్‌పై అమెరికా ఒత్తిడి
- వచ్చే వారం ఇజ్రాయిల్‌లో బ్లింకెన్ పర్యటన

జెరూసలేం, గాజా : గత ఏడు మాసాలుగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో వందల వేల సంఖ్యలో పాలస్తీనియన్లు తల దాచుకున్న రఫా నగరంపై దాడి చేసి తీరుతామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు మంగళవారం స్పష్టం చేశారు. మిత్రపక్షం అమెరికా సహా అంతర్జాతీయ సమాజం రాఫాపై దాడి వద్దంటూ చేస్తున్న విజ్ఞప్తులను నెతన్యాహు పెడచెవిన పెడుతున్నారు. బందీల విడుదలకు ప్రతిగా యుద్ధాన్ని ఆపేది లేదంటూ పదే పదే చెబుతున్నారు. ఒప్పందం కుదిరినా, కుదరకపోయినా, రఫాలోకి ప్రవేశించి, అక్కడ గల హమాస్ బెటాలియన్లను ధ్వంసం చేస్తామన్నారు. గాజాలో కాల్పుల విరమణకు, బందీల విడుదల కోసం కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రస్తుతం ఇరు పక్షాలు చర్చలు జరుపుతున్నాయి. తాము పెట్టుకున్న లక్ష్యాలను సాధించాలని, ఆలోపుగా యుద్ధం ఆపాలన్న ఆలోచనే తమకు లేదని ఆయన తేల్చి చెప్పారు. బందీల కుటుంబాలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటన చేసింది. రఫా నగరంలో పది లక్షల మందికి పైగా ప్రజలు తల దాచుకున్నారు.

హమాస్‌పై బ్లింకెన్ ఒత్తిడి

కాల్పుల విరమణపై కొత్త ప్రతిపాదన చేసిన నేపథ్యంలో దాన్ని అంగీకరించాలంటూ హమాస్‌పై అమెరికా ఒత్తిడి తీసుకువస్తోంది. కాగా రఫా నగరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 26మంది మరణించారని ఆస్పత్రి రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ వారంలో ఇజ్రాయిల్‌లో అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటించనున్నారు. తాజా ప్రతిపాదనను ఆమోదించాంటూ ఆయన హమాస్‌ను కోరారు. ఇజ్రాయిల్ చాలా ఉదారంగా వ్యవహరించి ఈ ప్రతిపాదన చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఆ ప్రతిపాదన వివరాలేంటనేది బహిర్గతం కాలేదు. గాజాలో శాశ్వతంగా కాల్పుల విరమణ జరగాలని హమాస్ కోరు తుండగా, ఇజ్రాయిల్ అందుకు ఒప్పు కోవడం లేదు. రఫాపై దాడిని నివారించే లక్ష్యంతో ఈజిప్ట్ తన మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఎలాగైనా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదర్చాలని భావిస్తోంది. చర్చలపై ఇలా ప్రతిష్టంభన కొనసాగుతున్న తరుణంలోనే ఇజ్రాయిల్ నేతల అరెస్టుకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారంట్లు జారీ చేయవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లండన్ వీధుల్లో కత్తితో వ్యక్తి స్వైర విహారం

13ఏండ్ల బాలుడు మృతి

లండన్ : కత్తి పట్టుకుని ఒక వ్యక్తి తూర్పు లండన్ వీధుల్లో స్వైర విహారం చేస్తూ పలువురిని గాయపరిచాడని, ఈ దాడిలో 13ఏండ్ల బాలుడు మరణించాడని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరు పోలీసులు, ఇద్దరు పౌరులు వున్నారు. సమురాయ్ తరహాలోని కత్తిని పట్టుకుని దాడి చేసిన ఆ వ్యక్తి (36)ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఇది తీవ్రవాదానికి సంబంధించిన ఘటనగా తాము భావించడం లేదన్నారు. గాయపడిన వారందరినీ ఆస్పత్రికి తీసుకెళ్లామని వారు చికిత్స పొందుతున్నారని చెప్పారు. గాయపడిన ఇద్దరు పోలీసు అధికారులకు ఆపరేషన్ చేయాల్సి వుందన్నారు.

ప్రధాని దిగ్భ్రాంతి

ప్రధాని రిషి సునాక్ ఈ కత్తిపోట్లపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీధుల్లో ఈ తరహా హింసకు తావు లేదని అన్నారు. అత్యవసరంగా రంగంలోకి దిగి ఆ వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులను ఆయన అభినందించారు. దేవుడిని నమ్ముతారా? అంటూ ఆ వ్యక్తి గట్టిగా అరుస్తూ ఇళ్ళ దగ్గరకు వచ్చి దాడికి ప్రయత్నించాడని, అప్పుడు తాను ఒక కిటికీ వెనక దాక్కున్నానని ఒక మహిళ తెలిపారు. ఏం జరుగుతోందో అర్థం కాలేదన్నారు. రాజధానిలో ఇటీవల కత్తి నేరాలు పెరిగిపోవడం పట్ల సునాక్ తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు.

మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ నాయకులు మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు మంగళవారం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ నమోదు చేసిన అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో మనీశ్ సిసోడియాకు ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా బెయిల్‌ను తిరస్కరించారు. ప్రస్తుత సమయంలో బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. సిటీ కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా హైకోర్టుకు వెళతామని ఆప్ నాయకులు తెలిపారు. మద్యం పాలసీ కేసులో గత ఏడాది ఫిబ్రవరి 26న సిసోడియాను సిబిఐ అరెస్టు చేసింది. మనీలాండ రింగ్ కేసులో గత ఏడాది మార్చి 9న ఈడీ అరెస్టు చేసింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ కోసం సిసోడియా పిటిషన్ వేశారు. గత ఏడాది ఫిబ్రవరి 28న మంత్రి పదవికి సిసోడియా రాజీనామా చేశారు.

ఓయూ సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లోని త్రాగునీరు, భోజనం సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత చదువులకు నిలయమైన ఓయూలో మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. గత పది రోజులుగా విద్యార్థినీల వసతి గృహాల్లో నీటి కొరత తీవ్రంగా ఉన్నా అధికారులు సరిగ్గా పట్టించుకోకుండా వ్యవరించారని తెలిపారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంత తీవ్రమైన ఎండల్లో సుమారు 700 మంది విద్యార్థినీలు ఉంటున్న ఒక వసతి గృహంలో కేవలం ఒక రిఫ్రిజిరేటర్ ఉందని పేర్కొన్నారు. అక్కడే ఉన్న మిగతా రెండు హాస్టళ్ల విద్యార్థులు కూడా ఇదే రిఫ్రిజిరేటర్‌పై ఆధారపడడం వల్ల రోజురోజుకూ సమస్య మితిమీరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి విద్యార్థులు అనేక సార్లు నిరసనలు తెలిపినా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కార చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ సమస్యలన్నిటికీ కరెంట్ సరఫరా లేకపోవడాన్ని కారణంగా చూపుతూ కాలక్షేపం చేస్తున్నారని తెలిపారు. జూన్ రెండో వారం నుంచి పీజీ విద్యార్థులకు నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ (జాతీయ అర్హత పరీక్ష)ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో చివరి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ సమయంలో విద్యార్థులు హాస్టల్లోనే ఉంటూ పరీక్షకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. దీన్ని అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా ఎండా కాలాన్ని కారణంగా చూపి హాస్టళ్లను ఖాళీ చేయమనంటున్నారని తెలిపారు.

దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు. గతంలో సికింద్రాబాద్ పీజీ కళాశాల, కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో కూడా విద్యార్థులు ఈ తరహానే ఆందోళన చేపట్టారని గుర్తు చేశారు. వర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

మతోన్మాద శక్తుల ఓటమికి సీపీఐ(ఎం) కృషి



- హైదరాబాద్‌లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపిద్దాం.. :సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్
- చాదర్‌ఘాట్‌లో సీపీఐ(ఎం) నేతలతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎండీ వలీ ఉల్లా సమీర్ సమావేశం

నవతెలంగాణ - ధూల్ పేట్

భారత రాజ్యాంగ రక్షణకు, దేశంలో మతోన్మాద శక్తులను ఓడించడానికి సీపీఐ(ఎం) నికరంగా కృషి చేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న ఇండియా కూటమికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి ఎండి.వలీ ఉల్లా సమీర్ చాదర్‌ఘాట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎం) ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల నాయకులు ప్రచార వ్యూహం, ప్రజలను విస్తృతంగా కలిసి ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో ఎం.డీ.అబ్బాస్, ఎం.డీ.వలీ ఉల్లా సమీర్ మాట్లాడారు. ప్రజల మధ్య మత వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీని, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శాస్త్రీయ వైఖరి లేకుండా ఉద్రేకాలు పెంచేలా వ్యవహరిస్తున్న ఎంఐఎంలను ఓడించాలని పిలుపునిచ్చారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశంలో ప్రజలు మరింత పేదరికంలోకి నెట్టబడితే.. అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారుల ఆస్తులు వందల రెట్లు పెరిగాయని చెప్పారు. బీజేపీ నాయకత్వంలోని మోడీ సర్కార్ విధానాల వల్ల సామాన్య ప్రజల ఆదాయాలు గణనీయంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించడం ప్రజలు తమ కర్తవ్యంగా భావించాలని, హస్తం గుర్తు పై ఓటు వేసి ఎండీ.వలీ ఉల్లా సమీర్‌ను గెలిపించాలని కోరారు. మే 4వ తేదీ సాయంత్రం సంతోష్‌నగర్ చౌరస్తా ఆలం కుంద్మీరి భవన్‌లో నిర్వహించే సీపీఐ(ఎం) బహిరంగ సభకు ఇరుపార్టీల నేతలు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా నేతలు పి.నాగేశ్వర్, ఎం.మీన, అబ్దుల్ సత్తార్, ఎం.బాలు, కె.జంగయ్య, కాంగ్రెస్ నాయకులు హర్షద్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధమే..

- మోడీవన్నీ మోసపూరిత మాటలే.. : కూసుమంచి కార్నర్ మీటింగ్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



అబద్ధాల పునాదులపైనే బీఆర్ఎస్ పార్టీ నిర్మితమైందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. కేసీఆర్ నోరు తెరిస్తే చెప్పేవన్నీ అబద్ధాలేనని అన్నారు. మోసపూరిత మాటలు, కట్టు కథలతో ఈ దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కూసుమంచి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భట్టి ప్రసంగించారు. కేసీఆర్ చెప్పే అబద్ధాలను నమ్మని తెలంగాణ ప్రజలు బండకేసి కొట్టి మరీ ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకు న్నారని చెప్పారు. ఈ దేశ సంపద, వనరులను ప్రజలకు చెందకుండా తన సన్నిహితులైన క్రోని క్యాపిటలిస్టులకు మోడీ కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఈ పదేండ్లలో దేశ సంపదను ప్రధాని మోడీ, రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచేశారని తెలిపారు. మరోసారి బీజేపీతో బీఆర్ఎస్ చేతులు కలిపి సంపదను దోపిడీ చేసే ప్రయత్నం చేస్తోంద'ని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన మోడీ ఒకవైపు.. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, దేశ సంపదను కాపాడాలనే రాహుల్ గాంధీ మరొకవైపు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు. మనమంతా రాహుల్ గాంధీకి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిన ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురా ంరెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీని రూ. 10 లక్షలకు పెంచామని తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుంచి 200 యూనిట్ల కన్నా తక్కువ విద్యుత్ వినియోగించే పేద కుటుంబాలకు జీరో కరెంట్ బిల్లు ఇస్తున్నామని చెప్పారు. అర్హులకు రూ. 500కే గ్యాస్ ఇస్తున్నామని, ప్రతి నియో జకవర్గంలో నిరుపేదల కోసం 3,500 రెండు గదుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. కేసీఆర్ పదేండ్లలో ఏనాడైనా పంట నష్టాన్ని అంచనా వేశారా అని ప్రశ్నించారు. జాబ్ క్యాలండర్ ప్రకారం నోటిఫి కేషన్లు ఇస్తున్నామని, ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో విద్యుత్, తాగు నీరు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా అక్కడే ఉండి చదువుకోవచ్చని వివరించారు. పదేండ్లపాటు ముఖ్యమంత్రిగా చేసిన పెద్దమనిషి కరెంటు కోతలపై అన్ని అబద్ధాలే మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సభలో అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, ఎంపీ రేణుకా చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు రాయల నాగేశ్వరరావు, మానుకొండ రాధా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

పడకేసిన మౌలిక వసతుల రంగాలు

- మార్చిలో 5.2 శాతానికి పతనం
- మైనస్‌లో రిఫైనరీ, ఎరువుల ఉత్పత్తి



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం స్పష్టమవుతోంది. అత్యంత కీలక మైన ఎనిమిది మౌలిక వసతుల రంగాల ఉత్పత్తి పడకేసింది. ప్రస్తుత ఏడాది మార్చిలో మౌలిక వసతుల రంగాలు ఉత్పత్తి పెరుగుదల 5.2 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం ఫిబ్రవరిలో ఇవి 7.1 శాతంగా వృద్ధిని నమోదు చేయగా.. వరుసగా ఐదో మాసంలోనూ కీలక రంగాలు నేల చూపులు చూడటం గమనార్హం.

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి స్థూలంగా 7.5 శాతానికి పడిపోయింది. 2022-23లో 7.8 శాతం వృద్ధిని కనబర్చాయి. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఉక్కు 12.3 శాతం వృద్ధితో ప్రగతిని కనబర్చింది. బొగ్గు (11.7 శాతం), సిమెంట్ (9.1 శాతం), విద్యుత్ (7శాతం) రంగాలు రాణించాయి.

గడిచిన మార్చి మాసంలో బొగ్గు (8.7 శాతం), ముడి చమురు (2 శాతం), సహజ వాయువు (6.3 శాతం), ఉక్కు (5.5 శాతం) వంటి రంగాల్లో ఉత్పత్తి క్షీణించింది. రిఫైనరీ ఉత్పత్తులు ఏకంగా మైనస్ 0.3 శాతం, ఎరువులు మైనస్ 1.3 శాతం చొప్పున క్షీణించాయి. సిమెంట్ (10.6 శాతం), విద్యుత్ (8 శాతం) రంగాలు మాత్రమే ప్రగతిని కనబర్చాయి. ఈ ఎనిమిది రంగాలు మొత్తం దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 40.27 శాతం వాటా కలిగి ఉన్నాయి.

భౌగోళిక ఉద్రిక్తలతో ఎగుమతులపై ఒత్తిడి : ఎఫ్ఐఇఒ

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా నెలకొన్న పలు ఉద్రిక్త పరిస్థితులు భారత ఎగుమతులపై ప్రభావం చూపనున్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఎఫ్ఐఇఒ) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. పలు దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తకర పరిస్థితులు మార్కెట్‌లోని డిమాండ్‌ను దెబ్బ తీయవచ్చన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం అంతర్జాతీయ అనిశ్చితికి దారి తీసిందన్నారు. ఇప్పటికే 2022-23తో పోల్చితే 2023-24లో భారత ఎగుమతులు తగ్గాయన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రభావం వల్ల భారత్ నుంచి యుఎఇ, ఇరాన్‌లకు వెళ్లే ఇంజినీరింగ్ ఉత్పత్తులకు డిమాండ్ పడిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

వైసల్‌లో జిఎంఆర్‌కు 8.40 శాతం వాటాలు




హైదరాబాద్ : విమానాశ్రయాలలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీస్ ప్రొవైడర్ అయినా వైసల్‌లో 8.40 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్లడించింది. ఈ విషయమై మంగళవారం రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఉత్తిష్ట విరాట్ ఫండ్ నుంచి 4,60,000 వైసల్ షేర్లను రూ.56.66 కోట్లకు కొనుగోలు చేయడానికి కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. జిఎంఆర్ గ్రూప్ ప్రస్తుతం ఢిల్లీ, హైదరాబాద్, గోవా, ఫిలిప్పీన్స్‌లోని విమానాశ్రయాలను నిర్వహిస్తోంది.

జైడస్ వెల్నెస్ నుంచి 'గ్లూకాన్-డి' పానియం

హైదరాబాద్ : సైన్స్ ఆధారిత ఎఫ్ఎంసిజి కంపెనీ జైడస్ వెల్‌నెస్ కొత్తగా 'గ్లూకాన్-డి' పేరుతో ఎలక్ట్రోలైట్ ఎనర్జీ రెడీ టుడ్రింక్ (ఆర్‌టిడి) పానియాన్ని ఆవిష్కరిం చింది. వినియోగదారుల వేగవంతమైన జీవనశైలి ప్రయాణాల వల్ల రెడీ టూ డ్రింక్ పానీలయాలకు డిమాండ్ పెరుగుతోందని పేర్కొంది. ప్రస్తుతం దీని మార్కెట్ విలువ రూ.1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేసింది. గ్లూకాన్-డిలో సోడియం, పొటాషియం క్లోరైడ్, విటమిన్లు సి, బి3, బి5, బి6తో తయారు చేసినట్లు జైడస్ వెల్‌నెస్ సిఇఒ తరుణ్ అరోరా పేర్కొన్నారు. 200 గ్రాముల టెట్రా ప్యాక్ ధరను రూ.45గా నిర్ణయించామన్నారు.

బిజినెస్

బౌల్ట్ నుంచి రెండు కొత్త సౌండ్ బార్స్



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ బౌల్ట్ కొత్తగా రెండు సౌండ్ బార్స్‌ను ఆవిష్కరించింది. బౌల్ట్ ప్రవేశపెట్టిన అత్యాధునిక తొలి స్పేస్ ట్రాన్స్‌ఫార్మింగ్ సౌండ్‌బార్, బాస్‌బాక్స్ సౌండ్‌బార్స్‌తో ఇంటి వినోదాన్ని విప్లవాత్మకంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇవి 120, 180 ఆర్ఎంఎస్ వేరియంట్లలో లభిస్తాయని ఆ సంస్థ తెలిపింది. వీటి ధరలను వరుసగా రూ.4,999, రూ.5,999గా నిర్ణయించింది. బౌల్ట్ బాస్ బాక్స్ అత్యాధునిక డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ టెక్నాలజీతో వస్తుందని తెలిపింది.

లోక్‌సభ స్థానాలకు ఇన్‌చార్జిలను ప్రకటించిన టీజేఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో నియోజక వర్గ ఇన్‌ఛార్జిలను తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించినా.. తమ పార్టీ స్వతంత్రంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తూ బీజేపీ, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పౌర ప్రజా సంఘాలను ఐక్యం చేస్తున్నామని తెలిపారు. ఇటీవల హైద్రాబాద్‌లో శిక్షణా తరగతులు నిర్వహించి ప్రచారాంశాలపై నిపుణులతో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు.

భానుడు భగభగ

- విపరీతంగా ఎండలు, వేడి గాలులు
- లోక్‌సభ మూడో విడతపై ప్రభావం పడే అవకాశం : నిపుణులు
- రానున్న ఐదు రోజులు పలు రాష్ట్రాల్లో వేడిగాలులు : ఐఎండీ
- ఇందులో ఎన్నికలు జరిగే రాష్ట్రాలు కూడా.. ఓటు వేసేటప్పుడు ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి

ఐఎండీ సలహాలను పాటించాలి : ఆరోగ్య నిపుణులు




న్యూఢిల్లీ: దేశంలో మూడో దశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్నది. ఇలాంటి తరుణంలో రానున్న ఐదు రోజుల్లో పలు రాష్ట్రాల్లో వేడిగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. కీలక ఎన్నికల వేళ అధిక ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ పార్టీలు చేసే పోల్ ప్రచారాలలో వేలాది మంది ప్రజలు ఈ తీవ్ర ఎండల్లోనే పాల్గొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని సామాజికవేత్తలు అంటున్నారు. మే 7న ఓటింగ్ జరిగే అనేక రాష్ట్రాల్లో, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్, కర్నాటక, కేరళ, గోవా, తూర్పు యూపీలలో వేడిగాలులు ఉండే అవకాశం ఉన్నందున, మూడో దశ ఎన్నికలలో పాల్గొనటానికి భారతీయ ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ స్టేషన్ సిబ్బందిని సురక్షితంగా ఉంచేందుకు పార్టీలు, అధికారులు మరింత కృషి చేయాలని ఎన్నికల సంఘం(ఈసీ) కోరింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు వడదెబ్బ గురయ్యే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. సోలార్‌లో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్ ఉన్నది. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మండుతున్న వేడిగాలులు రోజువారీ జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఉష్ణోగ్రతలు భయంకరమైన స్థాయికి పెరుగుతాయని అంచనా. కేరళలోని కొల్లం, త్రిసూర్, పాలక్కాడ్‌లలోనూ ఐఎండీ హీట్ వేవ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఈరోజు చాలా చోట్ల హీట్ వేవ్ పరిస్థితులు ఉంటాయని తెలిపింది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మూడో విడత పోలింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ప్రజలు లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. తలపై టోపీ లేదా గుడ్డ కప్పుకోవాలి. ఎండలో ఎక్కువగా ఉండకూడదు. "ఎల్లప్పుడూ పుష్కలంగా ద్రవపదార్థాలు, నీటిని తీసుకోవాలి. రోజువారీ సూచనలతో పాటు భారత వాతావరణ శాఖ సలహాలను గమనించాలి, పాటించాలి" అని భారత వాతావరణ శాఖ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ అన్నారు. కాబట్టి ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలనీ, పాలనా యంత్రాంగాలు ఎండల విషయంలో సీరియస్‌గా దృష్టిని సారించి తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

- అధికారుల వేధింపులే కారణమని లేఖ
- వికారాబాద్ జిల్లా తాండూర్‌లో ఘటన



నవతెలంగాణ-తాండూరు

తాండూరు ఆర్టీసీ డిపోలో ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక ఓ డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం దౌలాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. దౌలాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రాజప్ప(47) కొన్ని రోజులుగా డిపోలో బస్సులకు డీజిల్ వేస్తున్నారు. ఈ మధ్యకాలంలో అతన్ని ఆ పనుల నుంచి తప్పించారు. దాంతో రాజప్ప తీవ్ర మనస్తాపానికి గురై తన స్వగ్రామంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించగా, తాండూరు ఆర్టీసీ డిపోలో ఉన్నతాధికారులు డీఎం, ఎంఎఫ్ జరనప్ప, సిద్దులు తన చావుకు కారణమని రాజప్ప లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు యాలాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తాండూర్ ఆర్టీసీ డిపోలో అధికారుల వేధింపులు పెరిగాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి

నవతెలంగాణ - చొప్పదండి/నిజాంసాగర్



కరీంనగర్, కామారెడ్డి జిల్లాల్లో ఎండ తీవ్రతకు తట్టుకోలేక మంగళవారం ముగ్గురు మృతిచెందారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన రైతు ఐతరవేణి రాజేశం(49) గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను నేర్పడానికి వెళ్లాడు. ఎండకు తట్టుకోలేక అక్కడే మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అక్కడికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సీఎం సభకు వచ్చిన మహిళ మృతి

జమ్మికుంటలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభకు వచ్చిన వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల ఐలమ్మ వడదెబ్బకు గురైంది. సభ అనంతరం ఇంటికెళ్లే క్రమంలో ఒక్కసారిగా కూప్పకూలి పరిస్థితి విషమించి మరణించింది.

వృద్ధురాలు మృతి

కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలంలోని గిర్నీ తండాకు చెందిన కడవత్ హిరి(65) రెండ్రోజులుగా వరి ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టి కుప్పలు చేసింది. అయితే ఎండ తీవ్రంగా ఉండటంతో అస్వస్థతకు గురై సోమవారం రాత్రి మృతిచెందినట్టు కుటుంబీకులు తెలిపారు.


కొద్ది మంది చేతిలోనే దేశ సంపద

- బ్రిటీష్ కాలం నాటి కంటే ఎక్కువ అసమానతల
- మోడీ పాలనలో దారుణ పరిస్థితులు
- అగమ్యగోచరంగా పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు
- ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు, సామాజికవేత్తల ఆందోళన

భారత్ స్వాతంత్ర్యం సాధించి 75 ఏండ్లు గడిచింది. ప్రజల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రాలేదు. ముఖ్యంగా, కేంద్రంలో మోడీ సర్కారు 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో పరిస్థితులు దారుణంగా మారాయని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు, సామాజికవేత్తలు అంటున్నారు. ఆర్థికాభివృద్ధి మేడిపండు చందంగా తయారైందని చెప్తున్నారు. సంపన్నులు మరింత సంపన్నులుగా అందనంత స్థాయికి ఎదుగుతున్నారనీ, పేదలు మాత్రం మరింత పేదరికంలోకి కూరుకుపోతున్నారని అంటున్నారు.

ఇక మధ్యతరగతి ప్రజల బాధలు ముందు నుయ్యి, వెనక గొయ్యిలా మారాయని వివరిస్తున్నారు. బ్రిటీషు కాలం నాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుత భారతంలోనే అసమానతలు ఇంకా ఎక్కువగా ఉన్నాయంటూ పలు గణాంకాలు, నివేదికలను వారు ఉటంకిస్తున్నారు.

న్యూఢిల్లీ : ప్రపంచంలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదో స్థానంలో ఉన్నదని మోడీ ప్రభుత్వం చెప్తున్నది. తమ పాలనలో భారత్ సాధించిన ఘనతగా దీనిని బీజేపీ ప్రచారం చేసుకుంటున్నది. అయితే, దేశంలో సంపద మాత్రం కొద్ది మంది చేతుల్లోనే పోగై ఉన్నదనీ, పేద, మధ్య తరగతి ప్రజలు ఇప్పటికీ ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్నారని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, 2014లో కేంద్రంలో మోడీ సర్కారు కొలువైనప్పటి నుంచి పదేండ్లలో దేశంలో దారుణ పరిస్థితులు



ఏర్పడ్డాయని వారు చెప్తున్నారు. అంబానీలు, అదానీలు ఒకరితో ఒకరు పోటీపడి ప్రపంచ సంపన్నులుగా ఎదుగుతున్నారనీ, పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రం కనీసం ఆదాయం లేక విలవిలలాడుతున్నారని అంటున్నారు. మోడీ పాలనలో పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణం, ధరలు, నిరుద్యోగం వంటి అంశాలు సామాన్య ప్రజలకు శాపంగా మారాయని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. ఇవన్నీ చూస్తే.. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషు కాలంలో ప్రజలు అనుభవించిన అసమానతల కంటే మోడీ పాలనలోనే అసమానతలు అధికంగా ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు.

అవినీతిని రూపుమాపుతాననీ, నల్లధనాన్ని తీసుకొస్తాననీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీలు గుప్పించి 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ.. బడా వ్యాపారవేత్తలు, కార్పొరేట్లకు దాసోహమన్నారని చెప్తున్నారు. వారికి అనుకూలంగా చట్టాలు తేవటం, సవరణలు చేయటం, పాలసీలు ప్రవేశపెట్టటం జరుగుతున్నదని అంటున్నారు. మోడీ పదేండ్ల పాలనలో పరిస్థితులు ఏమీ మారలేదనీ, దేశంలో ధనిక, పేదల మధ్య అంతరం అధికంగా ఉన్నదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌లో ఆదాయం, సంపదల్లో అసమానతలు ప్రపంచంలోనే అత్యధికం. ఇది బ్రెజిల్, దక్షిణాఫ్రికా, యూఎస్‌ల కంటే అధ్వాన్నంగా ఉన్నదని ప్రపంచ అసమానత ల్యాబ్ (డబ్ల్యూఐఎల్)కొత్త అధ్యయనం వెల్లడించింది. ఇటీవల ప్రచురితమైన 'ది రైజ్ ఆఫ్ ది బిలియనీర్ రాజ్'లోని పరిశోధన దేశంలో ఆదాయ అసమానత వాస్తవానికి బ్రిటిష్ వలస పాలనలో ఉన్నదానికంటే దారుణంగా ఉన్నదని చూపిస్తున్నది. భారత్‌లో పెరుగుతున్న సంపద అంతరం రాజకీయంగా చర్చకు దారి తీసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ.. మోడీ పాలనలో సాంప్రదాయకంగా వెనుకబడిన వర్గాలు ఎంతగా నష్టపోయాయో తెలియజేస్తూ కుల గణనను నిర్వహిస్తామని హామీ ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

1930లలో చాలా వరకు బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలించినప్పుడు ధనవంతులైన 1 శాతం మంది.. జాతీయ ఆదాయంలో కేవలం 20 శాతం కంటే ఎక్కువ మాత్రమే కలిగి ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఆ వాటా పడిపోయింది. 1940లలో అది సుమారుగా 10 శాతానికి చేరుకున్నది. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందినప్పుడు అది దాదాపు 12.5 శాతానికి చేరుకున్నది. ఇది 1960ల చివరి వరకు అలాగే కొనసాగింది. అప్పటి ప్రభుత్వాలు భారత్‌లో కొంతమేర సోషలిస్టు ఎత్తుగడలను అమలు చేయటంతో ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాయి. అధికారిక రాచరిక రాజ్యాలకు చెల్లించే చెల్లింపులు రద్దయ్యాయి. బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. టాప్ 1 శాతం మంది ధనికుల్లో జాతీయ ఆదాయం వాటా 1982 నాటికి దాదాపు ఆరు శాతానికి పడిపోయింది.

1991లో భారత్ తన ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేయటంతో పరిస్థితులు మారడం ప్రారంభించాయి. 2000 ఏడాది చేరటానికి టాప్ 1 శాతం మంది.. భారతదేశ ఆదాయంలో 15 శాతానికి పైగా కలిగి ఉన్నారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చేసరికి 20 శాతం దాటటం గమనార్హం. 2022-2023 నాటికి, ఇది అధికంగా 22.6 శాతానికి చేరుకున్నదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఈ గణాంకాలు.. మోడీ సర్కారు సంపన్నుల కోసం ఎంత కష్టపడుతున్నదోనన్న దృగ్విషయాన్ని వెల్లడిస్తున్నదనీ, పేదలు, మధ్య తరగతి పట్ల ప్రభుత్వానికి ఉన్న ఉదాసీన వైఖరిని స్పష్టం చేస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో, పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని అంటున్నారు. రాబోయే ఎన్నికల్లోనైనా ప్రజలు ఆలోచించి ఓటు వేసి.. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

ప్రజ్వల్, హెచ్‌డి రేవణ్ణలను తక్షణమే అరెస్టు చేయాలి

- మహిళా సంఘాల డిమాండ్

హస్సన్ : అభ్యంతరకర వీడియోలు, ఫోటోలతో మహిళలను బ్లాక్ మెయిల్ చేసి, లైంగిక దాడికి పాల్పడిన హసన్ సిట్టింగ్ ఎంపి, ప్రస్తుత ఎన్నికల్లో జెడి(ఎస్), బిజెపిల అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ, అతని తండ్రి హెచ్‌డి రేవణ్ణలను తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వాసహా పలు మహిళా, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రజల్వ రేవణ్ణకు వ్యతిరేకంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మంగళవారం హస్సన్‌లో వివిధ సంస్థలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. లైంగిక వేధింపుల బాధితుల ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ ఇప్పటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించాయి. రేవణ్ణపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని డిమాండ్ చేశాయి. బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలవాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కమిషనర్ ద్వారా ఒక మెమొరాండం అందజేశాయి. నిరసనల్లో కర్ణాటక ఐద్వా ప్రధాన కార్యదర్శి దేవి, ఉపాధ్యక్షురాలు గౌరమ్మ విమల, సిఐటియు జిల్లా అధ్యక్షులు ధర్మేష్, కెపిఆర్ఎస్ కర్ణాటక ఆర్థిక కార్యదర్శి హెచ్‌ఆర్ నవీన్‌కుమార్, రచయిత-సామాజిక ఉద్యమవేత్త రూపా హాసన్, ఎఐఎంఎస్ఎస్ నాయకులు, కర్ణాటక మహిళా యూనివర్శిటీ మాజీ సబిహ భూమి గౌడ తదితరులు పాల్గొన్నారు.



జెడిఎస్ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ సస్పెన్షన్

మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడు, హసన్ సిట్టింగ్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై జనతాదళ్ (ఎస్) వేటు వేసింది. ప్రజ్వల్ అసభ్యకర వీడియోలు గత కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవడంతో, జెడిఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజ్వల్ రేవణ్ణను సస్పెండ్ చేయాలని సొంత పార్టీ నేతల నుంచే డిమాండ్లు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు చెప్పారు. ప్రజ్వలపై సిట్‌ను స్వాగతిస్తున్నామని, సిట్ విచారణ పూర్తయ్యేవరకూ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పార్టీ జాతీయ అధ్యక్షుడికి సిఫారసు చేయాలని నిర్ణయించామని జెడి(ఎస్) కోర్ కమిటీ అధ్యక్షుడు జిటి దేవెగౌడ తెలిపారు.

ఏప్రిల్ 26న జరిగిన ఎన్నికల్లో హసన్ నుంచి జెడి(ఎస్), బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా ప్రజ్వల్ పోటీ చేశాడు. ఐపిఎస్ అధికారి విజయ్‌కుమార్‌సింగ్ నేతృత్వంలోని సిట్ కేసు దర్యాప్తును ప్రారంభించింది. ప్రజ్వల్ రేవణ్ణ కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటాగా విచారణ చేపట్టింది. ఈ అంశంపై మూడు రోజుల్లో వివరణాత్మక నివేదిక సమర్పించాలని కర్ణాటక డిజిపిని కోరింది.

మాజీ కారు డ్రైవర్ స్టేట్‌మెంట్ విడుదల

15 ఏళ్ల పాటు హెచ్‌డి రేవణ్ణ కుటుంబానికి డ్రైవర్‌గా పనిచేసి, గత ఏడాది నుంచి పనిమానేసిన కార్తీక్ ఈ కేసులో వీడియో స్టేట్‌మెంట్‌ను అజ్ఞాత ప్రదేశం నుంచి మంగళవారం విడుదల చేశారు. తండ్రీ కొడుకులపై లైంగిక వేధింపుల కేసులో వీడియో ఆధారాలను సిట్‌కు అందజేస్తానని తెలిపారు. తన భూమిని బలవంతంగా విక్రయించేలా చేశారని, ఆ విభేదాల నేపథ్యంలో పని మానివేసినట్లు చెప్పారు. తనపైనా, తన భార్యపైనా దాడి చేశారని వాపోయారు.

సిట్ సమన్లు

ప్రజ్వల్ రేవణ్ణ, అతని తండ్రి హెచ్‌డి రేవణ్ణలను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమన్లు జారీ చేసింది. తమ ఎదుట విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు పేర్కొన్నారు.

విజయవాడలో విషాదం

నలుగురు కుటుంబ సభ్యులను హత్య చేసి ఆత్మహత్య చేసుకున్న డాక్టర్

ఆర్థిక ఇబ్బందులే కారణం - కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

విజయవాడ : ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలను మాత్రమే గాక వైద్యుల వంటి మేథోజీవులను అతలాకుతలం చేస్తున్నాయి. పెద్ద మొత్తంలో ఖర్చుచేసి వైద్యవిద్యను చదివినప్పటికీ, కార్పొరేట్ చట్రంలో వారు బందీలు కావాల్సిందే! ఎంత నైపుణ్యం ఉన్నా యాజమాన్యాలు ఇచ్చే జీతపు రాళ్లతో సరిపెట్టుకోవాల్సిందే. తెగించి సొంత ప్రాక్టీసు పెట్టుకుందామన్నా దారుణమైన ప్రభుత్వ నిబంధనల కారణంగా అసాధ్యంగా మారుతోంది. అయినా, ధైర్యం చేసి ముందుకెళ్తున్న వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. సొంతగా ఆస్పత్రిపెట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఒక డాక్టర్ తాను ఆత్మహత్య చేసుకోవడంతో పాటు, కన్నతల్లిని, కట్టుకున్న భార్యను అభం, శుభం తెలియని ఇద్దరు చిన్నారులను బలిగొన్న దారుణ ఉదంతం మంగళవారం విజయవాడలో చోటుచేసుకుంది.

గురునానక్ కాలనీలో చోటుచేసుకున్న ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా వైద్య వర్గాల్లో కలకలం రేపింది. పైకి గంభీరంగా కనిపించే వైద్య వృత్తిలో కనిపించని కష్టాలను చర్చనీయాంశం చేసింది. పోలీసుల కథనం ప్రకారం.... నగరంలోని గురునానక్ కాలనీలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ డి.శ్రీనివాస్ (40)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబంతోపాటు తల్లి కూడా ఆయన వద్దే ఉంటున్నారు. మంగళవారం ఉదయం ఇంటికి వెళ్లిన పని మనిషికి బాల్కనీలో శ్రీనివాస్ ఉరి వేసుకుని ఉండడం కనిపించింది. ఆమె చూసి చుట్టుపక్కల వారికి చెప్పింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు లోపలకు వెళ్లి చూడగా శ్రీనివాస్ ఉరికి వేలాడుతూ కనిపించారు. ఆయన భార్య ఉష (38), కుమార్తె శైలజ (9), కుమారుడు శ్రీహాన్ (8), తల్లి రమణమ్మ (65) రక్తపు మడుగులో పడి ఉన్నారు. వారి మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వారి గొంతుకలు కోసి ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల డాక్టర్ శ్రీనివాసే కుటుంబ సభ్యులను హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.





డాక్టర్ శ్రీనివాస్ దంపతులు, వారి పిల్లలు (ఫైల్ ఫోటో)



మృతదేహాలను పోస్టుమార్టానికి తరలిస్తున్న దృశ్యం

తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు?

డాక్టర్ శ్రీనివాస్ గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ కోర్సును అభ్యసించారు. నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో కొన్నేళ్లు వైద్యులుగా సేవలందించారు. ఏడాది క్రితం సొంతంగా పుష్పా హోటల్ సెంటర్ సమీపంలో శ్రీజ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు.ఆస్పత్రి సరిగా నడవకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. ఆ మొత్తాన్ని తీర్చాలంటూ రుణదాతలు ఒత్తిడి చేయడం ప్రార భించారు. దీంతో కొంత కాలంగా ఆయన డిప్రెషన్‌లో పడిపోయినట్లు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో కుటుంబ సభ్యులను చంపి, తెల్లవారు జామున డాక్టర్ శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ హెచ్‌డిఎఫ్ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. డాక్టర్ శ్రీనివాస్ తన ఇంటి ఎదురుగా ఉన్న మరొకరి ఇంటి పోస్టు బాక్సులో 'నా కారు తాళం నా అన్నకు ఇవ్వాలి' అని రాసిన లెటర్ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఇది ఆత్మహత్యకు ముందు రాసిన లెటర్‌గా భావిస్తున్నారు.

సీఐటీయూలో చేరిన సీడబ్ల్యూసీ హమాలీ కార్మికులు



- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: సీఐటీయూ నేతలు

నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సెంటర్ వేర్ హౌసింగ్ బోర్డుకు చెందిన దాదాపు 200 మంది హమాలీ కార్మికులు, సొసైటీ అధ్యక్షుడు సోమగాని బాలరాజు బీఆర్‌టీయూ (బీఆర్ఎస్ అనుబంధం)కు రాజీనామా చేశారు. మంగళవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. హక్కుల సాధన, సౌకర్యాల కోసం హమాలీ కార్మికులను ఐక్యం చేసి సీఐటీయూ పోరాటం చేస్తుందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ గిడ్డంగి సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతూ ప్రయివేట్ వ్యక్తులకు లాభాలు తెచ్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేశంలో కోట్లాది మంది హమాలీలు ఎగుమతి, దిగుమతి విభాగాల్లో పనిచేస్తున్నారని, వారి వల్ల ప్రభుత్వానికి, వ్యాపార సంస్థలకు ఆదాయం అందుతోందని చెప్పారు. కానీ, హమాలీలకు కనీసం ఉండటానికి ఇల్లు, పిల్లల చదువులకు ఆదాయం కూడా సరిపోవడం లేదని, సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. హమాలీలను నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హత ఉన్న వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు హమాలీలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గిడ్డంగులను కాపాడాలని, ప్రయివేట్ వ్యక్తులకు గిడ్డంగుల నిర్వహణ బాధ్యత ఇవ్వొద్దని అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు సోమగాని బాలరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు యాకలక్ష్మీ ఎం.శేఖర్, వి.సాయికుమార్, శేషగాని సైదులు, నరిగే జాణయ్య, అల్లాస్‌శ్యామ్, మొగిలి లింగయ్య, తొంటి వెంకన్న, లునావత్ శంకర్, కొమ్మగాని శేఖర్, నకిరేకంటి పరమేశ్, సోమగాని భిక్షం, వీరబోయిన నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

దాడులు, ఊచకోతలకు మోడీ గ్యారంటీ..

- వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కావ్యకు సీపీఐ(ఎం) మద్దతు : సీపీఐ(ఎం) వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో.. కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- హాజరైన కడియం శ్రీహరి, కావ్య



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మోడీయే గ్యారంటీ అని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారని, గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 2 వేల మంది ముస్లీం మైనార్టీలను ఊచకోత కోసిన మాదిరిగా వారిపై దాడులు చేయడానికి మోడీ గ్యారంటీ అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. మంగళవారం హన్మకొండ పట్టణంలోని డీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన సీపీఐ(ఎం) వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశానికి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు నాగయ్య హాజరై మాట్లాడారు. దేశంలో మతోన్మాద పార్టీ బీజేపీని ఓడించే ఏకైక లక్ష్యంగా తమ పార్టీ ఇండియా కూటమిలో చేరిందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 16 పార్లమెంటు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ(ఎం) భేషరతుగా మద్దతునిస్తున్నట్టు చెప్పారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని తెలిపారు. 2014, 2019 ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. పదేండ్లు దేశాన్ని అంధకారంలోకి నెట్టిందని ఆరోపించారు. బీజేపీ మళ్లీ గెలిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతులుండవని, భారత దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన పదేండ్ల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లనే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసింది ప్రధాని మోడీనని అన్నారు. ఈడీ, సీబీఐ.. లాంటి స్వతంత్ర సంస్థలను ఉపయోగించి ఢిల్లీ, జార్ఖండ్ సీఎంలు కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ను మోడీ జైల్లో పెట్టారని తెలిపారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని కూడా ఉచ్చులో బిగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

పేదల గుడిసెలను కాపాడే బాధ్యత నాదే : కడియం శ్రీహరి

ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను కాపాడే బాధ్యత తనదేనని, పేద వర్గం నుంచి వచ్చిన బిడ్డగా, వామపక్షాల పక్షపాతిగా సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి పట్టాలిప్పిస్తానని కాంగ్రెస్ నాయకులు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీనిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, అవి బలంగా ఉండాలంటే వామపక్షాలు బలంగా ఉండాలన్నారు. లేదంటే నియంత పాలన వస్తదని తెలిపారు. 25–30 ఏండ్ల క్రితం ఇలాంటి సమావేశాల్లో పాల్గొన్నానని, నాడు ఐక్య ఉద్యమాలు చేశామని, సీపీఐ(ఎం) నాయకులు వెంకటయ్య, జి. నాగయ్య, సీపీఐ నాయకులు భగవాన్‌దాస్, కాళిదాస్ వంటి నేతలతో కలిసి ఐక్యంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. హయగ్రీవాచారి భూములు పేదలకు పంచాలని పోరాడామన్నారు. ఐక్య ఉద్యమాల వల్లనే ప్రజా సమస్యలపై తనకు అవగాహన వచ్చిందన్నారు. నాగయ్య, తాను కలిసి 3 వేల మందికి పట్టాలిప్పించామన్నారు. జనగామ నెల్లుట్ల వద్ద సీపీఐ(ఎం) నాయకత్వంలో వెయ్యి గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగించడానికి తీవ్రమైన ప్రయత్నం జరిగిందని, నాడు గుడిసెలు తొలగిస్తే బాగుండదని జనగామ కలెక్టర్‌కు తానే చెప్పానని తెలిపారు. కమ్యూనిస్టులు క్రమశిక్షణ కలిగిన వారని, ఊరూరు తిరిగి నా బిడ్డ కావ్యను గెలిపించాలని కోరారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదని, నిజాయితీగా పనిచేశానన్నారు. అదే నిజాయితీతో నా బిడ్డ పనిచేస్తుందని మాట ఇస్తున్నానన్నారు.

అందరికీ పట్టాలిప్పిస్తా : డాక్టర్ కడియం కావ్య

ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న మీ అందరికీ పట్టాలిప్పిస్తానని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. తాను ఈ రోజు ఈస్థాయికి ఎదిగానంటే అందుకు తన తండ్రితో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చలవేనన్నారు. ఇక్కడ పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి భూములు కనిపించినా, గుట్టలు కనిపించినా మింగేస్తాడన్నారు. వరంగల్, హన్మకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల కార్యదర్శులు సిహెచ్.రంగయ్య, బొట్ల చక్రపాణి, మోకు కనకారెడ్డి, బందు సాయిలు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె. వెంకటేశ్, నాయకులు వాసుదేవరెడ్డి, నలింటి రత్నమాల, టి ఉప్పలయ్య, ముక్కెర రామస్వామి, గుమ్మడిరాజుల రాములు, వాంకుడోతు వీరన్న పాల్గొన్నారు.



పోరాటాలకు ఊతమిచ్చే కవిత్వం రావాలి

- శ్రీశ్రీ కవిత్వం... పునర్జీవన ఇంధనం...
- కవిత్వం... వర్గ సంఘర్షణకు ఉత్సాహమివ్వాలి
- శ్రామిక కవి సమ్మేళనంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మనుషులను కలిపి ఉంచే పోరాటాలకు ఊతమిచ్చే కవిత్వం పెద్ద ఎత్తున రావాల్సిన అవసరముందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీశ్రీ జయంతి, మేడే సందర్భంగా తెలంగాణ సాహితీ నగర అధ్యక్షులు ఏబూషి నర్సింహ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రామిక కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. కవి యాకూబ్ ముఖ్య అతిథిగా, ప్రముఖ కవయిత్రి మహెజబీన్ విశిష్ట అతిథిగా, తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. కవయిత్రులు నస్రీన్ ఖాన్, ఎస్.కె.సలీమా ఈ సమ్మేళనాన్ని నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలతో వక్తలు, నిర్వాహకులందరూ నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మహెజబీన్ మాట్లాడుతూ వనరుల దోపిడీ పాలనలో ఒక భాగంగా మారిపోయిన తరుణంలో శ్రీశ్రీ వారసత్వాన్ని కొనసాగించడమే ఆయనకు అర్పించే నివాళి అని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో సమూహ సమ్మేళనంపై ఏబీవీపీ దాడి జరిగాక, గతంలో యూనివర్సిటీల్లో జరిగిన దాడులు గుర్తుకొచ్చాయని తెలిపారు. రచయితలు, కవులు కూడా కార్మికులేనని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యార్థి, యువతను మరింత చైతన్యం చేయాల్సిన అవసరముందని సూచించారు. వర్తమాన రాజకీయ నేపథ్యంలో అనేక ఉద్యమాలను ఐక్యంగా ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తాను రాసిన ' ప్రశ్నే దేశద్రోహమైంది' అనే కవితను చదివి వినిపించారు.

కవి యాకూబ్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికోద్యమం, శ్రీశ్రీ జీవితం సమాంతరంగా సాగాయని గుర్తుచేశారు. మనుషులంతా వేరు వేరుగా అవుతున్న కాలంలో, స్వేచ్ఛ, లౌకికవాదం ప్రస్తావన తీస్తే ఒప్పుకోని కాలంలో వస్తున్నాయ్ వస్తున్నాయ్ జగన్నాథుని రథ చక్రాలొస్తున్నాయ్.... అంటూ శ్రీశ్రీ మానవాళికి ఒక నిరీక్షణనిచ్చారని చెప్పారు. మనుషులందర్నీ స్నేహితులుగా చేసుకునే దగ్గరి నుంచి మనుషుల్లో వేషభాషలను చూసి మనవారిని ఎంచుకునే రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిలో పునర్జీవనం కావడానికి ఉపయోగపడే ఇంధనమే శ్రీశ్రీ కవిత్వం అని తెలిపారు.

కె.ఆనందాచారి మాట్లాడుతూ మార్క్స్ చెప్పిన సారాంశాన్నే శ్రీశ్రీ అందించారని తెలిపారు. ఫాసిజం ప్రపంచమంతా, ముఖ్యంగా మన దేశంలో విస్తరించేందుకు యత్నిస్తున్న తరుణంలో శ్రీశ్రీ కవిత్వం మరింత అవసరమైందని తెలిపారు. మనుషులను విభజిస్తున్న ఈ పరిస్థితిలో వర్గ సంఘర్షణతోనే మనిషి మనిషిగా మారతాడని తెలిపారు. హిందూ – ముస్లీం ఘర్షణ జరిగిన ముజఫర్‌నగర్‌లో రైతు ఉద్యమంతో వర్గ సంఘర్షణ వారిని కలిపిందని చెప్పారు. అలాంటి సంఘర్షణకు ఉత్సాహమిచ్చే కవిత్వం రావాలని ఆకాంక్షించారు. సంపద సృష్టికర్తలు శ్రామికులేననే విషయాన్ని జగమంతా చెప్పాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో సమూహ సమావేశంపై జరిగిన దాడిని సమ్మేళనం తీవ్రంగా ఖండించింది. కార్యక్రమంలో హనీఫ్, జ్వలిత, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు కవితలను చదివి వినిపించారు.

ఇద్దరు ఎమ్మెల్యేలకు నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్టేషన్ ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులపై అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు ఇవ్వాలనే కేసులో హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ విజయసేనరెడ్డి విచారించారు. ప్రతివాదులైన కడియం, తెల్లం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ, శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘాలకు నోటీసులు ఇచ్చింది. విచారణను జూన్ 5వ తేదీకి వాయిదా వేసింది. వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ చేసేందుకు వెళితే అసెంబ్లీలోకి అనుమతివ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు చెప్పినట్టుగా ప్రభుత్వ ప్లీడర్ ద్వారా ఫిర్యాదులను స్పీకర్ ఆఫీసుకు అందజేశామని ఏజీ చెప్పారు. దీంతో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులిచ్చింది.



శ్రీనివాసరావు | నామవరపు రాజేశ్వర్‌రావుల

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ జగన్నగారి శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావులతో మంగళవారం హైకోర్టులో ప్రమాణస్వీకారం చేయిస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే.

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

- ఐదు కిలోమీటర్ల మేర వెదజల్లుతున్న లావా, బూడిద
- వేలాదిమంది ప్రజల తరలింపు

మనదో (ఇండోనేషియా) : ఇండోనేషియాలోని మౌంట్ రువాంగ్ అగ్నిపర్వతం బద్దలై పెద్ద మొత్తంలో బూడిదను, లావాను వెదజల్లుతోంది. ఐదు కిలోమీటర్లకు పైగా లావా ప్రవహిస్తోంది. ఈ నెల్లోనే ఈ అగ్నిపర్వతం పలుసార్లు విస్ఫోటనం చెందిందని, ఉన్నత స్థాయి అలర్ట్‌ను జారీ చేశామని అధికారులు తెలిపారు. దీంతో ఆ సమీప ప్రాంతాల నుండి 6వేల మందికి పైగా ప్రజలను ఖాళీ చేయించారు. ఇంకా వేలాదిమందిని తరలించాల్సి వుంది, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రతినిధి అబ్దుల్ ముహారి పత్రికా సమావేశంలో తెలిపారు. సైన్యం, పోలీసులు ఈ తరలింపు కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజలు, అధికారులు అలసత్వం ప్రదర్శించరాదని, అగ్నిపర్వతం ముప్పు పూర్తిగా తొలగిపోలేదని అగ్నిపర్వత అధ్యయన వ్యవహారాల సంస్థ హెచ్చరించింది.

ఇండోనేషియాలోని ఉత్తర సులవేశి ప్రావిన్స్‌లో వున్న రువాంగ్ అగ్నిపర్వతం స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారు జామున 1.15 గంటలకు విస్ఫోటనం చెందింది. ఆ తర్వాత రెండుసార్లు కూడా లావా, బూడిదను వెదజల్లిందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆకాశంలో దాదాపు ఐదు కిలోమీటర్లకు పైగా ఎత్తున బూడిద మేఘాలు తయారయ్యాయని పేర్కొంది.


పిటిషన్లు డిస్మిస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ సీట్లకు నామినేషన్లు దాఖలు చేస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారంటూ దాఖలైన మూడు పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పులు చెప్పింది. మెదక్‌లో కల్లు నర్సింలు గౌడ్, నల్లగొండలో వీరబ్రహ్మ రవి, మల్కాజ్‌గిరిలో షేక్ తౌఫీక్ వేసిన నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించడాన్ని ఆ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా పైతీర్పులు వెలువడ్డాయి.

నవచిత్రం

మెప్పించే యాక్షన్ ఎంటర్‌టైనర్



ఆనంద్ దేవరకొండ

"బేబి" వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకుల ముందుకొస్తున్న సినిమా "గం..గం..గణేశ". ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్ టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్‌లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం.

ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు మేకర్స్. ఈనెల 31న సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. సరికొత్త కంటెంట్‌తో ఈ సమ్మర్‌లో అన్ని వర్గాల ఆడియెన్స్‌ను ఈ సినిమా ఎంటర్‌టైన్ చేయనుందని, ఈ సమ్మర్‌లో మరో బ్లాక్‌బస్టర్ మూవీ అవుతుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఆనంద్ దేవరకొండ, ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యుయల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ : పూజిత తాడికొండ, ఆర్ట్: కిరణ్ మామిడి, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం – చేతన్ భరద్వాజ్, కొరియోగ్రఫీ: పొలాకి విజయ్, కో–ప్రొడ్యూసర్ –అనురాగ్ పర్వతనేని

సర్‌ప్రైజ్ చేసే కంటెంట్ ఉంది



జె.ఎస్.మణికంఠ

సుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం'. డైరెక్టర్ సుకుమార్ అసో సియేట్‌గా పని చేసిన అర్జున్ వై కె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జెఎస్ మణికంఠ, టి ఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈనెల 3న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాత జెఎస్ మణికంఠ మీడియాతో ముచ్చటించారు.

"కలర్ ఫోటో, ఫ్యామిలీ డ్రామా' చిత్రాలకు సహ నిర్మాతగా చేశాను. ఓ స్నేహితుడి ద్వారా ఈ కథ నా దగ్గరకి వచ్చింది. సుకుమార్ దగ్గర దర్శకుడు అర్జున్ పని చేశారు. తను చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. సుహాస్‌కి వినిపిస్తే ఆయనకి కూడా నచ్చింది. అలా ప్రాజెక్ట్ మొదలైంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా సినిమా చేశాం. నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. బిజినెస్ పరంగా లాభాల్లో ఉన్నాం. మైత్రీ, హెూంబలే లాంటి పెద్ద సంస్థలు ఈ సినిమాని విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫేస్ బ్లైండ్ నెస్ కాన్సెప్ట్‌తో వస్తుంది. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ సినిమాలో ఇప్పటికీ రాలేదు. ఇది అన్నీ వర్గాల ప్రేక్షకులని అలరించేలా ఉంది. చివరి వరకూ సర్‌ప్రైజ్ అయ్యే కంటెంట్ ఉంది. ఇలాంటి కాన్సెప్ట్ సినిమాలు ఇతర భాషల్లో కూడా విడుదల చేస్తారు. మేం కూడా అదే ప్రయత్నాల్లో ఉన్నాం. తమిళంలో ఓ పెద్ద సంస్థ నుంచి మంచి ఆఫర్ వచ్చింది. డబ్బింగ్ చేయాలా లేక రిమేక్ చేయాలా అనేది చర్చిస్తున్నాం. సుహాస్ తెలుగు పరిశ్రమకి అదృష్టం. తనపై కొత్తకథలు వర్క్ అవుట్ అవుతున్నాయి. తను చాలా క్రమశిక్షణ గల నటుడు. నిర్మాతలకు, దర్శకులకు కంఫర్ట్‌బుల్‌గా ఉంటాడు. తనతో వర్క్ చేయడం చాలా మంచి అనుభవం. ఈ సినిమా తప్పకుండా మా అందరికీ మంచి సినిమా అవుతుంది' అని తెలిపారు.

బ్రహ్మచారి రిలీజ్‌కి రెడీ



మల్లేశం, స్వప్న

అద్వితీయ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై రాంభూపాల్ రెడ్డి నిర్మాతగా నర్సింగ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'బ్రహ్మచారి'. ఏఎన్నార్, కమల్ హాసన్ లాంటి మహామహులు నటించిన 'బ్రహ్మచారి' టైటిల్‌తో వచ్చిన సినిమాలు బాగా సక్సెస్ అయినట్లే తెలంగాణ యాసలో వస్తున్న పర్‌ఫెక్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందింది. యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్ చేసే మల్లేశం హీరోగా నటించిన ఈ చిత్రం ఈనెల 10న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర యూనిట్‌కు విషెస్ తెలియజేశారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, సీనియర్ డైరెక్టర్ చంద్ర మహేశ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

హీరో గుంట మల్లేశం మాట్లాడుతూ, 'నేను ఒగ్గుకథ కళాకారుణ్ణి. అలాంటి నన్ను నర్సింగ్ ఆర్టిస్ట్ చేశాడు. ఇలాంటి మంచి కామెడీ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. ఈనెల 10న విడుదలయ్యే ఈ సినిమా ఎలా ఉంటుందో చెప్పేందుకు ఇదొక శాంపిల్ మాత్రమే. మా సినిమా టీమ్‌ను ఆశీర్వదించాల్సిందిగా ప్రేక్షకులందరినీ కోరుతున్నా' అని అన్నారు. 'ఈ సినిమా తీయడానికి కథ చెప్పేటప్పుడు చాలా నేచురల్‌గా అనిపించింది. ఊళ్లో రచ్చబండ వద్ద మాట్లాడుకునేలా ఉంది. సినిమా తీశాక చాలా అద్భుతంగా వచ్చింది. ఈ చిత్రాన్ని నాలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాం. ఈ సినిమా మంచి హిట్ అయితే మరిన్ని సినిమాలు తీసే ప్రోత్సాహం లభిస్తుంది. ప్రేక్షకులంతా ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నా' అని నిర్మాత రాంభూపాల్ రెడ్డి చెప్పారు.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు
చెన్నై X పంజాబ్
వేదిక : చెన్నై, రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

పంత్‌కు పిలుపు

- దూబె, శాంసన్, చాహల్‌కు చోటు
- టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు ఎంపిక

ఐసీసీ టైటిల్ వేటలో దశాబ్ది నిరీక్షణకు తెరదించగల గెలుపు గుర్రాలు సిద్ధం. 2024 టీ20 ప్రపంచకప్‌లో పోటీపడే భారత జట్టుకు రోహిత్ శర్మ సారథ్యం వహించనుండగా.. రిషబ్ పంత్, సంజు శాంసన్, శివం దూబె, చాహల్‌లు జట్టులో చోటు సాధించారు. ఈ మేరకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ మంగళవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది.





నవతెలంగాణ-అహ్మదాబాద్

ఉత్కంఠ వీడింది. నిరీక్షణకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన భారత టీ20 ప్రపంచకప్ జట్టును మంగళవారం ప్రకటించారు. అహ్మదాబాద్‌లోని ఓ హెూటల్‌లో సమావేశమైన సీనియర్ సెలక్షన్ కమిటీ, బోర్డు కార్యదర్శి జై షా వరల్డ్‌కప్ గెలుపు గుర్రాలను ఎంపిక చేశారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌ను ఫైనల్స్‌కు చేర్చిన రోహిత్ శర్మకే మరోసారి సారథ్య పగ్గాలు దక్కాయి. హార్దిక్ పాండ్య వైస్ కెప్టెన్సీ బాధ్యతలు చూసుకోనున్నాడు. తీవ్ర రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకున్న యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్.. సుమారు రెండేండ్ల తర్వాత భారత జట్టులోకి వచ్చాడు. యువ ఆల్‌రౌండర్ శివం దూబె సహా సంజూ శాంసన్, మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ వరల్డ్‌కప్ జట్టులో నిలిచారు. వెస్టిండీస్, అమెరికా సంయుక్త ఆతిథ్యంలో ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్ జూన్ 2 నుంచి ఆరంభం కానుండగా.. టీమ్ ఇండియా వేట జూన్ 5న ఆరంభం కానుంది. గ్రూప్ దశలో ఐర్లాండ్, పాకిస్థాన్, యుఎస్ఏ, కెనడాలతో భారత్ ఢీకొట్టనుంది.

ఐపీఎల్ స్టార్స్‌కు దక్కని చోటు : ఐపీఎల్ 17వ సీజన్లో వీరోచితంగా ఆడుతున్న కుర్రాళ్ల ప్రదర్శనను సెలక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. యుఎస్ఏ, కరీబియన్ దీవుల పిచ్‌ల స్వభావం, అక్కడ రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను బేరీజు వేసుకుని 15 మంది ఉత్తమ ఆటగాళ్లను ఎంపిక చేశారు. బ్యాటింగ్ లైనప్‌లో కెప్టెన్ రోహిత్ శర్మకు తోడుగా యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా రానున్నాడు. విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్ మిడిల్ ఆర్డర్‌లో రానున్నారు. రెండో వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్ ఎంపికయ్యాడు. పేస్ ఆల్‌రౌండర్లుగా హార్దిక్ పాండ్య, శివం దూబె జట్టులో నిలువగా.. స్పిన్ ఆల్‌రౌండర్లుగా అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా నిలిచారు. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్ ఎంపికయ్యారు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ స్పెషలిస్ట్ పేసర్లుగా జట్టులో నిలిచారు. రిజర్వ్ ఆటగాళ్లుగా నలుగురిని ఎంపిక చేశారు. ప్రత్యామ్నాయ ఓపెనర్‌గా శుభ్‌మన్ గిల్, లోయర్ ఆర్డర్‌లో రిజర్వ్ ప్లేయర్‌గా రింకూ సింగ్ నిలువగా.. ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్‌లు రిజర్వ్ పేస్ బౌలర్లుగా ఎంపికయ్యారు.

మే 2న మీడియా ముందుకు! : ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో పోటీపడే భారత జట్టుపై మాట్లాడేందుకు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్ శర్మ మీడియా ముందుకు రానున్నారు. మే 3న వాంఖడేలో ముంబయి ఇండియన్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ మ్యాచ్ ఉండగా.. ముందు రోజు మే 2న ముంబయిలో మీడియా సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు మీడియా సమావేశం ఉంటుందని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది.



టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్, సంజు శాంసన్, హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), శివం దూబె, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్. (రిజర్వ్ ప్లేయర్స్ : శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్).

స్టోయినిస్ షో

- ముంబయిపై లక్నో గెలుపు
- ముంబయి 144/7, లక్నో 145/6

లక్నో : మార్కస్ స్టోయినిస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఊరించే ఛేదనలో అర్థ సెంచరీ సాధించిన మార్కస్ స్టోయినిస్ (62, 45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) లక్నో సూపర్‌జెయింట్స్‌కు మెరుపు విజయాన్ని అందించాడు. కెఎల్ రాహుల్ (28), దీపక్ హుడా (18), నికోలస్ పూరన్ (14 నాటౌట్) రాణించారు. 19.2 ఓవర్లలోనే లాంఛనం ముగించిన లక్నో సీజన్లో ఆరో విజయం నమోదు చేసింది. అంతకముందు, లక్నో సూపర్‌జెయింట్స్ బౌలర్లు పంజా విసిరారు. పవర్‌ప్లేలోనే విజృంభించిన బౌలర్లు ముంబయి ఇండియన్స్ టాప్ ఆర్డర్‌ను కకావికలం చేశారు. నెహల్ వదేరా (46, 41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు),



టిమ్ డెవిడ్ (35 నాటౌట్, 18 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకోవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 144 పరుగులు చేసింది. ముంబయి ఇండియన్స్ సీజన్లో ఏడో పరాజయంతో ప్లే ఆఫ్స్ రేసుకు దాదాపుగా దూరం కాగా.. లక్నో సూపర్‌జెయింట్స్ మూడో స్థానానికి ఎగబాకింది. మార్కస్ స్టోయినిస్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.